తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

సచిత్రమాసపత్రిక

సెప్టెంబరు 2016 వెల రూ.5/-



నీ గుణగానము చేసి
లోకులను, లోకములను తరియింప చేసిన
ఆళ్వారుల పావనజీవనం పై
విశేష సంచిక



# తిరుమల
# శ్రీ వేంకటేశ్వరస్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు-2016
## అక్టోబరు 02 నుండి 11 వరకు

| తేదీ | వారము | పగటి ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 02-10-2016 | ఆదివారం | -- | సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం. |
| 03-10-2016 | సోమవారం | వజ్రకవచాద్యాభరణాలతోబంగారుతిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం | పెద్దశేషవాహనం. |
| 04-10-2016 | మంగళవారం | చిన్నశేషవాహనం | హంసవాహనం. |
| 05-10-2016 | బుధవారం | సింహవాహనం | ముత్యపుపందిరివాహనం. |
| 06-10-2016 | గురువారం | కల్పవృక్షవాహనం | సర్వభూపాలవాహనం. |
| 07-10-2016 | శుక్రవారం | పల్లకీలో మోహినీ అవతారోత్సవం | గరుడవాహనం. |
| 08-10-2016 | శనివారం | హనుమద్వాహనం | గజవాహనం. |
| 09-10-2016 | ఆదివారం | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం. |
| 10-10-2016 | సోమవారం | రథోత్సవం | అశ్వవాహనం. |
| 11-10-2016 | మంగళవారం | పల్లకీ ఉత్సవం, తీర్థవారి అవభృథోత్సవం, చక్రస్నానం | తిరుచ్చిలో ధ్వజావరోహణం. |



# ఊరకే దొరకునా....!!

ఊరకే దొరకునా- ఉన్నతోన్నత సుఖము,
సారంబు దెలిసి కా - జయము చేకొనుట.

తలఁపు లోపలిచింత - దాఁటినప్పుడు గదా!
అలరి దైవంబు ప్ర - త్యక్షమౌట,
కలుషంపు దుర్మదము - గడచినప్పుడు గదా!
తలకొన్న మోక్షంబు - తనకుఁ జేపడుట.

కర్మంబు కసటువోఁ - గడిగినప్పుడు గదా!
నిర్మలజ్ఞానంబు - నెరవేరుట,
మర్మంబు శ్రీహరిని - మఱఁగు చొచ్చినఁ గదా!
కూర్మిఁ దన జన్మమె - క్కుడు కెక్కుడౌట.

తనశాంత మాత్మలోఁ - దగిలినప్పుడు గదా!
పనిగొన్న తన చదువు - ఫలియించుట,
ఎనలేని శ్రీవేంక- టేశ్వరుని దాస్యంబు
తనకు నబ్బినఁ గదా - దరిచేరి మనుట.

(సంపుటం 2 - సంకీర్తన 104)

శ్రేష్ఠాతిశ్రేష్ఠమైన మోక్షసుఖము తగిన ప్రయత్నము లేక ఊరక చేజిక్కేది గాదు. ఒక పనిలో గెలుపొందాలంటే అందలి సారము తెలిసి దానికనుగుణమైన సాధనసంపత్తి గలిగియుండాలి.

తలపులోనున్న చింతలన్నిటిని దాటి మనస్సును సంపూర్ణంగా భగవంతునికి సమర్పించినపుడే దైవము ప్రత్యక్షమౌతుంది. పాపభూయిష్ఠమైన దుర్మదాన్ని తొలగించుకొన్నప్పడే తాను కోరిన ముక్తి తనకు వశమౌతుంది.

జన్మజన్మలనుండి తనను వెన్నంటి వచ్చే కర్మపుమాలిన్యాన్ని పూర్తిగా కడిగివేసినపుడే నిర్మలమైన జ్ఞానం గలుగుతుంది. హృదయము శ్రీహరి మఱుగు చొచ్చినపుడే ప్రియమైన తనపుట్టుక అత్యుత్తమమౌతుంది.

ఆత్మలో శాంతి నెలకొన్నప్పడే ప్రయత్నపూర్వకంగా తానభ్యసించిన చదువు ఫలప్రదమౌతుంది. సాటిలేని శ్రీవేంకటేశ్వరుని దాస్యము తనకు లభించినప్పడే తాను సంసారమనెడి సాగరంయొక్క గట్టు చేరి సుఖించును.

ఒంటిమిట్టగ్రామం, వై.యస్.ఆర్. కడపజిల్లా.

## శ్రీ కోదండరామస్వామివారిఆలయం

### ఆర్జితసేవల వివరాలు




1) శ్రీసీతారామలక్ష్మణస్వామివారలకు ప్రతి శనివారం ఉదయం 6.00 గం॥లకు అభిషేకం జరుపబడుతుంది.

2) ఈ సేవలో రూ.150/- రుసుముతో ఇద్దరు వ్యక్తులు పాల్గొనవచ్చు.

3) శ్రీఆంజనేయస్వామికి ప్రతి మంగళవారం ఉదయం 6.00 గంటలకు అభిషేకం జరుపబడుతుంది. ఇందులో అందరూ పాల్గొనవచ్చు.

4) శ్రీసీతారాములకు నెలకోమారొచ్చే పున్నమిరోజున ఉదయం 10.00 గం॥లకు పున్నమికల్యాణం జరుపబడుతుంది.

5) ఈ సేవలో రూ.1000/- రుసుముతో ఇద్దరు వ్యక్తులు పాల్గొనవచ్చు.

6) పై సేవల్లో పాల్గొన్న గృహస్థులకు ఉత్తరీయము, రవికవస్త్రం ఇవ్వబడుతాయి.

7) పై సేవల్లో పాల్గొనే గృహస్థులు సంప్రదాయ వస్త్రధారణను తప్పని సరిగా పాటించాలి.



## 2016 అక్టోబరు నెల ఉత్సవాలు, పర్వదినాలు.

**02 నుండి 11 వరకు**
శ్రీవేంకటేశ్వరస్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు, తిరుమల.

శ్రీవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు, ఉపమాక.

**07** సరస్వతీపూజ

**09** దుర్గాష్టమి

**10** మహర్నవమి

**11** విజయదశమి

**12** తిరుమల శ్రీవారి బ్యాక్‌సవారీఉత్సవం

**13 నుండి 16 వరకు**
శ్రీ పట్టాభిరామస్వామివారి పవిత్రోత్సవాలు, వాల్మీకిపురం.

**14 నుండి 15 వరకు**
శ్రీకరివరదరాజస్వామివారి పవిత్రోత్సవాలు, సత్రవాడ.

**25 నుండి 28 వరకు**
శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి పవిత్రోత్సవాలు, శ్రీనివాసమంగాపురం.

**29** నరకచతుర్దశి

**30** దీపావళి, శ్రీకేదారగౌరీవ్రతం.



> వేంకటాద్రిసమం స్థానం
> బ్రహ్మాండే నాస్తి కించన।
> వేంకటేశసమో దేవో
> న భూతో న భవిష్యతి ॥


తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 47 సెప్టెంబరు, 2016 సంచిక : 04


## ఈ నెలలో....



ముఖచిత్రం : శరణం నీ దివ్యచరణం!!
వెనుకచిత్రం : శ్రీవరాహస్వామి


**గౌరవ సంపాదకులు**
డా॥ డి. సాంబశివరావు, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి,
తి.తి.దేవస్థానములు.

**పర్యవేక్షకులు**
శ్రీ ఎన్.ముక్తేశ్వరరావు, ఐ.ఏ.ఎస్. (విశ్రాంత),
విశేషాధికారి,
ప్రాజెక్టులు, తి.తి.దే.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు(ఎఫ్.ఏ.సి.),**
**సంపాదకులు**
డా॥ కె.రాధారమణ

**ఉపసంపాదకురాలు**
శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి,
ఎం.ఏ., ఎం.ఇడి.,

**ముద్రాపకురాలు**
శ్రీమతి ఎమ్.గౌతమి, ఎం.బి.ఏ.,
ఉపకార్యనిర్వహణాధికారి(ప్రచురణలు & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి

**వర్ణ చిత్ర పుటలు**
శ్రీ పి.శివప్రసాద్

**రూపకల్పన**
శ్రీ బి.గురుకుమార్ రెడ్డి

సప్తగిరి మాస పత్రిక

ఇతర వివరాలకు
0877-2264543

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-





24 గంటలు పనిచేసే తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777 / 2233333


స్థలాభావం వల్ల 'తిరుమల విశిష్టత' ధారావాహిక ప్రచురించలేకపోతున్నాం. పాఠకులు గమనించగలరు.



# ఆళ్వారుల బాటలో....

భగవంతునిపట్ల తైలధారలాగ అవిచ్ఛిన్నంగా ప్రవహించే ప్రేమభావనే భక్తి. సకలకల్యాణగుణపరిపూర్ణుడైన దేవదేవుని స్వరూప రూపగుణవైభవాలను అనన్య ప్రేమతో అనుభవించడమే భక్తి. ఇలాంటి భగవద్భక్తిసాగరంలో మునకలు వేస్తూ లోతులు చూసిన శ్రీవైష్ణవ భక్తశిఖామణులు ఆళ్వారులు. వీరు శ్రీవైష్ణవసంప్రదాయానికి మూలపురుషులు. వీరు పన్నెండుమందున్నారు. వీరికే ద్వాదశసూరులు అని పేరు.

భూతం సరశ్చ మహదాహ్వయ భట్టనాథ, శ్రీభక్తిసార కులశేఖర యోగివాహాన్ ।
భక్తాంఘ్రిరేణు పరకాల యతీంద్ర మిశ్రాన్, శ్రీ మత్పరాంకుశ మునిం ప్రణతోస్మి నిత్యమ్ ॥

ఈ మహాత్ములు ద్రావిడదేశంలో అవతరించి ద్రవిడభాషలో శ్రీమన్నారాయణుడి అనంతకల్యాణ గుణచేష్టితాలను అనన్యభక్తితో నాలుగువేలపాశురాలలో కీర్తించారు. పాశురమంటే పద్యమని అర్థం. వీరు తమ పాశురాలను శ్రీవైష్ణవదివ్యదేశాల్లో వెలసిన భగవదర్చామూర్తులను పలువిధాల ప్రస్తుతించారు. వేదవేదాంత సారస్వరూపాలూ, భక్తిప్రచురాలూ ఐన వీరి రచనలు నాలాయిర దివ్యప్రబంధమనే పేరుతో ప్రఖ్యాతి వహించాయి. మహాభక్త కవిశిరోమణులైన ఆళ్వారులు చెప్పిన పాశురాలు వైష్ణవదేవాలయాల్లో నిత్యపఠనీయాలు.

ఆళ్వార్లు ప్రస్తుతించిన దివ్యప్రబంధ పాశురాలలో భక్తి పారవశ్యమే కాక గంభీరమైన వేదాంత విషయాలు విశదీకరించబడ్డాయి. శ్రీమన్నారాయణ పరతత్త్వాన్ని చాటిచెప్పే విశిష్టాద్వైత సిద్ధాంతం ప్రధానంగా అష్టాక్షరీ, ద్వయమంత్రం, చరమశ్లోకం గురించి వివరిస్తుంది. పరమాత్మస్వరూపం, జీవస్వరూపం, జీవునికి ఈశ్వరునికి గల సంబంధం, మోక్షోపాయం వంటి అనేక వేదాంత విషయాలు ఈ పాశురాలలో సుస్పష్టంగా నిరూపించబడ్డాయి. అందుకనే భగవద్రామానుజులు కూడా ఈ ఆళ్వార్ల ప్రబంధాలను పరమప్రమాణాలుగా సంభావించారు.

ఈ సంచికను భగవద్రామానుజులవారి సహస్రాబ్ది సందర్భంగా భక్తిపూర్వక నీరాజనంగా సమర్పిస్తున్నాం. ఆళ్వార్లు చూపిన వెలుగుదారులలో పయనిస్తూ నరునికీ నారాయణునికీ నిత్యానుసంధానంగా సాగిన దివ్యప్రబంధాన్నీ, దానిని లోకంకోసం సులభంగా అర్థమయ్యేందుకు అనుభూతిసుందరంగా అందించిన ఆళ్వార్లందరికీ నమశ్శతాలతో ఈ సంచికలో ఆళ్వార్ల జీవన సందేశాన్ని కొండను అద్దంలో చూపించినట్లుగా చూపించటానికి ప్రయత్నం చేశాం.

తండ్రీ! “నా ఈ జన్మకు ఇదే చాలు. నేను అడగాల్సినది, నువ్వు అనుగ్రహించేది కూడా అదే – నీ దాసుల దాసుల దాసుల దాసుల దాసుడనై జీవించే వరమొక్కటి” – అన్న కులశేఖరాళ్వార్ల బాటలో మనమందరం నడుద్దాం.

మజ్జన్మనః ఫలమిదం మధుకైటభారే! మత్ప్రార్థనీయ మదనుగ్రహ ఏషఏవ ।
త్వద్భృత్యం భృత్య పరిచారక భృత్య భృత్య భృత్యస్య భృత్య ఇతిమాం స్మరలోక నాథ! ॥

# దివ్యప్రబంధం - వేదసామ్యం

- శ్రీ మెలుగు వేంకటాచార్యులు




**భా**రతీయసంస్కృతిలో సమాజం ఉనికికి, వ్యక్తి నడవడికి మూలాలుగా నిలిచేవి వేదాలు. ఇవి ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణవేదం అని నాలుగు. అనాదిగా ఒకతరంనుండి మరొకతరం వారికి వాగ్రూపంలో అందిస్తూ అపురూపవారసత్వ సంపదగా కాపాడబడుతున్న శబ్దరాశి. జాతికి జ్ఞాననిధి. ఇహపర సుఖాలకోసం మానవుడెలానడచుకోవాలి? ఏం చేయాలి? అని నిర్ధారించుకోవలసి వచ్చినప్పుడు మనకు జ్ఞానబోధచేసేది ఈ శబ్దరాశియే! అందుకనే 'వేదోఽఖిలో ధర్మమూలం'-'ధర్మానికి ఆధారం వేదమే'అని ఆర్యోక్తి.

మానవుడు తెలుసుకోవలసింది ఈ ధర్మం గురించియే! అందుకనే 4 పురుషార్థాల్లో ధర్మానిదే అగ్ర తాంబూలం. అర్థం, కామం అనే రెండూకూడా లోకయాత్రలో కావలసినవేయైనా ధర్మంతో ముడిపడున్నప్పుడే వాటికి సార్థకత. అలా ధర్మార్థ కామాలనే మూడుప్రయోజనాలతో పెనవేసుకున్న పరమప్రయోజనమే చతుర్థపురుషార్థం. అదే మోక్షం. ప్రతిజీవికీ అంతిమలక్ష్యమదియే. ఈ మోక్షం స్వరూపస్వభావాల్ని, సాధనవిధానాల్ని తేటతెల్లం చేస్తుంది కనుకనే వేదం భారతీయులందరికీ పరమప్రమాణమై మూర్ధన్య స్థానాన్ని అలంకరిస్తోంది.

ఉదాత్తభావనలకు, సంస్కారవంతమైన జీవనానికీ మూలకందంగా నిలిచేవేదంతో పోల్చదగిన వాఙ్మయంగా శ్రీమద్రామాయణం, మహాభారతం, నాలాయిరదివ్యప్రబంధం వాసికెక్కాయి. ఇందులో రామాయణ, భారతాలు ఇతిహాసాలుగా ప్రసిద్ధాలు. వేదంలాగే సంస్కృతభాషా నిబద్ధాలు.

వేదవేద్యే పరేపుంసి జాతే దశరథాత్మజే వేదః
ప్రాచేతసాదాసీత్ సాక్షాత్ రామాయణాత్మనా

వేదాలు శ్రీమన్నారాయణుడే పరతత్త్వమని నిర్ణయించాయి. ఆయనే దశరథపుత్రుడైన శ్రీరామునిగా జన్మించాడు. వాల్మీకి రచించిన రామాయణం వేదమే అయింది. అందుకనే దీనికి **"చతుర్వింశతి సాహస్రికా సంహితా"** అనే ప్రసిద్ధి కలిగింది.

వేదాలను విభజించిన వ్యాసుడే మహాభారతాన్ని రచించాడు. వేదంలో చెప్పిన ధర్మాలన్నీ భారతంలోనూ ఉన్నాయని చెప్పటానికే **"యదిహాస్తి తదన్యత్ర, యన్నేహాస్తి న తత్ క్వచిత్"**-'ఇక్కడున్నవే అంతటా ఉన్నాయి; ఇక్కడలేనిది మరెక్కడా లేదు' అని ఎలుగెత్తి చాటాడు. అందుకనే భారతం **"పంచమోవేదః"**-'ఐదవవేదం' అని ప్రసిద్ధి చెందింది.

మరి ద్రావిడభాషామయమైన, ఆళ్వార్లు పాడిన ప్రబంధ పాశురాలకు కూడా వేదసామ్యం...

ఎలా?

| | |
|---|---|
| వేదంలాగా అవి అపౌరుషేయాలా? | - కాదు. |
| సంస్కృతభాషానిబద్ధాలా? | - కాదు. |
| తపస్సిద్ధులైన మహర్షులు వ్రాసినవా? | - కాదు. |

**లోకమంతా ప్రసిద్ధములా?** – కాదు.

**మరి ప్రబంధాలకు వేదసామ్యమెలా?**

ఈ ప్రబంధాలు ఆళ్వార్లచే అనుగ్రహించబడ్డాయి. ఆళ్వార్లు అంటే అవగాహించినవారు – భగవదనుభవంలో మునిగినవారు అని అర్థం. వీరు భగవదంశసంభూతులు. నిరంతరం భగవత్కటాక్షం పొందినవారు. భగవంతుడు తనంత తానుగా వెదకి అనుగ్రహించినవారు. వస్తుతత్త్వం, జగద్ధితంలను గురించిన అనుశీలన గలవారు. తాము తెలిసిన దానిని పరులకు తెలియబరచే ప్రవృత్తి కలవారు. వీరు పొయ్గై ఆళ్వార్, బూదత్తాళ్వార్, పేయాళ్వార్, తిరుమళిశై ఆళ్వార్, నమ్మాళ్వార్, మధురకవి ఆళ్వార్, కులశేఖరాళ్వార్, పెరియాళ్వార్, గోదాదేవి, తొండరడిప్పొడి ఆళ్వార్, తిరుప్పాణాళ్వార్, తిరుమంగై ఆళ్వార్ అని 12 మంది. వీరినే ద్వాదశదివ్యసూరులని కూడా పిలుస్తారు.

**వేదం నిరూపించిన భగవత్తత్త్వాన్ని ఆళ్వార్లు తమ ప్రబంధాల్లో విస్పష్టంగా, నిష్కర్షగా నిరూపించారు. పరమాత్మ తత్త్వాన్ని తామనుభవించి ఇతరులచే అనుభవింపజేశారు. ఉపనిషత్తులు చెప్పిన భక్తినే ప్రధానోపాయంగా ఆశ్రయించారు. అల్పాలు, అస్థిరాలూయైన ఐశ్వర్యకైవల్యాల్ని తిరస్కరించారు. వేదంలాగా ప్రత్యక్ష అనుమానాలకు అందని పరమాత్మతత్త్వాన్ని, మోక్షోపాయాన్ని సులభతరంగా అందరికీ అందించారు. అందుకే ఈ ప్రబంధాలకు వేదసామ్యం. ద్రావిడవేదమని నామధేయం.**

ఇంకో విశేషమేమంటే ఇవి వేదంలాగా కొందరికే అని నిర్దేశించినవి కావు. అధికారభేదం లేకుండా అందరూ ఉద్ధరింపబడాలి, అందరూ ఉజ్జీవించాలి అనే ఉదాత్తలక్ష్యంతో అనుగ్రహింపబడ్డాయి. భగవత్భక్తులైన భాగవతోత్తములు నడయాడిన పవిత్రప్రదేశంలో ఆవిర్భవించాయి. ఈ ద్రవిడవేదానికే నాలాయిరదివ్యప్రబంధమని పేరు. సంస్కృతభాషలో 'దివ్య' శబ్దం 'ఉత్తమోత్తమం' అనే అర్థంలో ప్రయోగింపబడుతోంది. "జన్మ కర్మ చ మే దివ్యమ్" "దివ్యమ్ దదామి తే చక్షుః" లాంటి ప్రయోగాలు మనకు ఈ అర్థాన్నే సూచిస్తున్నాయి.

ఆళ్వార్లు అనుగ్రహించిన ఈ ద్రవిడప్రబంధాలు నారాయణుడే పరతత్త్వం అని నిరూపించటంలో ముఖ్యప్రమాణాలుగా అంగీకరింపబడ్డాయి. ప్రమేయమైన శ్రీమన్నారాయణుని పరమపురుషత్వం కూడా విస్పష్టమే. ఇక ఈ ప్రబంధాలను రచించిన ఆళ్వార్లు దివ్యాంశ, సంభూతులుగా ఉత్తమోత్తములని విడిగా చెప్పక్కర్లేదు.

**శ్రీవైష్ణవ సంప్రదాయంలో అంగీకరించే ప్రమాణాల్లో ఆళ్వార్ల ప్రబంధాలకు ప్రధానస్థానమున్నది. ఇందుకు కారణం వేదంలో అర్థం సులభంగా బోధపడదు. శ్రుతులు పరస్పరం విరుద్ధమైన అభిప్రాయాలని చెప్తున్నట్లుగా భాసిస్తుంది. ఇది సంశయానికి తావిస్తుంది. వేదార్థం తెలుసుకోవాలంటే వ్యాకరణాది వేదాంగవైదుష్యం తప్పనిసరి. అందుకనే వేదాంతాల్లో ఎన్నెన్నో భేదాలు. ఎన్నెన్నో వాదాలు.**

ఆళ్వార్ల ప్రబంధాల్లో ఈలాంటి సంశయాలకు తావు లేదు. వేదప్రతిపాద్యమైన శ్రీమన్నారాయణపరతత్త్వాన్ని మోక్షోపాయాన్ని నిష్కర్షగా చాటిచెబుతున్నాయి. అందుకే ఇవి ప్రమాణాల్లో ఉత్తమోత్తమమైనవిగా 'దివ్యత్వాన్ని' పొంది దివ్యప్రబంధాలుగా నిలిచాయి.

**ఆళ్వార్ల దివ్యప్రబంధాల్లో నమ్మాళ్వారు అనుగ్రహించిన తిరువిరుత్తంప్రబంధాన్ని ఋగ్వేదసామ్యంగా చెబుతారు. ఋగ్వేదానికి 21శాఖలున్నట్లుగా ఈ ప్రబంధంలో 21పాశురాలు ఉండటం దీనికి కారణం. అలాగే తిరువాశిరియంలోని 7 పాశురాలు యజుర్వేదంలోని 7 కాండలకు పోలిక. 'సహస్రవర్త్మా సామవేదః' అన్నట్లు 1000 పాశురాల తిరువాయ్మొళిప్రబంధం సామవేదసదృశ్యం. పెరియతిరువందాది అథర్వణవేదసామ్యమని ప్రసిద్ధి. తిరుమంగైఆళ్వార్లు రచించిన పెరియతిరుమొళి, తిరుక్కురున్దాండకం, శిరియతిరుమడల్, పెరియతిరుమడల్, తిరువెళ్ళుకూట్రిరుక్కై, తిరునెడున్దాండకం అనే ఆరుప్రబంధాలు వేదానికి గల షడంగాలుగా ప్రసిద్ధిచెందాయి.**

మానవునిజీవనాన్ని సక్రమంగా తీర్చిదిద్దడంలోనూ, భక్తిప్రపత్తి మార్గాలను అలవర్చటంలోనూ అర్చావతారాలకు గల స్థానం అద్వితీయం. అందుకనే ఆళ్వార్లు తమ ప్రబంధాల్లో అర్చామూర్తులవైభవాన్ని మనోహరంగా వర్ణించారు. ఈ కారణంగానే వాటికి దివ్యదేశాలనే పేరు రూఢి అయింది. ఇలా దివ్యప్రబంధపాశురాలతో దివ్యదేశాల్లో భగవంతుని అర్చామూర్తిగా భావించి భక్తిపారవశ్యంతో పాడిన ఆళ్వార్లు దివ్యసూరులుగా ఆరాధింపబడుతున్నారు.

**ఆళ్వార్ తిరువడిగళే శరణం.**

పచ్చతోరణం



# విష్ణ్వంశలే ఆళ్వారులు

- శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి, 80996 81422.

**తిరుమలకొండపై వెలసియున్న స్వామికి నిత్యమూ ఎన్నో కైంకర్యాలు, ఉత్సవాలు జరుగుతుంటాయి. ఆ సందర్భాల్లో నిత్యమూ ఆళ్వారులచే గానం చేయబడిన దివ్యప్రబంధపాశురాలు గానం చేయబడుతుంటాయి. ఆ పాశురాలగురించి వాటిని గానంచేసిన ఆళ్వారులగురించి సంక్షిప్తంగా తెలుసుకుందాం....**

శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీమన్నారాయణుడు విరజానదీతీరంలోనున్న వైకుంఠనగరమందు కొలువై ఉన్నాడు. దానికే పరమపదమనీ, నిత్యవిభూతి యనీ పేర్లు. తక్కిన పద్నాలుగులోకాలకు లీలావిభూతియని పేరు. లీలావిభూతికంటే నిత్యవిభూతి గొప్పదిగా వర్ణించబడింది. గురూపదేశమనే నావచే సంసారసాగరాన్ని తరించిన విష్ణుభక్తాగ్రేసరులైన జీవాత్మలు మాత్రమే ఆ పదము చేరి మాధవుని దర్శించి, తరించే భాగ్యాన్ని పొందడానికి అర్హులు.

## స్వామికొలువు

నిత్యవిభూతియందు శ్రీస్వామి సుదర్శన పాంచజన్యాలనే ఆయుధాలతో, అనంత గరుడ కుముద విష్వక్సేనాదులైన నిత్యసూరులతో కలసి కొలువై ఉన్నాడు. శ్రీభూనీళా దేవులైన ముగ్గురు దేవేరులు స్వామిని సేవిస్తున్నారు. అలా ఆ కొలువులో అందరూ ఉన్నా కూడా స్వామి బాధపడ్తూ భూలోకవాసులగురించి ఇలా ఆలోచిస్తూన్నాడు.

**ఈ మానవులు తానిచ్చిన కాళ్లు చేతులు మొదలైన అవయవాల్ని తన సేవకుపయోగించడంలేదే! వారి జ్ఞానేంద్రియాదులను తన ధ్యానానికి, అర్చనకు వినియోగించడంలేదే! మోక్షమార్గాన్ని వదలి నిత్యమూ సంసారసాగరంలోనే మునిగి తేలుతూన్నారే! దారికానక బాధలు పడుతూన్నారే! వీరిని మంచిమార్గంలో నడిపే మార్గమేదంటూ ఆలోచిస్తూన్నాడు.**

అది చూచి లక్ష్మీదేవి స్వామీ! మీ బాధకు గల కారణమేమని అడిగింది. స్వామి కారణం చెప్పాడు. అది విని లక్ష్మీదేవి స్వామీ! మానవులు మంచిమార్గంలో నడచుకోవటానికే కదా మునుపు మీరు రామకృష్ణాది అవతారాల్ని ధరించారు. కానీ, ఈ మానవుల్ని సృష్టించింది మీరే కదా! అలాంటపుడు వారిలో కొందరిని భోగులుగాను, కొందరిని యోగులుగాను చేశారు. కొందరిని పుణ్యాత్ములుగాను, మరి కొందరిని పాపాత్ములుగాను చేశారు. వారికలాంటి బుద్ధులు పుట్టటానికి మీరేకదా కారకులు అన్నది.

## స్వామికార్యాలోచన

ఆ మాటలకు స్వామి, దేవీ! నేను శిష్టరక్షణ దుష్టశిక్షణకై అవతారమెత్తిన మాట నిజమే. కాని నా స్వరూపాలన్నింటినీ కన్నులారా చూచికూడా మానవులు నా మహిమల్ని అర్థం చేసుకోలేకపోయారే. కొందరు శత్రుత్వాన్ని, కొందరు మిత్రత్వాన్ని నాపై చూపారు. ఈ విధంగా అనేక రీతులుగా ప్రవర్తించే చపలచిత్తుల్ని నేనెట్లా తరింపచేస్తాను?

నాపై మనసు నిలిపి నన్ను చేరుకోవడానికే కదా వారికి అవయవాలను, ఇంద్రియాలను ఇచ్చాను. అలాంటి ఇంద్రియాలను, అవయవాలను, మనసును నాపై లగ్నం చేయక దుర్విషయాలపై నవే ఆసక్తి చూపిస్తున్నారే! ఘోరనరకాలకే దారి చూసుకుంటున్నారే! పరమార్థజ్ఞానానికై కొంతకూడా ప్రయత్నించలేకపోతున్నారే! ఈ మూర్ఖుల్ని ఏవిధంగా మార్చేది అంటూ దేవీ! ఇప్పుడు నాకొక ఆలోచన వచ్చింది. దాంతో మానవలోకాన్ని పూర్తిగా మార్చవచ్చు.

**విశ్వాసం ప్రజల్లో ఎంత ముఖ్యమో**
**దానిని కాపాడడానికి**
**భక్తి అంత ముఖ్యం.**
**భక్తి ఎంత ముఖ్యమో శక్తి అంత ముఖ్యం.**
**ఇవి రెండూ కలిస్తేనే మోక్షమనేది వస్తుంది.**

అదేమంటే శ్రీరంగం, కంచి, తిరుపతి మొదలైన దివ్యదేశాలందు నేనవతారాలు ఎత్తుతాను. అలాగే నా భక్తులు కొందరిని భూమిపై పుట్టిస్తాను. వారి బోధలద్వారా, ఆచరణద్వారా జీవులకు మోక్షమార్గోపదేశం చేయిస్తాను. కాబట్టి **నీవు, భూదేవి, నీళాదేవి, నా ఆయుధాలైన సుదర్శనం, పాంచజన్యం, శ్రీవత్సం, కౌస్తుభం, అనంత, గరుడ, విష్వక్సేనాది పరివారమంతా భూమిపై నానావర్ణాలందు అవతరించండి! హరిభక్తిప్రచురాలైన దివ్యప్రబంధాలు విశిష్టాద్వైతసిద్ధాంతానికి భిన్నమైన దుర్మతాలను ఛిన్నాభిన్నం చేసేలా దక్షిణభారతదేశంలో అవతరించిన ఆళ్వారులనే వైష్ణవభక్తశిరోమణులు వాటిని ద్రావిడభాషలో రచిస్తారు. కావున మీరందరూ భూలోకంలో అవతరించడానికి సంసిద్ధులు కండి అన్నాడు.**

ఆ మాటలకు లక్ష్మి స్వామీ! ద్రావిడభాషలోనే కావ్యాలు సృష్టించాలనుకోవడానికి, దక్షిణదేశంలోనే అవతరించాలనుకోవడానికి గల కారణమేమో చెప్పుమనగా, స్వామి దేవీ! అందుకు పెద్ద కారణమే ఉంది వినుమన్నాడు.

## ద్రావిడప్రబంధావిర్భావం

పూర్వం ఉత్తరదిక్కుననున్న కైలాసపర్వతశిఖరాన అత్యంత వైభవోపేతంగా పార్వతీపరమేశ్వరుల పరిణయోత్సవం జరుగుతోంది. ఈ ఉత్సవాన్ని చూడ్డానికి నరులు, బ్రహ్మాది దేవతలు అసంఖ్యాకంగా వచ్చారు. ఆ విధంగా వచ్చినవారి భారమెక్కువై ఉత్తరదిక్కుననున్న భూమి ఒక ప్రక్కకు ఒరిగి పోయి అటుఇటు కదలసాగింది. కైలాస పర్వతమే తల క్రిందులైపోయే ప్రమాదమేర్పడింది. అప్పుడందరూ ఈశ్వరునిపైనే భారంవేశారు.

అప్పుడు దేవశిల్పి విశ్వకర్మ ఈ ఉత్సవానికి వచ్చిన అగస్త్యమునిభారం రెండు వంతులుంటే దేవతలభారమంతా కలిపి రెండువంతులుంది. కావున, వారు వారి నివాసమైన దక్షిణదిక్కుకు వెళ్ళినట్లైతే భూమిబరువు సమానమౌతుందంటూ కొంటెగా చెప్పాడు.


అందుకు అగస్త్యుడు ఎంతగానో బాధపడ్డాడు. ద్రావిడదేశానికి ద్రావిడభాషకు గణ్యతను చేకూర్చుమంటూ నన్ను ప్రార్థించాడు. అగస్త్యుని ప్రార్థనను మన్నించి, నేను ద్రవిడభాషకు మహత్వాన్ని కలిగిస్తాను. అక్కడ నా పరివారమంతా మహాభక్తులుగా అవతరిస్తారు.

వైష్ణవోత్తములై, పరమభాగవత శిరోమణులై నా గుణగణాల్ని ద్రావిడభాషలో మృదుమధురంగా గానం చేస్తారని నాతోబాటు భాషకు కూడ చిరకీర్తి కల్గుతుందని అలా నా అంశాన అవతరించిన మహాభక్తకవిశిరోమణులు నాల్గు వేలపద్యసంఖ్యగల దివ్యప్రబంధాలను ద్రావిడభాషలో రచిస్తారనే వరమిచ్చాను. ఆ వరం తీర్చడంకోసమే ఈ సంకల్పం. ఇదే నాలాయిరదివ్య ప్రబంధావతరణానికి నాంది.

ఆ క్రమంలో ఆవిర్భవించిన వారే పన్నెండుమంది ఆళ్వారులు. క్రింద పేర్కొన్నవిధంగా తమ తమ పాశురాల్లో వైష్ణవవెలుగును చూపిన కవాటాలవంటివారుగా ఆళ్వారులు మహనీయులుగా కీర్తించబడ్డారు.

# పన్నిద్దరాళ్వారులొక్కచోట....

| సంఖ్య | ఆళ్వారు | నక్షత్రం | అంశ | బిరుదులు | ప్రబంధాలు | పాశురాలు |
|---|---|---|---|---|---|---|
| 01 | పొయ్‌గైఆళ్వారు | శ్రవణ | పాంచజన్యం (శంఖం) | సరోయోగి, కాసారయోగి, ఆదియోగి. | మొదల్‌తిరువందాది | 100 |
| 02 | పూదత్తాళ్వారు | ధనిష్ఠ | కౌమోదకి (గద) | భూతముని, ఉత్పలముని, ద్వితీయయోగి. | ఇరండాంతిరువందాది | 100 |
| 03 | పేయాళ్వారు | శతభిష | నందకం (ఖడ్గం) | మహాయోగి, మయూరపురయోగి, తృతీయయోగి. | మూన్డాంతిరువందాది | 100 |
| 04 | తిరుమళిశై ఆళ్వారు | మఘా | సుదర్శనం (చక్రం) | భక్తిసారయోగి, భక్తిసారముని, చక్రాంశయోగి. | తిరుచ్ఛందవిరుత్తం<br>నాన్‌ముగన్‌తిరువందాది | 120<br>96 |
| 05 | కులశేఖరాళ్వారు | పునర్వసు | కౌస్తుభమణి | కేరళయోగి, కౌస్తుభాంశయోగి. | పెరుమాళ్‌తిరుమొళి | 105 |
| 06 | తొండరడిప్పొడి ఆళ్వారు | జ్యేష్ఠ | వైజయంతిమాల | విప్రనారాయణుడు, వనమాలాంశయోగి, మండంగుడిముని, భక్తాంఘ్రిరేణు. | తిరుమాలై,<br>తిరుప్పళ్ళియెళుచ్చి | 45<br>10 |
| 07 | తిరుప్పాణాళ్వారు | రోహిణి | శ్రీవత్సం | మునివాహనయోగి, శ్రీవత్సాంశయోగి, గాయకయోగి. | అమలనాదిప్పిరాన్ | 10 |
| 08 | తిరుమంగై ఆళ్వారు | కృత్తిక | శార్ఙ్గం (ధనుస్సు) | పరకాలయోగి, శార్ఙ్గాంశయోగి, కలిహయోగి. | పెరియతిరుమొళి<br>తిరుక్కుఱుంతాండకం<br>తిరునెడుంతాండకం<br>తిరువేళుక్కూరిఱుక్కై<br>శిరియతిరుమడల్<br>పెరియతిరుమడళ్ | 1084<br>20<br>30<br>01<br>78<br>148 |
| 09 | పెరియాళ్వారు | స్వాతి | రథం | విష్ణుచిత్తయోగి, భట్టనాథముని, స్వాతియోగి, కనకశుల్కముని, పరతత్త్వస్థాపకయోగి, ధన్విపురయోగి. | తిరుప్పల్లాండు<br>పెరియాళ్వార్ తిరుమొళి | 12<br>473 |
| 10 | ఆండాళ్ (గోదాదేవి) | పూర్వఫల్గుణి | భూదేవి | శూడిక్కొడుత్త నాచ్చియార్ | తిరుప్పావై<br>నాచ్చియార్ తిరుమొళి | 30<br>143 |
| 11 | నమ్మాళ్వారు | విశాఖ | విష్వక్సేనుడు | మారన్, శఠారి, శఠరిపుడు, శఠకోపి, పరాంకుశముని, యతీంద్రుడు. | తిరువిరుత్తం<br>తిరువాశిరియం<br>పెరియతిరువందాది<br>తిరువాయ్‌మొళి | 100<br>7<br>87<br>1102 |
| 12 | మధురకవి ఆళ్వారు | చిత్తా | గరుత్మంతుడు | భట్టనాథుడు | కణ్ణినుణ్‌శిరుత్తాంబు | 10 |
| | | | | | మొత్తం నాలాయిర దివ్యప్రబంధపాశురాలసంఖ్య | 4,011 |




## ఏ వాహనానికి... ఏ ప్రబంధం....!!


| రోజు | వాహనసేవ | ఆళ్వారు | ప్రబంధం |
|---|---|---|---|
| 1 | పెద్దశేషవాహనం (రాత్రి) | పొయ్‌గైఆళ్వారు | మొదల్‌తిరువందాది |
| 2 | చిన్నశేషవాహనం (ఉదయం)<br>హంసవాహనం (రాత్రి) | పూదత్తాళ్వారు | ఇరండాంతిరువందాది |
| 3 | సింహవాహనం (ఉదయం)<br>ముత్యపుపందిరివాహనం (రాత్రి) | పేయాళ్వారు | మూన్ఱాంతిరువందాది |
| 4 | కల్పవృక్షవాహనం (ఉదయం)<br>సర్వభూపాలవాహనం (రాత్రి) | తిరుమళిశైఆళ్వారు | నాన్‌ముగన్‌తిరువందాది |
| 5 | మోహినీఅవతారం (ఉదయం)<br>గరుడవాహనం (రాత్రి) | నమ్మాళ్వారు | తిరువిరుత్తం |
| 6 | హనుమంతవాహనం (ఉదయం)<br>గజవాహనం (రాత్రి) | నమ్మాళ్వారు | పెరియతిరువందాది |
| 7 | సూర్యప్రభవాహనం (ఉదయం)<br>చంద్రప్రభవాహనం (రాత్రి) | తిరుమంగైఆళ్వారు | పెరియతిరుమొళి |
| 8 | రథోత్సవం (ఉదయం)<br>అశ్వవాహనం (రాత్రి) | తిరుమంగైఆళ్వారు<br>ఆండాళ్ | పెరియతిరుమొళి<br>శిరియతిరుమడల్<br>పెరియతిరుమడల్<br>తిరువేళుక్కూరిరుక్కై<br>నాచ్చియార్‌తిరుమొళి |
| 9 | తిరుచ్చి ఉత్సవం-1 (చక్రస్నానం ముందు)<br>తిరుచ్చి ఉత్సవం-2<br>ధ్వజావరోహణం | కులశేఖరాళ్వారు<br>తిరుమంగైఆళ్వారు<br>తిరువరంగదాముదనార్ | పెరుమాళ్‌తిరుమొళి<br>తిరునెడుందాండకం<br>రామానుజనూట్రందాది |

# భూమిని కొలిచిన శ్రీహరిపాదము...!

- ఆచార్య కె.దామోదరనాయుడు, 94416 45601.

**తులాయాం శ్రవణేజాతం కాంచ్యాం కాంచనవారిజాత్,**
**ద్వాపరే పాంచజన్యాంశం, సరోయోగిన మాశ్రయే.**

ద్వాపరయుగాంతంలో సిద్ధార్థివత్సరం తులామాసం శుక్లపక్షం అష్టమీసహిత కుజవాసరం కాంచీపురం యథోక్త కారి సన్నిధికి ఉత్తరంలో కాంచనపద్మాలంకృత సరోవరంలో పద్మంలో జన్మించిన ఆళ్వార్ 'పొయ్‌గైఆళ్వార్'. ఈ ఆళ్వార్ సంస్కృతనామం సరోయోగి. ఈ యోగివర్యులు 10 పాశురాలలో 'తిరువేంగడం' క్షేత్రాన్ని కీర్తించారు.




వీరు తిరుమలకు విచ్చేశారా? లేదా? అన్నది ఒక మీమాంస. అలిపిరిలోనే నిలిచి తిరుమలను, స్వామిని కీర్తించినారని ఒక వాదం. వీరి ఎదుట దివ్యదేశాలు సాక్షాత్కరించగా అనుభూతితో పాశురాలు పాడినారని మరొక సమన్వయం.

ఏది ఏమైనా వీరు దర్శించిన తిరుమల ప్రకృతి శోభాయమానమనడం సత్యం. వీరు కేవలం భక్తులేగాక కవులు కూడా కావడంవల్ల వీరి రచనల్లో సహజత్వం జాలువారింది.

**వీరు విష్ణుభక్తులు. వీరి దృష్టిలో పరమపదంలోని స్వామికి, దశావతారమూర్తులకు, అలాగే దివ్యదేశాల్లో ఆవిర్భవించిన అర్చామూర్తులకు తేడా లేదు. అంచేత శ్రీ వేంకటేశ్వరునిలో నారసింహుని, ముల్లోకాలు ఆక్రమించిన వామనుని, మారీచుని మట్టుపరచిన శ్రీరామచంద్రుని, శ్రీకృష్ణపరమాత్మను దర్శించగలిగారు. అంతేకాదు స్వామి వివిధ భంగిమల్లో కనబడడానికి కారణాలను కూడా చెప్పారు. శయనభంగిమ, ఆసీన భంగిమ, నిలిచిన భంగిమలను మానవులమైన మనం దర్శించినట్లైతే నిల్చొనిచేసిన పాపం, కూర్చొనిచేసిన పాపం, నడుస్తూచేసిన పాపాదులు నశిస్తాయనడం సమన్వయాత్మక హితబోధ.**

భూమిని ఉద్ధరించిన సౌందర్యాన్ని సేవించడం ప్రళయకాలంలోనే. పర్వతమెత్తిన సౌందర్యవీక్షణం గోవర్ధనోద్ధరణకాలంలోనే. జయమువలన కలిగిన సౌందర్యా

తిశయసేవనం కంసవధలోనే. నిద్రాసౌందర్యం వీక్షించే భాగ్యం క్షీరార్ణవంలోనే. స్థిరంగా నిలిచిన సౌందర్యగరిమను సేవించే భాగ్యం శ్రీ వేంకటాచలంలోనే సంప్రాప్తమని వీరి భావన.



**వీరు తన పాశురాల్లో ప్రస్తావించిన మరో అంశం తన కాలం నాడు తిరుమలలో జరిగిన కైంకర్యాలు. స్వామిని సేవించేవారిలో వైదికులు ప్రముఖులు. స్వామి వేదగోచరుడు. వేదోద్ధారకుడు. వేదమంత్ర పూజితుడు. అంచేత వైదికులు నలు దిక్కులనుండి ప్రతిదినం తిరుమలకు వేంచేస్తున్నారట. అంతేకాదు తిరుమలలో ధూప- దీప- పుష్ప- తీర్థాదులు ఆటంకం లేకుండా సాగుతున్నాయని వర్ణన. ఇది తీర్థలక్షణం. స్వామి మహిమలకు తార్కాణం. తిరుమల అరణ్యప్రాంతమైనా కోరివచ్చే భక్తులకు ఆశ్రయస్థలి.**

వైదికులే కాదు స్త్రీలు సహితం స్వామి కైంకర్యంలో భాగం పంచుకొన్నవారే. 'ద్వాదశి' సంప్రీతికరమైన తిథి. అంచేత ఆ తిథినాడు చిత్రాతిచిత్రమైన సుగంధభరితాలైన పూలమాలికలను అర్పించేవారు. ధూపాదులు నిర్వర్తించేవారు. ఆ ధూపం ఆకాశమంతా అలముకొంటుంటే ఆకాశంలోని నక్షత్రాలు మరుగు పడుతున్నాయని వీరి వర్ణన. వీరి పాశురాల్లో కేవలం ప్రాకృతికవర్ణనలే కాదు, భక్త్యాది అనేకాంశాలున్నాయి. సామాన్యులను కటాక్షించడంకోసమే స్వామిక్షీరసాగరం వదలి వచ్చాడని ఆళ్వారుల భావన. మనస్సును ఒక ప్రత్యేకవ్యక్తిగా, దానికొక హృదయమున్నట్లు చెప్పడం కవితాచమత్కారమైనా తమ హృదయాల్లో ప్రవేశించాడనడంలో భగవంతుని నిర్హేతుక దయ సువ్యక్తం.

భగవత్కైంకర్యం పరమపవిత్రం. ఆ కైంకర్య భాగ్యం అందరికి దక్కదు. ఆ చోటు పరమపదంలో నిత్యసూరులకు సాధ్యం. అయినా స్వామి తిరుమలలో అర్చావతారమూర్తిగా వెలసినవేళ ఆ భగవానుని సౌశీల్య సౌలభ్యాది గుణానుభవంకోసం తిరుమలకు విచ్చేస్తున్నారని వీరి వచనం.

వీరిదృష్టిలో 'శ్రీకృష్ణుడు అభిమానించే దివ్యదేశమిదే. సర్వజనసులభుడైన శ్రీరాముడితడే. నృసింహుడితడే. ఆ కారణంవల్లనే లోకులు వెంకటకృష్ణుడు, వెంకటరాముడు, వెంకటనరసింహుడని భక్తితో, ఆప్యాయతతో నోరారా పలుకుతూ సేవించదగ్గ క్షేత్రమని ఆళ్వారులు భక్తజనావళికి 'సుపథం' చూపారు.

**వీరు రచించిన 'మొదల్‌తిరువందాది' అను పాశురశతకప్రబంధంలో మొదటి పాశురభావము- 'భూమిని ప్రమిదగను, సముద్రాన్ని నూనెగను, సూర్యుని దీపంగా చేసిన సుదర్శనాయుధుడైన శ్రియఃపతి శ్రీపాదారవిందాలకు దుఃఖమయమగు ఈ ప్రాపంచిక సంసారనివృత్తికొరకు శబ్దమాలికయగు మొదటి తిరువందాదిని అలంకారంగా సమర్పిస్తున్నాను.**

**చివరిపాశురభావము-'ఓ మనసా! ఒక శ్రీపాదంచే భూమండలాన్నంతా కొలిచినవాడునూ, బ్రహ్మరుద్రాదులకు కారణభూతుడునూ, తులసీదళహారము ధరించియుండే శ్రియఃపతినే హృదయమందిడుకొందును. ఇలా ఉంచుకున్నపుడే భూమిని కొలిచిన శ్రీహరిపాదము, శకటాసురుని తన్నిన శ్రీహరిపాదముల రెండింటినీ సేవించినవాడనగుదును. పైవిధంగా వేంకటేశ్వరునిపై తన అనుభవాన్ని తన పాశురాల్లో వర్ణించి చిరస్మరణీయుడైనాడు పొయ్‌గైఆళ్వారు.**

# ఏనుగు బహుమతి!


– శ్రీమతి వరిగొండ సునంద, 87905 85673.

**పూదత్తాళ్వార్ వేంకటేశ్వరాత్మక పాశురాలలో తిరు వేంగడంలోని ప్రకృతి రామణీయకం, ఆనాటి భక్తుల కైంక ర్యాలు, వివిధ దివ్యదేశాల అర్చావతారాల ఏకాత్మకభావన, మహావిష్ణువు లీలావైభవాదులు మనోహరంగా వర్ణితం.**

తిరుమలలోని శ్రీ వేంకటేశ్వరుడు మహావిష్ణువు అర్చామూర్తి. అలనాడు మొసలివాత పడిన ఆ గజేంద్రుని రక్షించిన భక్తవత్సలుడు. అంతేకాదు గజగమన అయిన కాంతామణిని ఉరమున నిల్పిన కరుణామూర్తి. అందుకే తిరుమలలో విస్తారంగా ఏనుగుల సంచారం. ఆ ఏను గులు సామాన్యమయినవి కావు. భక్తిభావం కలిగిన చైతన్యస్వరూపాలు. ఇతర వాసములకన్నా తిరుమల వాసాన్నే ఎంపిక చేసుకొన్న విజ్ఞత కలిగిన జంతువులు.

ఏనుగులలో కూడా ప్రేమాతిశయం లేక పోలేదు. ఒక మగఏనుగు ఆడఏనుగుతో హాయిగా సంచరిస్తున్నది. మగఏనుగుకు తన ఆడఏనుగు అందచందాలు చూసే సరికి ఆ ఆడఏనుగుకు ఏదైనా ఒక మంచిబహుమతి ఇవ్వాలనిపించింది. తన చిన్నికళ్ళతో చుట్టూ ఓ ప్రకృతి పరిశీలన చేసింది. దగ్గరలోనే ఒక వెదురుగుంపు. పక్కన తేనెతుట్టె. మగ ఏనుగు చాలా సంతోషంతో ఒక అడుగు ముందుకేసింది. ఆకాశాన్నందు కుంటున్నట్లున్న ఒక వెదురు వంచి రెండు కణుపులు ఉండేలాగా విరిచింది.

ఆ వెదురును సమీపంలో ఉన్న తేనెలో ముంచి భార్యకు సంప్రీతితో ప్రసాదిం చిందట. అలాంటి ఆడ, మగఏనుగులు సంచ రించే స్థలం తిరువేంగడమ్ అని పాశురాల్లో ఏనుగులయొక్క ప్రేమాతిశయాన్ని వీరు అతి మధురంగా వర్ణించారు.




పూదత్తాళ్వారు


ఏనుగులు నల్లనివి. మేఘాలు నల్లనివి. స్వామి నల్లనయ్య. మేఘాలతో కూడిన తిరుమల కూడా నల్లనే. ఈ పాశురంలోని రెండు కణుపులు అన్నవి భగవద్రామా నుజులు తమ శిష్యులకు ద్వయార్థం వివరించినట్టుగా ఉన్న దని పెద్దల వ్యాఖ్య. ఇంతటి మహత్తరమైన విశిష్టాద్వైత రహస్యాన్ని అంతర్లీనం చేసుకున్న పాశురమత్యంత రమణీ యంగా ఉన్నది.

వేంకటాచలం సామాన్యమైన పర్వతం కాదు. తాపసులు, కర్మనిష్ఠులు, కైవల్యకాంక్షాపరులు అయిన మహానుభావులు ఈ కొండలోనే నివాసం చేయాలని తహతహలాడుతుంటారు. కారణం ఇక్కడి లతలు, వృక్షాలు, తీర్థాలు తమ స్థిరవాసానికి, నిష్ఠకు అను వైనవిగా భావించడం. ఈ కారణాన ఆ మహాను భావులు ఇక్కడ వాసం చేయడమేకాక తాము ఎన్నుకొన్న యోగక్రమంలో భగవంతుని సేవిస్తుంటారు. ఆ తపోయోగంలో నిశ్చల సమాధిస్థితిలో దిన వార పక్ష మాస అయన సంవత్సరాలు గడిచిపోతుంటాయి. నిశ్చలసమాధిస్థితిలో వారి కేశపాశం పెరిగి ముందుభాగంనుండి వెనుకకు వాలిపోతూంటాయి. ఆ గుబురైన కేశ పాశం చిన్నగుట్టగా కనిపిస్తుంటే తీగలు వాటిపై పాకుతున్నాయని ఒక సహజో త్ప్రేక్ష. అత్యాశ్చర్యకరమైనది, పరమభోగ్య మైనది, అలలతోకూడిన జలసమృద్ధి కలది **'తిరువేంగడమ్'** అని వీరి అభిప్రాయం.

అంతేగాక శోలైతో సమానంగా తిరు వేంగడాన్ని భావించడం ఒక విశేషం. ప్రాకృ తిక వర్ణనలకు భక్తిని జోడించి వీరు అలవోకగా చెప్పిన పాశురాలు అనన్య సామాన్యాలు.

# శ్రీవిష్ణుని భజియించరో...!

– డా॥ డి.యువశ్రీ, 98859 40011.



పేయాళ్వారు

**విష్ణుదేవుడి ఆభరణ వస్తువాహనాల అంశలతోనే విష్ణుతత్త్వాన్ని ప్రచారం చేసేందుకు ఆళ్వారులు భూమిమీద జన్మించారని వైష్ణవులవిశ్వాసం. దీన్నిబట్టి ఆళ్వార్లకు వైష్ణవులిచ్చే ప్రాధాన్యత, ప్రాముఖ్యత ప్రస్ఫుటమౌతున్నాయి.**

తమిళభక్తిసాహిత్యానికి, వైష్ణవవాఙ్మయానికి ఎన లేని సేవచేసినవారు ఆళ్వారులు. "ఆళ్వారు అనే మాటకు జ్ఞానసంపన్నుడని అర్థం." అతని హృదయం ప్రేమకు నెలవు. అతడు ధ్యానసిద్ధుడు. శ్రీమన్నారాయణుడే పరమదైవమని అతని ప్రగాఢవిశ్వాసం.

ఆళ్వార్లు భగవంతుని పట్ల ప్రగాఢమైన ప్రేమ కలిగి ఉన్నందువల్ల వీరికి 'ఆళ్వార్లు' అనే సార్థక నామధేయం కలిగింది. వీరు విష్ణుభక్తులు. విష్ణుకళ్యాణగుణాల్నే గానం చేసినవాళ్లు. విష్ణువునే పరదైవంగా భావించినవాళ్లు. అన్య దేవతల్ని స్మరించనివాళ్లు. నిరంతరం విష్ణువునే ధ్యానిస్తూ విశ్వాన్నే విస్మరించినవాళ్లు.

పేయాళ్వార్ తొలి ఆళ్వార్లలో చివరివాడు. తరువాతి ఆళ్వార్లకు కూడా ఈయనే ముక్తికి దారి చూపినవాడని చెప్పొచ్చు. ఈయనకు 'మహాయోగి' అని మరో పేరు. పేయాళ్వార్ ఎలాగో హరిభక్తులయ్యారు. హరిలీలల్ని గానం చేస్తూ దేశాటనం చేశారు. ఎట్టకేలకు విష్ణుసంకల్పంచేత ఆకర్షితుడై తిరుక్కోవిలూరు చేరుకున్నాడు.

పొయ్‌గైఆళ్వార్, భూదత్తాళ్వార్ కూడా ఈయనకంటే ముందే అక్కడికి చేరుకున్నారు. రాత్రివేళ ఉరుములు మెరుపులతో భారీవర్షం మొదలైంది. ఎక్కడా తలదాచుకునేందుకు స్థలం లేదు. ఆ దుర్భరవర్షంలో పొయ్‌గైఆళ్వార్ ఒక చిన్న కుటీరాన్ని చేరుకున్నాడు. తరువాత కొంతసేపటికి భూదత్తాళ్వార్ అక్కడికొచ్చి తలదాచుకునేందుకు స్థలమడిగాడు. 'ఈ స్థలంలో ఒక్కరు పడుకోవచ్చు, ఇద్దరు కూర్చోవచ్చు. ఇద్దరమూ కూర్చుందామురమ్మ'న్నాడు పొయ్‌గైఆళ్వార్. మరి కొంతసేపటికి పేయాళ్వార్ కూడా అక్కడికొచ్చి 'ఉండటానికి కొంత చోటు కావాల'న్నాడు. 'ఒకరు పడుకోవచ్చు, ఇద్దరు కూర్చోవచ్చు, ముగ్గురు నిలబడొచ్చు. కాబట్టి అందరము నిల్చుందాం రమ్మ'ని పొయ్‌గై ఆళ్వార్ పేయాళ్వార్‌ను కూడా ఆహ్వానించాడు.



అలా తొలిఆళ్వార్లు ముగ్గురూ తొలిసారిగా ఒకేచోట చేరి విష్ణులీలలు కొనియాడుతూ సద్గోష్ఠి సాగించారు. వీరిని అనుగ్రహించే ఉద్దేశ్యంతో విష్ణువు వాళ్ళమధ్య కొచ్చాడు. కనబడకుండా వాళ్ళమధ్యనే నిలబడి వారికి ఒత్తిడి కలిగించాడు. ఆళ్వార్లకు తమమధ్య ఎవరో ఉన్నట్టనిపించింది. జ్ఞాన దృష్టితో పరిశీలించారు. మహావిష్ణువు సాక్షాత్కరించాడు. ఆ దేవదేవుని దివ్యమంగళవిగ్రహాన్ని తిలకించి పులకించారు. అనేకవిధాలుగా స్తోత్రం చేసి ఆనందపరవశులయ్యారు. విష్ణువు వాళ్ళననుగ్రహించి, ఆశీర్వదించి అంతర్గమించాడు.

తిరుమలను, తిరుమలేశుని స్మరిస్తూ "చతుర్వేద ప్రతిపాద్యుడు, వేంకటవిభుడు, దేవతలు శిరసు వంచి నమస్కరించే పాదాలు కలవాడు" అని వేంకటేశ్వరుణ్ణి కొనియాడాడు. శరణాగతిని సమర్థించారు. ఎటువంటి పాపాలు చేసినవాడైనా భగవంతుణ్ణి ఆశ్రయిస్తే వాటినుంచి విముక్తి పొందుతాడు. "మేఘావృతమైన సముద్రాన్ని మథించినవాణ్ణి, కారణభూతుణ్ణి, సాగరశయనుణ్ణి నిత్యం ఆశ్రయించేవారు దుఃఖాలకు మూలమైన పాపాలను జేసినవారైనా దుఃఖాలను అనుభవించే వారెవరు? వారెక్కడున్నారు? ఎవరూలేరన్నాడు."

వీరు మనసునుద్బోధించారు. విష్ణుదేవుని అస్తిత్వాన్ని ఉద్ఘాటించారు. "ఓ మంచి మనసా ! ఊర్ధ్వలోకాలు ఒదిగేట్లు ఎత్తుగా ఉన్న శిఖరాలు గలదీ, అధిక సంఖ్యాకాలైన సెలయేళ్ళతో కూడినదీయైన తిరుమలలో నివసించు. భూమినంతా కొలుచుకున్న స్వామీ, ఉత్తముడూ ఐన విష్ణువు ఎప్పుడూ ఆస్తికుల మనసులో అధివసించియున్నాడని గ్రహించు." స్వామిని ఆశ్రయిస్తే పరమపదాన్ని కూడా దర్శింపజేస్తాడు. "అతడే కదల్చశక్యంగాని పర్వతంతో పశుగణాన్ని రక్షించాడు. అతడే అందమైన మద్దిమాకులను కూల్చాడు. అతడే బాణాలను ప్రయోగించి లంకాపురాన్ని దహించాడు. అతడే అకళంక పరమపదాన్ని దర్శింపజేశాడు."

ఇతను మహాభక్తుడు. మహాజ్ఞాని. వైష్ణవాన్ని బాగా వ్యాప్తిచేసిన దైవభక్తుడు. శ్రీమన్నారాయణుడే పరతత్త్వమని తనబోధల్లో తెలిపాడు. పైవిధంగా పరమయోగులైన ఆళ్వారులకు పరిపరివిధాల కనిపించి వారిని పరమభాగవతోత్తములను గావించాడు.

# తెల్లనితేజంలో.... నల్లనయ్య

– ఆచార్య కె.సర్వోత్తమరావు
97041 04000

**తిరుమళిశైఆళ్వార్ తిరుమల సంబంధి పాశురాలలో ఆళ్వార్ 'ప్రకృతిపరిశీలన' ఇతరులెవరు ప్రవచించని పౌరాణికవృత్తాంతం, భక్తాదులు స్వామిని సేవించేవిధానం; స్వామిపట్ల, తిరువేంగడంపట్ల ఉన్న భక్తి, ఆర్తి సుస్పష్టమౌతాయి. వీరి వైదుష్యం, మహిమలు అనంతం. చిరకాలం విభిన్నసిద్ధాంతాలను, సంప్రదాయాలను అధ్యయనం చేసిన వారైనా మునగడం ఏ చోటైనా తేలిన ప్రదేశం ప్రశస్తమైనట్లు చివరకు శ్రీవైష్ణవసిద్ధాంతపథంలో ప్రచారం కొనసాగించారు.**



తిరుమళిశైఆళ్వారు

ఎత్తైనకొండ తిరుమల. ఆ కొండశిఖరాన పున్నమనాడు చంద్రుడు ప్రకాశమానంగా వెలిగిపోతున్నాడు. ఆ పూర్ణిమాచంద్రుని ఏనుగు చూచింది. వెంటనే ఆ ఏనుగుకు స్వామివారి గర్భగుడిదృశ్యం గుర్తుకు వచ్చింది. ఆ గర్భాలయం చీకటిగా కనిపించడం మనసులో మెదిలింది. స్వామి దివ్యమంగళాకారం మసకమసకగానే కనబడడం స్ఫురించింది. ఈ చంద్రుణ్ణి పట్టి గుడిలో పెడితే ఆ తెల్లనితేజంలో నల్లనయ్యను ఎంత బాగా దర్శించుకోవచ్చో! క్షణం ఆలోచించింది. ఇంకేం చంద్రుణ్ణి పట్టి లాగడానికి తొండం చాచింది. కాని అందుకోలేకపోయింది. అయినా తన ప్రయత్నం కొనసాగిస్తూనే ఉంది. ఆలాంటి ఏనుగును కొండమీద తిరుగాడే వేటగాళ్ళు చూచారు. ఆ ఏనుగును బంధించాలనుకొని విఫలులైనవారు ఇదే అదనుగా ఏనుగును బంధించారు. ఏనుగుకు ఇది ఊహించని బంధనం. తన ప్రయత్నానికి విఘాతమే అని ఆందోళన. అయితేనేం లోకంలో కొందరికి శత్రువులు, మిత్రులు సహజం. ఆ కొండలోని బోయలకు ఈ ఏనుగంటే ప్రీతి. ఏనుగు బంధింపబడడం చూచి బోయలు వేటగాళ్ళపై బాణాలు ఎక్కుపెట్టారట. ఇటువంటి 'వేంగడానికి' ప్రదక్షిణం చేసి ఆనందపారవశ్యంతో నాట్యం చేయడం తగిందని ఆళ్వారుల సలహా.

ఇలాంటిదే మరొక ప్రకృతి దృశ్యం– వేంకటాచలంలో పెద్దగా శబ్దిస్తూ ప్రవహించే సెలయేళ్ళలో ముత్యాలు కొట్టుకు వచ్చేవని వీరు పాశురాల్లో తెలిపారు.



శరభమృగాలు, పరాక్రమంగల సింహాలు, బంగారం, మణులు, ముత్యాలు, నిండుగా పూచిన తరువులు, పలు రత్నాలు, వేగమైన జలప్రవాహాలతో కూడిన అరణ్యాలు, వానరాలు, బోయవాళ్ళను కల వేంకటాచలమని **"నన్ మణి వణ్ణమార్"** పాశురంలో వర్ణించారు.

ఇలాంటిదే మరొక చిత్రణ – అది చలికాలం. ఆ చలికాలంలో మంచు విపరీతంగా కురుస్తోంది. ఏపుగా ఎదిగిన వెదుళ్ళు ఆ మంచు కారణంగానే వంగి వంగి నేల వైపుకు కుంగిపోయాయి. అయితేనేం? రాత్రి గడిచింది. తెల తెలవారింది. సూర్యోదయమయింది. సూర్యకిరణాలస్పర్శతో మంచుగడ్డలు కరిగిపోయాయి. అలా కరిగి కరిగిపోతుంటే వాలిన వెదుర్లు వెంటనే ఎగిరి ఆకాశంకేసి నిటారుగా నిల బడ్డాయట. ఆళ్వారుల పరిశీలనాశక్తి అమోఘం. విర్ర వీగినవాడు ఎదురుదెబ్బలు తగులుతుంటే క్రుంగి కృశించి పాదాక్రాంతుడై స్వామి అనుగ్రహంతో ఆపై భక్తాగ్రేసరుడుగా వెలుగొందినట్టు అని 'శెళుంకొళుం పెరుమ్బని పొళిన్దిడ' పాశురానికి అర్థవిశేషం చెప్పారు.

'ఓణ విళువిల్ ఒలి యదిర ప్పేణివరు వేంగడవా' అనే వాక్యంలో స్వామి తిరునక్షత్రమైన శ్రవణంలో శ్రీవైష్ణవులు చేసే 'మంగళాశాసనధ్వని' అంతటా వ్యాపిస్తున్న దని చెప్పబడింది. అంతేకాదు పలుదిక్కులనుండి పలువురు భక్తులు విచ్చేసి స్వామిని సేవిస్తున్నారని విశదం చేశారు.

అంతేకాదు చంద్రశేఖరుడైన శివుడు, కమలజుడైన బ్రహ్మ ఛత్రచామరాది సాధనాలతో మేఘమండలాన్ని తాకే శిఖరాలుగల తిరువేంగడంలోని స్వామిని అర్చించడానికి సర్వేశ్వరునికి 'నీరాజనం' సమర్పించాలని వస్తున్నారని 'మంగుల్ తోయ్ శెన్ని వడ వేంగడత్తానై' పాశురం వివ రిస్తున్నది.

**తిరుమళిశైఆళ్వార్ 'అర్చామూర్తులలో' తేడాలు చూడనివారు. అంచేత తిరువేంగడంలోని స్వామిని దశావ తారాలమూర్తిగానే భావించాడు. అందరు అన్ని సమయా లలో వచ్చి తరించాలనే కోరికతో వేంకటాచలంలో వేంచేసి ఉన్నాడని 'కడైందు పాఱ్కడల్' పాశురంలో వర్ణించారు. అంతేకాదు 'తిరుక్కుదందై' (కుంభకోణం)లోని శయన భంగిమస్వామి కూడా ఇతడే సుమా! అని వర్ణించారు. తిరుక్కోట్టియూర్‌లోని స్వామికూడా ఇతడే అన్నారు.**

వీరు తిరుమలక్షేత్రవైభవాన్ని విశదపరచిన తీరు మనోజ్ఞం. ఈ లోకంలోని సంసారులకు మాత్రం కాదు. పరమపదంలోని నిత్యసూరులకు కూడా సంసేవ్యమాన మనడం ఒక పద్ధతి. సౌలభ్య సౌశీల్యాదిగుణాలు అను భవించడానికే నిత్యసూరులు వేంగడానికి వస్తున్నారని కారణం చెప్పడం రెండవపద్ధతి. భక్తులు ఆదరంతో సేవించి, స్వామి పాదాలకు పవిత్రకుసుమాలను సమర్పించి, సంప్రీతి హృదయంతో సతతం సేవిస్తూ అక్కడే నివసించడానికి వీలయిన క్షేత్రమనడం మూడవవిధానం. శరీరసంబంధమైన కర్మలు, దుఃఖాలు ఏమాత్రం పీడించకుండా రక్షించే స్వామి పదాలుగల క్షేత్రమనడం నాల్గవవిధానం.


వీరు వింతలెన్నోగల వేంగడం కొండపై చేరాలని తపించారు. చేరగలనా? చేరలేనా? అని తన అదృష్టం పరీక్షించుకొన్నారట. అంతేకాదు స్వామిని క్షణమైనా వదలి ఉండలేనన్నారు.

**'వెఱ్పెన్డు వేంగడమ్ పాడినేన్ వీడాక్కి'** అనే **పాశురంలో– 'వేదశాస్త్రాలలో ప్రతిపాదింపబడ్డ భక్తి అనే వలలో భగవంతుడు చిక్కుకొన్నాడు. నేను ఆ శ్రియఃపతి పాదాలు అనే వలలో చిక్కుకొన్నాను. ఒకసారి అలవోకగా పర్వతాల పేర్లలో 'వేంగడమ్' అని చెప్పినందుకే నా ఊరు చెప్పావు. నా పేరు స్మరించావు. నన్ను దర్శించావు' అని నాకు మోక్షసామ్రాజ్యం అనుగ్రహించాడని చెబుతూ ఒక్కక్షణం కూడా ఆ పాదాలను విడిచి ఉండనని తన ఆర్తిని, స్థిరత్వాన్ని విశదీకరించారు.**

వీరి ఆర్తి అంతా శ్రీనివాసుని నిత్యం సేవించాలని, వేంకటాచలంలో నిత్యవాసం చేయాలనుండేది.

**వీరు భక్తాదులకిచ్చిన సందేశాలు రెండు. ఒకటి భాగవతాభిమానంలో ఒదిగి ఉండేవారు అందరికన్న మిన్న అనడం. రెండవది యౌవనం సెలవు పుచ్చుకోకముందే ఇంద్రియాలు స్వాధీనంలో ఉన్నప్పుడే తిరువేంగడం వెళ్ళి, స్వామిని సేవించాలనడం.**

ఆళ్వారుల వర్ణనలలో ఏనుగులసంచారం తప్ప కొండవాగులు, ఉరవడిగా ప్రవహించే సెలయేళ్ళు, పుష్ప మండపాలు, భక్తాదుల సంరంభాలు నేడూ దృశ్యమానాలే కావడం విశేషం.



# గడపనైనా కాకపోతిని...

- శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు, 99896 79681.

**కులశేఖరుడు సామాన్యుడు కాడు. ఇతడు రథ గజ తురగ పదాతియనే చతురంగబలాలతో రాజ్యమేలాడు. ఆ రాజ్యపాలనసమయంలోనే అతనికి వైష్ణవశక్తి యొక్క స్వరూప, రూపగుణవిభవ, విభూతులందు సేవాతత్పరులై ఉన్నప్పుడు భగవద్భక్తియుక్తమైన జ్ఞానముదయించింది. తన సర్వసంపదలను సునాయాసంగా వదిలేసి పెరుమాళ్లను ఆశ్రయించి స్వామిని కీర్తిస్తూ ఆళ్వారులలో ప్రసిద్ధ భాగవతోత్తమునిగా పేరుగాంచాడు.**

శ్రీవైష్ణవంలో ఆళ్వారులది విశిష్టస్థానం. ఆళ్వారుల సర్వస్వం శ్రీమన్నారాయణుడే. వారి మనస్సు భగవంతుని భజించింది. జిహ్వ నారాయణుని కీర్తించింది. కనులు కమలాక్షుని కాంచాయి. కర్ణాలు కమలాధిపుని కథలు విన్నాయి. చేతులు శ్రీహరిని సేవించాయి. పాదాలు పెరుమాళ్లగుడికి ప్రదక్షిణం చేశాయి. సర్వస్వం ఆ దేవుడే అనే నిర్భర అధ్యవసాయం ఉండిన పూర్ణయోగులు ఆళ్వారులు. రూపొందిన గీతాస్వరూపులు ఆళ్వారులు. ఉజ్జీవించిన ఉపనిషన్మూర్తులు ఆళ్వారులు. జలజల ధ్వానం చేస్తూ పారే దైవిక ప్రేమానందప్రవాహాలు ఆళ్వారులు. వేయి మాటలెందుకు? నడయాడే పవిత్ర దేవాలయాలు ఆళ్వారులు.

ఆళ్వారులలో శ్రీకులశేఖరులు ఒకరు. వీరు చేర వంశీయులు. దృఢవ్రతుడు అనే రాజుకు పుత్రులు. భగవానుని కౌస్తుభాంశాన అవతరించినవాడు. కుంభ (మాఘ) మాసంలో పునర్వసునక్షత్రాన వీరు జన్మించారు. కేరళలోని కోళిపట్టణం (తిరువాన్కూరు)లో జన్మించారు. దీనిని క్విలన్ అంటారు. ఈ పట్టణాన్ని కొల్లినగరం, కుక్కుటకూటం, కుక్కుటపురం, కొళకూరు అని కూడా వ్యవహరిస్తారు. ఈ పురానికి అధీశుడు కనుక క్షత్రియ వంశీయుడైన కులశేఖరులను కొల్లి కావలన్, కుక్కుటపురాధీశన్, కొళియన్ అని కూడా కొన్నిచోట్ల వ్యవహరిస్తారు. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె.

**వీరి కుమార్తె నీళాదేవి అంశాన జన్మించిందంటారు. ఆమెను కులశేఖరులు శ్రీరంగనాథునికి అర్పించినట్లు చెప్తారు. వీరి తదనంతరకాలాన విష్ణుచిత్తులు (పెరియాళ్వారులు) తన పెంపుడుకూతురు ఆండాళమ్మను (గోదాదేవిని) శ్రీరంగనాథునికి సమర్పించటం ప్రస్తుతం స్మరణీయం.**

కులశేఖరులవారి దాస్యభక్తి పారవశ్యానికి అద్దం పట్టే సంఘటనలు చాలా ఉన్నాయి. అవి తలచుకుంటే మేను పులకరించిపోతుంది. వైష్ణవులంటే సాక్షాత్తు విష్ణుస్వరూపులని కులశేఖరులవారి అభిప్రాయం. భగవత్కథాశ్రవణం, తద్గుణకీర్తనం, వైష్ణవగోష్ఠి, నిరంతర భాగవతసేవ-దాస్యభక్తి అనే వాటిని పరమనిష్ఠగా ఎంచుకున్నవారు కులశేఖరులు. అందుకే కాబోలు వీరి మూర్తి అంజలిముద్రలో దర్శనమిస్తుంది. 67 సంవత్సరాలు జీవించిన వీరు పెరుమాళ్ తిరుమొళి, ముకుందమాల అనే రచనలను చేశారు.

**శ్రీకులశేఖరాళ్వారు బాల్యము, యౌవనము, కౌమారము, వార్ధక్యమనే చతుర్దశలు మరియు బ్రహ్మచర్యం, గృహస్థం, వానప్రస్థం, సన్యాసమనే చతురాశ్రమాలను నిండుగా, నియమబద్ధంగా గడిపిన పుణ్యపూర్ణజీవులు.**

## పెరుమాళ్‌తిరుమొళి

శ్రీరామచంద్రులవారు, కులశేఖరులవారు ఇద్దరూ క్షత్రియరాజులే. ఇరువురి జన్మనక్షత్రం కూడా పునర్వసు నక్షత్రమే. భాగవతులు శ్రీరాముని పెరుమాళ్ అంటారు. కులశేఖరులకు కూడా 'కులశేఖరపెరుమాళ్' అని వ్యవహారం. 'తిరుమొళి' అంటే సుభాషితం / సూక్తి (తిరు=సు, మొళి=ఉక్తి; తిరుమొళి=సూక్తి) అని అర్థం. 'పెరుమాళ్ తిరుమొళి' అంటే కులశేఖరులు చెప్పిన మంచిమాటలని అర్థం. పెరుమాళ్ తిరుమొళి తమిళ దివ్యప్రబంధం. భాగవతవిజ్ఞాన రత్నకోశమైన 'నాలాయిరదివ్యప్రబంధం'లో పెరుమాళ్ తిరుమొళి ప్రథమసహస్రంలో ఐదవశతకంగా ఉంది. పెరుమాళ్‌తిరుమొళి కులశేఖరులవారి దాస్యభక్తి ప్రపత్తుల స్వరూపస్వభావాల ఉదాత్తతకి అద్దం పడుతుంది. ఈ కృతి ప్రతిభాగంలోనూ పదిపాశురాలతో పదిభాగాలుగ విభజించబడింది. ప్రథమభాగంలో శ్రీరంగనాథుని సేవించుకోవాలనే దాస్యభక్తి తత్పరత వెల్లడి అయింది. ద్వితీయభాగంలో శ్రీరంగనాథుని భక్తులవైభవం ప్రశంసించబడింది. తృతీయ భాగంలో శ్రీరంగనాయకులపై కులశేఖరులు తనకు ఉండే దాస్యభక్త్యోన్మత్తతను ఉగ్గడించారు. చతుర్థభాగంలో వేంకటేశ్వరులు వేంచేసిన శేషశైలంతో నిత్య సంబంధం ఉండిన ఎలాంటి స్థావర జంగమాది జన్మనైనా ఇస్తే తరిస్తామని వినూత్న దాస్యభక్తిభావాన్ని ప్రకటించారు కులశేఖరులు.

ఐదవభాగంలో పరమాత్మకు జీవాత్మకుండే సంబంధం దృష్టాంత పూర్వకంగా వివరించబడింది. ఆరవభాగంలో పాశురాలు మధురభక్తికి పరాకాష్ఠ. పరమేశ్వరుడు ఒక్కడే పురుషుడు. తదితరమైన చరాచరాత్మకమైన జగత్తంతా కూడా స్త్రీప్రాయమే అని చెప్పబడింది. భక్తునికి భగవంతునికి గల నవవిధసంబంధాలలో భార్యా భర్తల సంబంధం ఒకటి అని చెప్పబడింది.

ఏడవభాగంలో శ్రీకృష్ణుని శైశవదశను చూచే భాగ్యానికి నోచుకొనని దేవకీదేవి తన దుర్దశను తలచుకొని పలికిన భావాలు ఉన్నాయి. దీనిలో 'శౌరిశైశవలీల' అద్భుతంగా అభివర్ణితం. ఎనిమిదోభాగంలో శ్రీరామచంద్రుని బాల్యదశ, కౌసల్య పరమాత్మానుభవం అభివర్ణితం. తొమ్మిదో




భాగంలో రామచంద్రుని ఎడబాటును సహించలేక విలపించిన దశరథుని స్థితి నవరసభరితంగా హృదయాలను ద్రవీభూతం చేసే రీతిలో వర్ణించబడింది.

చివరిదైన పదవభాగంలో ఏడుకొండలలోని రామాయణగాథ సంగ్రహంగా పొందుపరచబడింది. పెరుమాళ్‌తిరుమొళిలో శ్రీరంగం, వేంకటాచలం, అయోధ్య, చిత్రకూటం, తిరుక్కణేపురం, చిదంబరం, వారాహపురం అనే దివ్యదేశాలలో వెలసిన పెరుమాళ్‌స్తుతి రమణీయంగా ఉంది.

## కులశేఖరులవారి దాస్యభక్తి - వేంకటేశ్వరస్వామి

పెరుమాళ్‌తిరుమొళిలో కుల శేఖరులవారి భక్తిరసం కట్టలు తెగి పారింది. గేయస్పృక్కులైన రుక్కుల వంటి పాశురాలతో కులశేఖరులు స్వామిని దాసుడై ఇలా ప్రార్థించాడు.

'ఓ వేంకటాచలపతీ! నాకు ఈ లోకమే కాదు స్వర్గరాజ్యం ఇచ్చినా వద్దు. తండ్రీ! నీ కొండపై ఉండే అవ

శ్రీకులశేఖరాళ్వారు రజస్తమోగుణాలకు అతీతుడై
శ్రీవేంకటాద్రిలోని ఒక సోపానం కాగల్గినా
తన జన్మ చరితార్థమౌతుంది కదా
అని స్వామికైంకర్యానికై పరితపించినవారు.

కాశం ఇస్తే చాలు. నీ పాద పద్మాలదాక పూలను చేర్పించే మెట్ల వరుసగా నన్నుండనీయరాదా! నీ తులసిపూలతోటకు నీరు పారే కాలువగా నన్ను పుట్టింప రాదా! నీ సుందరమైన మందిరంలో నన్నొక స్తంభంగానైనా నిలుపరాదా! నీ పాదాల అర్చనకోసం పూలను అందించే పూలమొక్కగా నన్ను చేయరాదా! స్వామి పుష్కరిణిలో తళుకు తళుకుమంటూ ఎగిరేచేపలలో నన్నొక చేపపిల్లగా ఉండేటట్లు అనుగ్రహించ రాదా! తండ్రీ! నీ గర్భాలయానికి గడపగా ఉండేందుకు దయచూస్తే నీభక్తులపాదధూళిలో నలిగి నీ పాదారవిందా లను సేవిస్తూ ఉంటాను కదా!' – ఇలా దాస్యభక్తి ఆవేశంతో విలపించి వివశులై పడిపోయారట కులశేఖరులు. నేటికి కూడా తిరుమలలోని వేంకటేశ్వరస్వామివారి గర్భాలయానికి ఉండే గడపకు 'కులశేఖరప్పడి' అనే వ్యవహారం ఉంది. మహాభక్తవరేణ్యులకుకానీ ఇంతటి తన్మయత్వం కలుగదు కదా!

## ముకుందమాల

'ముకుం దదాతీతి ముకుందః' మోక్షం ఇచ్చేవారని ముకుందశబ్దానికి నిర్వచనం. ముకుందమాల మొదటి శ్లోకంలోనే 'ముకుంద' సంబోధన ఉంది. 'శ్రీవల్లభేతి... కురుమే ముకుంద'. స్తోత్రంలోని చాలాశ్లోకాలలో ముకుంద శబ్దప్రయోగం ఉండటం స్మరణీయం. ఇది ముఖ్యంగా శ్రీకృష్ణస్తోత్రం. ఈ స్తోత్రంలో ఏ ఇతర అవతారాన్ని సూచించే పదం కూడా ప్రయోగించబడక కృష్ణావతార సంబంధమైన పదాలనే వాడటం విశేషం.

ముకుందమాలస్తోత్రంద్వారా కులశేఖరులవారు అందించిన సందేశం – "భగవన్నామస్మరణ చేయండి. భగవద్భక్తి కలిగి ఉండండి. అల్పులనుగాక సర్వేశ్వరుని యాచించు. కామాదులను దగ్గరకు చేరనీయకు. పర మౌషధం– పరమమంత్రం భగవన్నామమే. అనన్యభక్తితో నారాయణుని మాత్రమే శరణువేడు. అతడే సర్వశ్రేష్ఠుడు."

లలితపదభూయిష్ఠ, మనోహరభావసంపద, ధారా శుద్ధి, సరళసుందరశైలి కలిగిన ముకుందమాలలోని శ్లోకా లలో కొన్నింటిని కొందరు కవులు తమ కృతులలో చేర్చు కున్నారు.

ముకుందమాల పరిమళాలు యావద్భారతదేశంలో వ్యాపించి గుబాళించాయి. ముకుందుని కంఠసీమ వన మాలయై శ్రీవారి హృదయంపై వ్రేలాడింది ముకుందమాల. కులశేఖరులు కౌస్తుభాంశాన జన్మించడం ఈ సందర్భాన స్మరణీయం.

రామభక్తులలో పరిపూర్ణంగా పరవశించి తన్మ యత్వం పొంది స్పందించినవాళ్లలో ప్రథమగణ్యుడు హనుమ, ద్వితీయులు కులశేఖరులు. కులశేఖరులవారి భక్త్యావేశానికి ఒక ఉదాహరణ– ఒక పౌరాణికుడు రామా యణం చెప్తూ అందులో రావణాసురుడు రామలక్ష్మణులను వంచించి సీతను హరించినాడు అని చెప్పాడు.

ఆ మాటలకు కులశేఖరులు వెంటనే ఖడ్గాన్ని ధరించి దివ్యాశ్వాన్ని అధిరోహించి సీతను తెచ్చేందుకు సిద్ధపడుతూండగా కులశేఖరుల భక్త్యావేశాన్ని గ్రహించిన శ్రీస్వామివారు సీతారామలక్ష్మణులుగా దర్శనమిచ్చి ఆయనను తిరిగి నగరికి వెళ్ళేట్లు చేశారు.

దివ్యమైందీ, అద్భుతమైందీ, వినేవారికి శ్రవణానంద కరమైందీ, భక్తులు అనే పద్మాలకు సూర్యునివంటిదీ, పుణ్యప్రదమైందీ, పాపవినాశకరమైందీ, సంస్కారమోచక మైందీ అయిన కులశేఖరుల దాస్యభక్తినిగురించి ఎంతో... ఎంతెంతో చెప్పుకోవచ్చు. ఇప్పుడు మనం చదివింది కొంతే!

ఘుష్యతే యస్య నగరే రంగయాత్రాదినే దినే!
తమహం శిరసావందే రాజానం కులశేఖరమ్ ॥

**త**మిళనాడులో కావేరినదిఒడ్డున శ్రీరంగం ఉంది. అక్కడ శ్రీమన్నారాయణుడు రంగనాథుడుగా కొలువై ఉన్నాడు. ఆ సమీపంలో నిచుళాపురం ఉంది. నిచుళా పురంలో పాణయ్య అనే వాడున్నాడు. పాణ–అనేది కులం పేరుగాని, అసలు పేరు కాదు. ఆ కులాన్ని తక్కువకులంగా భావిస్తారు. తక్కువకులంవాడైనా పాణయ్య గుణం ఉన్న వాడు. రంగనాథునిపై ఆయనకు భక్తి మెండు. భగవంతుడు కులాన్ని పట్టించుకోడు. ఎవరుకోరుకుంటే వాళ్లకి సమీపం లోనే ఉంటాడు.




పాణయ్య పొద్దుటే స్నానం చేసి తిరునామం ధరించేవాడు. ఏక నాదం పట్టుకొని కావేరిఒడ్డుకు వచ్చే వాడు. గుడికి వెళ్లడు. భగవంతుడు అడ్డు చెప్పడు. కానీ, మనుషులు రానిస్తారా! ఈ గొడవలెందుకని పాణయ్య ఏట్లో ఇసుకతో బొమ్మను చేసుకొని దానినే రంగనాథునిగా భావిస్తూ, ఏక నాదం మీటుకుంటూ, పాటలు పాడు కుంటూ ఉండేవాడు. ఎవరో ఒకరు ప్రసాదం తెచ్చి ఆయన జోలెలో వేసేవారు. అదే అమృతంగా భావించి చీకటి పడు తూండగా ఇంటిదారి పట్టేవాడు. ఇదీ పాణయ్య నిత్యార్చన.

శ్రీరంగంలోనే ఒక వైష్ణవతిలకుడు. ఆయన్ని లోక సారంగుడు అంటారు. ఆయన ప్రతిదినం కావేరికి వచ్చే వాడు. ఆయన వెంట కొందరు వైష్ణవభక్తులు ఉండేవారు. లోకసారంగుడు, ఇతరభక్తులు కావేట్లో స్నానంచేసి బిందెతో నీళ్లు తీసుకెళ్లే వారు. ఆ నీళ్లే రంగనాథస్వామికి పాదోదకం.

ఒకనాడు లోకసారంగుడు దారిమార్చాడు. ఆయన వెంటే వైష్ణవభక్తులూ! సరిగ్గా పాణయ్య ఉన్న ప్రాంతానికి వచ్చాడు. పాణయ్య గొంతు ఆయనకు వినిపించింది. తీయని పాట లోకసారంగుని ఆ వైపుకు లాగింది. ఎవడో మహాను భావుడు రంగని గానం చేస్తున్నాడనుకొన్నాడు. పాణయ్యను సమీపించాడు. పాణయ్య వేషం చూశాడు. వేషం చూస్తూనే ఆయన కులం ఏమిటో అర్థమైపోయింది. వీడా ఇక్కడ పాట పాడుతూ ఉంది అనుకొన్నాడు. ఛీ వాణ్ణి సమీపించకూడదను కొని, రేయ్ దూరంగా వెళ్లిపో! అన్నాడు. పాణయ్యకు లోక సారంగుని మాటలు వినిపించలేదు. మళ్లీ గద్దించాడు. ఫలితం లేదు. కిందికి వంగి రాయి తీసుకొన్నాడు. పాణయ్యవైపు విసిరాడు. వైష్ణవభక్తులూ తలా ఒక రాయి విసిరారు. పాణయ్య ఒళ్లంతా గాయాలు! నెత్తురు కారు తూంది. ఐనా పాణయ్య పాట ఆగలేదు. లోకసారంగుడు వెనుతిరిగి దారిమార్చుకొన్నాడు. మరో రేవులో స్నానంచేసి బిందెతో నీళ్లు తీసుకొని తన వారితో వెళ్లిపోయాడు.

అక్కడ రంగనాథుని గుడి తలుపులు తెరిచారు. స్వామిని చూశారు. కనుగుడ్లు తేలేశారు. రంగనాథుని ఒళ్లంతా నెత్తురు. వార్త గుడి దాటింది. ఊరుఊరంతా తెలిసిపోయింది. ఆ రాత్రికి లోకసారంగుడు కలగన్నాడు. కలలో రంగడు కనిపించాడు. రంగని కళ్లు ఎర్రపడి ఉన్నాయి. నా భక్తుడైన పాణయ్యను అవమానించావు. ఇవిగో నాభక్తునిపై నీ దెబ్బలు నేను భరించాను అన్నాడు. స్వామి ఒళ్లంతా నెత్తుటి గాయాలే. పాణయ్యకు రేపు నాదర్శనం చేయించు – అన్నాడు. కల కరిగిపోయింది. తెల్లారింది.

ఉదయాన్నే లోకసారంగుడు కావేరికి పరుగులు తీశాడు. అతనివెంట శిష్యులు, ఊరిజనం. లోకసారంగుడు పాణయ్యను సమీపించాడు. నిన్న తాను చేసిన తప్పును మన్నించుమన్నాడు. గుడికి దయచేయుమని వేడుకొన్నాడు. స్వామి నాకు కలలో కనిపించి నన్ను మందలించాడన్నాడు.

పాణయ్య పాట ఆపి సారంగుని మాటలు విని, రంగనాథుని దర్శించిన అదృష్టవంతులు మీరు అన్నాడు. గుడికి మిమ్మల్ని తీసుకురమ్మని స్వామి ఆజ్ఞ అని సారంగు డన్నాడు. ఆలయం పవిత్రమైనది, అక్కడ కాలుమోపడం నాకిష్టంలేదు అన్నాడు పాణయ్య. లోకసారంగుడు ఒక్క క్షణం ఆలోచించాడు. పాణయ్యను భుజాలకెత్తుకుని, రంగనాథుని గుడికి కదిలాడు. పాణయ్య పాట అందుకున్నాడు. పాణయ్య చుట్టూ వైష్ణవభక్తులు. చుట్టూ ఊరిజనం. వేద మంత్రోచ్చారణ. ద్రావిడవేదపఠనం కొనసాగుతుండగా పాణయ్య లోకసారంగుని భుజాలమీద గుడిలో ప్రవేశిం చాడు.

**అది రంగనాథుని దివ్యదర్శనం. ఆదిశేషుని పానుపుమీద శయనించిన స్వామి పాణయ్యను చూస్తున్న ట్లుంది. స్వామి కన్నులు దివ్యకాంతులు వెదజల్లుతూన్నాయి. పాణయ్య చూపులు రంగని పాదాలు తాకాయి. పాణయ్య నోటినుంచి పాశురం వెలువడింది. పాణయ్య చూపు కుడి వైపు తిరిగింది. స్వామి కటిస్థలం కనిపించింది. పీతాం బరం కనిపించింది. తరువాత వక్షఃస్థలం చూశాడు. ఆ తర్వాత కంఠం, పెదాలు, నయనాలు, రత్నఖచితభూషణా లతో విరాజిల్లుతున్న నీలమేఘశరీరం, చివరగా ఆ స్వామి దివ్యదర్శనం. దివ్యదర్శనమయ్యేసరికి పాణయ్య పదిపాశు రాల మధురగానంతో రంగని కోవెల ప్రతిధ్వనించింది. అది పాణయ్య జన్మాంతర తపః పుణ్యఫలం.**

పాణయ్య ఇలా పదిపాశురాల్లో శ్రీరంగనాథ స్వామిని వర్ణించాడు. ఈ వర్ణనలో ఒక విశేషముంది. మనం మానవుల్ని సరాసరి వారిముఖంకేసి చూడొచ్చు. కాని దేవతల్ని అలా చూడరాదు. పాదాలనుంచి ప్రారంభించి పైకెళ్లాలి. పాణయ్య మొదట స్వామిపాదాలే దర్శించాడు. క్రమంగా ముందుకెళ్లాడు. పదిస్థానాల్లో దృష్టినాపి పది పాశురాలు చెప్పాడు. పాణయ్య చెప్పిన పదిపాశురాల్లో మరో విశేషముంది. పాణయ్యపాశురాల్లో రెండుచోట్ల– ఏడుకొండల్నీ, ఏడుకొండలదైవాన్నీ వర్ణించాడు. ఆ పాశు రాలభావం ఇలా ఉంది.

**ఒకపాశురం– స్వామి అత్యంత పవిత్రమైనవాడు. విశ్వానికి ఆదిదేవుడు. నాకు మార్గదర్శి. అంత్యకులంలో పుట్టిన నన్ను దాసులకు దాసుడుగా తీర్చడానికి వచ్చాడు. ఆయన పరంధాముడు. సొబగైన మేని కాంతిగలవాడు. నిత్య సూరు లకు నాయకుడు. పూలపరిమళాలతో విరాజిల్లే తోటలున్న తిరుమలలో కొలువైన వేంకటేశ్వరుడు. ప్రతిఫలం ఆశించని కరుణామయుడు. శ్రీమన్నారాయణుడు. పరమపదవాసి. ఎత్తైనప్రాకారాల శ్రీరంగంలో పవళించి ఉన్న ఆయన పాదపద్మాలు నా కళ్లల్లో నిలిచి దర్శనమిస్తున్నాయి.**

**మరోపాశురం– వానరాలు వేంకటాచలంలో చెట్లకొమ్మలమీద గంతులేస్తూన్నాయి. అక్కడ నిత్యసూరులు సువాసన గల పుష్పాలతో స్వామిని సేవిస్తూన్నారు. ఆస్వామి శ్రీరంగంలో శేషునిపై ఉన్నారు. ఆ స్వామి పట్టుపీతాంబరాలు, బ్రహ్మ పుట్టిన నాభికమలం నా హృదయంలో హత్తుకుపోయాయి.**

తిరుమలకు శ్రీరంగానికి సామ్యముంది. శ్రీరంగంలో ఆదిశేషునిపై స్వామి శయనించి ఉంటాడు. తిరు మలలో ఆదిశేషుడు పానుపుగా కాకుండా శేషాచలంగా ఉంటూ స్వామిని మోస్తున్నాడు.

త్రేతాయుగంలోని శ్రీరామచంద్రుడే శేషాచలంలోని వేంకటరమణుడు. త్రేతాయుగంలో వానరాలు రామ దండుగా రాక్షససంహారం చేసి రామునికి సేవ చేశాయి. ఇప్పటికీ తిరుమలలో ఆ వేంకటరాముని సేవిస్తున్నాయి.

**ఈ సంగతులన్నీ తెలిసినవాడే పాణయ్య. శ్రీవైష్ణవ దేవాలయాల్లో పన్నిద్దరాళ్వారులలో ఒకరుగా 'తిరుప్పాణా ళ్వారు' గా పిలిపించుకొంటున్నాడు. ఏ కులజుడైననేమి! ఎవ్వడైననేమి! అంటూ స్వామిసేవకు నోచుకున్న అపరభాగ్య శాలిగా కొనియాడబడ్డాడు.**


# నీ చరణమే శరణు సర్వేశ్వరా....!

- శ్రీ నాగసుదర్శన్‌రావు, 97013 85006.

దైవం మానుషరూపేణ అన్నట్లు, ఎందరో మహాపురుషులు తిరుగాడిన పుణ్యభూమి మన హిందూదేశం.
వారిలో దక్షిణదేశానికి చెందిన 12మంది ఆళ్వార్లను శ్రీమన్నారాయణతత్త్వాన్ని బోధించినవారిలో సుప్రసిద్ధులుగా పేర్కొంటారు.
అందులో ఒకరు శ్రీ తిరుమంగైఆళ్వార్. విష్ణుసేవాతత్పరుడై 6 దివ్యప్రబంధాలను మనకు అందించాడు.
అసలు ఈ తిరుమంగైఆళ్వారు ఇంత గొప్ప భాగవతోత్తముడెలా అయ్యాడో తెలుసుకుందాం.

ఈయన మొదటిపేరు నీలుడు. చిన్ననాటినుండే తన తండ్రియొక్క గుణసంపదను, ధైర్యసాహసాల్ని పుణికి పుచ్చుకున్నాడు. అంతేగాక భగవదనుగ్రహంవల్ల ఇతనికి మంచి కవిత్వపటిమ కూడా అబ్బింది. సకలశాస్త్రాలను అభ్యసించాడు. ధనుర్విద్యలో కూడా మంచిప్రావీణ్యం సంపాదించాడు. అతని తండ్రి చోళరాజువద్ద సైన్యాధిపతిగా పని చేస్తూండేవాడు. తండ్రి మరణానంతరం, నీలుడి ప్రజ్ఞావిశేషాల్ని గుర్తించి, చోళరాజు, ఆ ఉద్యోగాన్ని నీలుడికిచ్చాడు. నీలుడు అరివీర భయంకరుడిగా పేరు తెచ్చుకున్నాడు. పరకాలన్‌గా ఖ్యాతి గడించాడు.

తన రాజ్యాన్ని శత్రువులబారినుండి ఎంతో నైపుణ్యంతో కాపాడుతున్న నీలుడి ధైర్యసాహసాలకి మెచ్చి చోళరాజు నీలుడిని తిరుమంగై అనే పట్టణానికి రాజుని చేశాడు. అప్పటినుంచి నీలుడు తిరుమంగైమన్నాన్‌గా పిలువబడ్డాడు.




వైష్ణవదంపతుల కుమార్తె కుముదవల్లి. ఆమె రూపలావణ్యాలకు ముగ్ధుడయ్యాడు. ఆమెను వివాహం చేసుకో నిశ్చయించి ఆ వైష్ణవదంపతులవద్దకు వెళ్లాడు. అప్పుడు కుముదవల్లి కూడ తిరుమంగైని చూసి ఇష్టపడింది. కాని, తానుపెట్టే రెండు షరతులకు ఒప్పుకున్నట్లైతేనే తాను అతణ్ణి వివాహం చేసుకుంటానని చెప్పింది. అందులో ఒకటి - తిరుమంగై పంచసంస్కారాలు చేసుకోవాలి. రెండవది తాను ఒక సంవత్సరంపాటు బ్రాహ్మణ భాగవతోత్తములకు పాదసేవచేసి భోజనాలుపెట్టాలి. ఆ రెండు షరతులకు ఒప్పుకున్నాడు తిరుమంగై.

అన్నమాటప్రకారం తిరుమంగై దైవసాన్నిధ్యంలో పంచసంస్కారాలు చేయించుకున్నాడు. తర్వాత వారిద్దరి వివాహం ఘనంగా జరిగింది. ఆ తర్వాత రెండవషరతుని కూడ అమలుపరిచాడు. తన వద్దనున్న ధనాన్నంతా సమారాధనలకే వెచ్చించాడు. ధనము సరిపోక రాజద్రవ్యాన్ని కూడ ఖర్చుపెట్టసాగాడు. అప్పుడు రాజు తన భటులను పంపి, తిరుమంగైని దండించి పన్ను వసూలు చేసుకురమ్మని పంపాడు. ఆ రాజభటుల్ని తిరుమంగై ధిక్కరించి పంపాడు. స్వయంగా

రాజే వచ్చినా కూడ లాభం లేకపోయింది. అప్పుడు రాజు తిరుమంగైకి మంచిమాటలు చెప్పి తన రాజ్యానికి తీసుకెళ్ళి, ఒక దేవాలయంలో బంధించాడు. రాజధనాన్ని మొత్తమిచ్చే దాక వదలొద్దని రాజభటులను ఆదేశించాడు.

**ఒకరోజు రాత్రి విష్ణుమూర్తి కలలో కనిపించి తిరు మంగైని కంచి వరదరాజస్వామిగుడికి రమ్మని చెప్పాడు. రాజుగారి అనుమతితో అక్కడికి వెళ్ళాడు తిరుమంగై. చూడగా అక్కడ రాజుగారికివ్వాల్సిన ధనమున్న ఒక మూట దొరికింది. అప్పుడు తిరుమంగై రాజుగారికి ఇవ్వాల్సిన ధనాన్ని మొత్తమిచ్చేశాడు. ఈ మహిమను తెలుసుకున్న రాజు తిరుమంగై తనకిచ్చిన ధనాన్నంతా మరల తిరిగి అతనికే ఇచ్చేసి నియమవ్రతానికై వాడుకోమని చెప్పాడు.**

ఆ ధనాన్ని సమారాధనకు వాడుకున్నాడు తిరు మంగై. ఐనా ధనము సరిపోక దొంగతనాలు, దారిదోపిడీలు మొదలు పెట్టి సమారాధనలు జరుపుతూన్నాడు. తిరుమంగై వ్రతనిష్ఠకి సంతోషించి, అతనిని తరింపచేయ నిశ్చయించిన శ్రీరంగనాథస్వామి, శ్రీలక్ష్మీదేవితో ఒక పెండ్లి జంటగా, తన పరివారంతో తిరుమంగై వెళ్లేదారిలో కనపడ్డాడు.

**తిరుమంగై వారినడ్డుకుని నగలన్నింటిని ఒలుచు కున్నాడు. కాని పెండ్లికుమారుని కాలివేలుకున్న ఉంగరం మాత్రం ఎంత ప్రయత్నించినా కూడా తీసుకోలేకపోయాడు. దాంతో కోపమొచ్చి ఆ కాలి వేలిని నోటితో పట్టి ఆభరణాన్ని లాగాలని ప్రయత్నించాడు. స్వామి పాదస్పర్శతో అతనికి జ్ఞానోదయం అయింది.**

తిరుమంగై కళ్ళల్లో ఆనందాశ్రువులు నిండాయి. అప్పుడు తిరుమంగైకి స్వామి దివ్య మంగళస్వరూపము శ్రీమహాలక్ష్మీదేవితో కూడి కనిపించింది. స్వామిదర్శనంతో పులకితనేత్రుడై తన తప్పుల్ని క్షమించుమని ఆ స్వామిని వేడుకున్నాడు తిరుమంగై. భగవదనుగ్రహంతో ఉత్తేజుడై ఆ అనందపారవశ్యంతో శ్రీమన్నారాయుణుడిమీద 6 దివ్య ప్రబంధాలను రచించాడు. వీరి ప్రబంధాల్లో భక్తియోగం తొణికిసలాడుతూంటుంది.

ఇతను భగవంతుణ్ణి ఒక బంగారునిధితో పోల్చాడు. అయనే మనకు గతి అన్నాడు. అందుచేత స్వామిని మనసా, వాచా, కర్మణా భక్తితో అర్చించాలి అని తెలిపాడు. ఇది ఒక పారమార్థికసత్యం.

వీరు తనభక్తిని చాటిచెప్తూ, తను తినే అన్నం మరియు నీరు స్వామియే అన్నాడు. స్వామియొక్క కరుణ అపారం. ఆయన్ను స్తుతించటానికి మాటలు చాలట్లేదు అనన్నాడు. భగవత్తత్త్వాన్ని తెలుసుకోలేక కాలాన్ని వృథాచేసే వాళ్ళు పక్షులుగా, జంతువుల్లాగా పుడితే సరిపోతుందంటూ బాధపడ్డాడు. అటువంటివారి స్నేహం కూడా చేయకూడదని కూడా బోధించాడు.

మనసు చాపల్యం చెందకుండా, బుద్ధి, వాక్కు అన్ని అవయవాలు భగవంతుని పాదారవిందాలవద్దే ఉండే ట్లుగా తనని ఆశీర్వదించుమని ప్రార్థించాడు. ప్రతి ఒక్కరు ఆ శ్రీరంగనాథుడిని శరణాగతి కోరాలని, అయనే మనకు శరణ్యమని చెప్పాడు.

శ్రీరంగధాముణ్ణి చూసి పరవశంతో కళ్ళు మూసు కుని అయన రూపాన్ని నా హృదయంలో నిలుపుకున్నాను. ఇప్పుడు కళ్ళు తెరిస్తే, స్వామి వెళ్ళిపోతాడేమోనని భయంగా ఉందన్నాడు. **ఇది తిరుమంగై ఆర్ద్రతకు ఒక పరాకాష్ఠ.**

**ఇక్కడ శ్రీరామావతారాన్ని, స్వామి హనుమయొక్క రామభక్తిని తలుచుకుంటూ, మనం కూడ స్వామిని ఆరా ధించి దివ్యజ్ఞానాన్ని పొందాలన్నాడు. అటువంటి దివ్యజ్ఞాన మనే నీటితో స్వామికి తిరుమంజనం చేసి, తన స్తోత్రాలనే పలుకులతో పూలమాలని వేస్తాను అన్నాడు. ఎంతటి అను భూతిని పొందాడో తిరుమంగై!! అందుకే ఆయన తిరు మంగైఆళ్వారు అయ్యాడు.**

సర్వేశ్వరతత్త్వాన్ని కూడా బోధించాడు. అంతేగాక భక్తియోగం, అష్టాంగయోగాలయొక్క మహిమ అపారమైన దని చెప్పాడు. ఈ విధంగా కేవలం తన పెళ్లికై విధించబడిన రెండుషరతులే అతణ్ణి పరమభాగవతోత్తముడుగా చేశా యనడం నిస్సందేహమని చెప్పొచ్చు.



కృష్ణాపుష్కర పుణ్యదినాలలో
తిరుమల తిరుపతి దేవస్థానము వారు
విజయవాడ పట్టణం నందు
శ్రీ వేంకటేశ్వర స్వామి వారి నమూనా
ఆలయంను నిర్మించి, పలు ప్రదేశాలలో
ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు
నిర్వహించారు. వాటి విశేషాల
చిత్రమాలిక సప్తగిరి పాఠకుల కోసం.....

శ్రీ వేంకటేశ్వరస్వామి వారి
నమూనా ఆలయం



విజయవాడలో విజయం చేసిన
శ్రీవారు



స్వామివారి సేవలో ఆంధ్రప్రదేశ్ గవర్నరు
శ్రీ ఇ.యస్.ఎల్. నరసింహన్





కృష్ణవేణి నదికి సారెను సమర్పించి, స్వామివారిని దర్శించుకుంటున్న
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గౌ॥ శ్రీ నారా చంద్రబాబు నాయుడు



గౌ॥ ముఖ్యమంత్రికి స్వామివారి ప్రసాదాలు అందజేస్తున్న తి.తి.దే. అధ్యక్షులు



నదికి హారతులు ఇస్తున్న అర్చకులు



తి.తి.దే. ప్రచురణలను ఆవిష్కరిస్తున్న
ఆంధ్రప్రదేశ్ దేవాదాయశాఖా మంత్రి శ్రీ పి. మాణిక్యాల రావు



శ్రీ కృష్ణాలంకారంలో స్వామివారు



పవిత్ర జలాలతో ఆలయంలో సంప్రోక్షణ



ఆలయంలో హోమనిర్వహణ



స్వామివారి సేవలో శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతి



స్వామివారి ఊరేగింపు



అందరికీ శ్రీహరే అంతరాత్మ



చిన్నారుల ఆకలితీర్చే పరమాత్ముడు





భక్తులకు అన్నప్రసాదవితరణ



సాంస్కృతిక కార్యక్రమం



ఊంజల సేవలో పాల్గొన్న భక్తులు



స్వామివారు



స్వామికి స్వాగతం పలుకుతూ కోలాట సేవ



పరమం,పవిత్రం,పావనం,పుణ్యం - పుష్కర స్నానం ఆచరిస్తున్న భక్తజనం

# పల్లాణ్డు పల్లాణ్డు...!


- శ్రీ ఈ.ఏ. శింగరాచార్యులు, 98850 03420.

**భగవత్కృపవల్ల దివ్యజ్ఞాన సంపన్నులైన ఆళ్వార్లు అందరు తాము పరదైవంగా భావించికొలిచిన శ్రీమన్నారాయణుని వైభవాన్ని తామనుభవించి ఆనందించడమేకాక తీయని ద్రావిడపాశురాల్లో ఆ అనుభవాన్ని వ్యక్తం చేసి అందరికి పంచిన ఉదారహృదయులు. ఆళ్వార్ల సాహిత్యం భక్తిసాహిత్యంగా, ప్రత్యేకించి, మధురభక్తి సాహిత్యంగా ప్రసిద్ధి చెందింది. వీరి పాశురాల సంఖ్య ఇంచుమించుగా నాల్గువేల పరిమితిలో ఉన్నందున నాలాయిరమని, దివ్యమైన అనుభూతిని వ్యక్తం చేస్తున్నందున దివ్యప్రబంధమని, వేదార్థ తత్త్వాలను వ్యక్తీకరిస్తున్నందున ద్రావిడవేదమని వీరి సాహిత్యం ప్రసిద్ధి చెందింది.**

**‘పీతకనాడై పిరానార్ పిరమకురువాకివన్దు’ (పీతాంబరధారియైన స్వామి పరమగురువై వచ్చి) అని తమ ప్రబంధంలో పల్కిన సూక్తినిబట్టి వీరు గురుముఖిగా శాస్త్రాధ్యయనం చేయలేదని, భగవంతుని కృపవల్లనే సకల శాస్త్రపారంగతత్త్వాన్ని పొందారని తెలుస్తున్నది.**

“మంగళానాం చ మంగళమ్” అని సమస్త శుభాలకు మూలకారణమైన భగవంతునివల్ల మనకు మంగళం కల్గుతుంది. రక్షకల్గుతుంది. ఆ భగవంతునికే మంగళం పాడ్డంలో ఏమి సామంజస్యమున్నది? అనే ఇంకొక ప్రశ్న కూడా ఇక్కడ కల్గుతుంది. భగవద్భక్తునకు 1)జ్ఞానదశ, 2)ప్రేమదశ అని రెండు దశలుంటాయి. జ్ఞానదశ అంటే – భగవంతుడే సర్వరక్షకుడనే జ్ఞానాన్ని కల్గియుండి, ఆ స్వామిని రక్షించుమని ప్రార్థించేదశ. ఇక, ప్రేమదశ అంటే – ఆ భగవంతుని దివ్యరూపసౌందర్యాన్ని, దివ్యలీలల్ని దర్శించి, ఆ స్వామికి ఏమి కీడు కల్గుతుందో!- అనే భయ శంకతో,మంగళం కలగాలని ఆశించి మంగళాశాసనం చేసే దశ.

వాస్తవానికి భగవంతుడే సర్వరక్షకుడైనా, ఆ స్వామికి కూడా మంగళాన్ని ఆశాసించడం భక్తుని అత్యుత్కటమైన ప్రేమా సూచకం. కనుక, ఇది మంగళాశాసనం చేసే భక్తునకు ఉత్కర్షను కల్గిస్తుందే తప్ప దోషాన్ని కల్గించదు.




పెరియాళ్వారు

ప్రణవాక్షరరూపంలోని పదాలు అ-ఉ-మ-లను కలిపితే జీవుడు- జగత్కారణుడు, సర్వరక్షకుడైన నారాయణునకే చెందినవాడనే అర్థం. అందువల్ల జీవులందరికి స్వామి అయిన ఆ నారాయణునకు, సొత్తు అయిన జీవుడు సేవచేయడం, ఆ సేవ కూడా స్వామి అయిన నారాయణునకు మెప్పు కల్గించేదిగా ఉండడం తగినది కదా! ఈ విధంగా, సర్వస్వామి అయిన నారాయణునకు అతిశయాన్ని, ఆనందాన్ని కల్గించే మంగళాశాసనం రూపంలోని కైంకర్యం చేయడం జీవునికర్తవ్యమనేది వ్యక్తమవుతున్నది. ఇదే తిరుప్పల్లాండు ప్రబంధంలో వ్యక్తం చేయబడింది.

తిరుప్పల్లాణ్డు ప్రబంధాన్ని నాలాయిర దివ్యప్రబంధాలక్రమంలో మొదటి ప్రబంధంగా కూర్చడంలోని ఈ సామంజస్యాన్ని గూర్చి వరవరమునులు ఉపదేశరత్తినమాలై ప్రబంధంలోని 19వపాశురంలో – “ఏ దోషంలేని, శాస్త్రాలవంటి ఆళ్వార్ల ప్రబంధాలలో తిరుప్పల్లాండు ప్రబంధం, వేదాలకు ప్రణవం సంగ్రహమైనందున అది ఆ వేదాల ఆరంభంలో కూర్చబడినట్లే, ఆ ప్రణవార్థాన్ని విశదీకరించేది కనుక మొదటగా కూర్చబడింది” అని స్పష్టం చేశారు.

అందువల్ల తిరుప్పల్లాండు మొదటి ప్రబంధంగా పరిగణింపబడడంలో గల ఈ విధమైన తాత్త్వికనేపథ్యాన్ని కూడా గమనించడం తగింది.



పెరియాళ్వార్లు ఈ ప్రబంధాన్ని పాడిన సందర్భ ప్రస్తావన కూడా ప్రస్తుతం ఆవశ్యకం. పెరియాళ్వార్లు వల్లభదేవుడనే పాండ్యరాజు సభలో వాదించి, శ్రీమన్నారాయణుని పరత్వాన్ని సుస్థాపించి, వాద శుల్కాన్ని బహుమానంగా పొందారు. ప్రభువు చాలా సంతోషించి, రాజవీథిలో  పట్టపుటేనుగును అధిరోహింపజేసి,  మహోత్సవాన్ని జరిపించాడు. తన భక్తుడైన పెరియాళ్వార్లకు జరిగే ఉత్సవాన్ని తిల కించాలనే ఉత్సుకతతో పరమాత్మ సలక్ష్మీశుడై, దివ్యాయుధోపేతుడై గరుడవాహనంపై ఆకాశంలో ప్రత్యక్షమయ్యాడు. అపుడు ఆ స్వామిని దర్శించిన పెరియాళ్వార్లకు, స్వామి రక్షణ విషయంలో అస్థానే భయ శంక ఏర్పడింది. ఈ లోకంలో భగవంతునకు ఏమి ఆపద కల్గు తుందో? అనే భయంతో ఆళ్వార్లు **"పల్లాణ్డు పల్లాణ్డు పల్లాయిర త్తాణ్డు"** అని మంగళాన్ని ఆలాపించారు. ఇదే ఈ ప్రబంధంలోని ప్రధాన ప్రతిపాద్యవిషయం.

"పల్లాణ్డు" అంటే పలు ఏండ్లు – అని అర్థం. చిర కాలమని తాత్పర్యార్థం. 'మంగళం కలగాలి' అనే అర్థం ఈ పదంద్వారా ఆక్షిప్తమైనందున "చిరకాలం మంగళం కలగాలి" అనే తాత్పర్యార్థం ఈ పదం ద్వారా తెలియబడు తుంది. మంగళం కలగాలని కోరడమే ఈ ప్రబంధంలోని ప్రధానవిషయం. కనుక, ఈ అర్థాన్ని సూచించే "పల్లాణ్డు" అనే పదంతోనే ఈ ప్రబంధం వ్యవహరింపబడుతున్నది. ఈ పదానికి ముందున్న "తిరు" అనే పదం సంస్కృతంలోని "శ్రీ" శబ్దంవలె మంగళవాచకం.


పల్లాణ్డుప్రబంధంలోని "మల్లాణ్డ తిణ్డోళ్‌మణి వణ్ణా!" అనే సంబోధన తిరుమల వేంకటేశ్వరుని ఉద్దేశించి చేయబడింది. ఆనాడు భట్టనాథులకు ఆకాశంలో గరుడా రూఢుడై వచ్చి ప్రత్యక్షమైన స్వామి వేంకటేశ్వరుడేనని అనడంలో ఏ అనౌచిత్యం లేదు. **"మత్పాదౌ శరణం వ్రజ"** **"నాపాదాలను శరణుపొందు"** అని శ్రీకృష్ణుడు చేసిన ఉప దేశానికి అనుగుణంగానే కదా తిరుమలలో స్వామి వేంచేసి ఉన్నాడు. శ్రీవేంకటాచలమాహాత్మ్యంలో కన్పించే పలుగాథల్లో తిరుమలపై శ్రీనివాసుడు గరుడుని అధిరోహించి తన భక్తులకు దర్శనమిచ్చిన వృత్తాంతాలు గోచరమౌతాయి.

**పల్లాణ్డు ప్రబంధ సంగ్రహస్వరూపం :** **భగవంతునకు మంగళాన్ని ఆలాపించిన పెరియాళ్వార్లు, క్రమంగా అనన్య ప్రయోజనులను (భగవంతుని కైంకర్యం తప్ప వేరొక ప్రయోజనం లేదని తలచేవారిని), కైవల్యాన్ని కోరేవారిని, ఇహలోక పరలోక విషయాల్ని కోరే ఐశ్వర్యార్థులను తమతో కలువవలసిందిగా ఆహ్వానించారు. అలా వారందరూ తమతో కలసిన విషయాన్ని తెలిపారు. వారితో కలసి భగవ న్మంగళాశాసనాన్ని చేసిన వైనాన్ని గూర్చి పలికారు. చివరికి ఆ పరమపదంలో కూడా భగవానునకు మంగళాశాసనం చేయడమే కైంకర్యంగా సిద్ధిస్తుందని ఫలశ్రుతిని పల్కి ప్రబం ధాన్ని ముగించారు.**

శ్రీవైష్ణవసంప్రదాయంలో ఆళ్వార్ల దివ్యప్రబంధాల గానం ఈ తిరుప్పల్లాండుప్రబంధం అనుసంధానంతో ఆరంభమై, చివరగా ఈ ప్రబంధానుసంధానంతోనే పూర్తౌ తుంది. వేదాధ్యయనం ఆరంభంలోను, అంతంలోను **"యో వేదాదౌ స్వరః ప్రోక్తో వేదాంతే చ ప్రతిష్ఠితః"** అనే విధి క్రమంలో ప్రణవమనబడే ఓంకారం అనుసంధింపబడు తుంది. ఆ విధంగానే, ద్రావిడవేదంగా సంభావింపబడే ఆళ్వార్ల దివ్యప్రబంధాల అధ్యయనం ప్రణవార్థప్రకాశకమైన పల్లాండుతో ఆరంభించి, దానితోనే పూర్తి చేయడమనేది శిష్టా చారంగా ఏర్పడింది. పల్లాణ్డు ప్రబంధం ప్రణవార్థ ప్రకాశ మనేదానికి ఇది ఒకశిష్టాచారసిద్ధమైన తిరుగులేని సాక్షి. ఈ ప్రబంధానికి గల మంగళాశాసనపరత్వాన్నిబట్టి లోకంలో అందరి వ్యవహారంలో కూడా పల్లాణ్డు పాడడమనేది మంగళం పాడడానికి పర్యాయంగా ఏర్పడిందికూడా.

**ప్రబంధోభట్టనాథస్య మంగళాశాసనాత్మకః ।**
**నిస్సమాభ్యధికో భాతి ప్రణవార్థ ప్రకాశకః ॥**

"ఆళ్వారు" అనగా భగవద్భక్తిలోతును ఎరిగినవారని అర్థం. ఆళ్వారులు భక్తిపరవశంలో మునిగి భగవంతుని దివ్యమంగళవిగ్రహాన్ని వారినేత్రాలతో తిలకిస్తూ, తన్మయభావంతో తమిళపాశురాలతో, దివ్యసంకీర్తనలు గానం చేస్తూ ఆనందించినవారు. ఆళ్వారులు పండ్రెండుమంది. వీరికే పన్నిద్దరాళ్వారులని, ద్వాదశసూరులని పేరు. వీరిలో అన్ని కులాలకు సంబంధించినవారున్నారు. ఆ పన్నిద్దరాళ్వారులలో ఒకరు స్త్రీ. ఆమెయే ఆండాళ్ (గోదాదేవి).



# శ్రీరంగనాథుడే నా ప్రాణనాథుడు - ఆండాళ్

- డా॥ చెలికాని మురళీకృష్ణారావు,
94400 09535

శ్రీవిల్లిపుత్తూరు (శ్రీధన్విపురం)లో పెరియాళ్వారు (విష్ణుచిత్తులు) అనే మహావిష్ణుభక్తునికి తులసిమొక్కలపొదల్లో ఈమె వారికి లభించడం చాల విశిష్టమైనది. వారు ఆ బాలికను అపురూపంగా పెంచుకుంటూ ఆమెకు "కోద్దై" (గోద= కుసుమమాలిక) అని పేరుపెట్టారు. విష్ణుచిత్తులవారు ప్రతిరోజూ పరమభోగ్యమైన పుష్పమాలలను శ్రీవిల్లిపుత్తూరునందు వేంచేసియున్న వటపత్రశాయికి సమర్పించేవారు. బాల్యమునుండి కూడా ఆమెతత్త్వము వేరుగా ఉండేది. ఎప్పుడూ ఏకాంతంలోనే ఉండేది. ఒక్కొక్కపుడు తనలోతానే మాట్లాడుకుంటూండేది. ఎల్లప్పుడూ తులసిమాలలు కట్టడానికి తన తండ్రికి సహకరిస్తూండేది.

ఆ క్రమంలో ఒకనాడు విష్ణుచిత్తులవారు తులసిమాలను కట్టడం పూర్తిచేసి, పర్ణశాలలోని ఒక స్తంభానికి తగిలించి వెళ్లారు. ఆ సమయంలో స్వామివారికై కట్టబడిన తులసిమాలను గోదాదేవి తన తలలోనూ, కంఠంలోనూ ధరించి అద్దంలో తన సౌందర్యాన్ని చూసుకొని మురిసిపోయింది. ఇలా ప్రతిరోజూ జరుగుతూండేది.

ఒకనాడు విష్ణుచిత్తులవారు తాను కట్టిన తులసిమాలను శ్రీరంగనాథుని కైంకర్యంకోసం తీసుకెళ్తూండగా, అందులో తలవెంట్రుకను చూడటం జరిగింది. అదిగాంచి ఆండాళ్లుని అనుమానించి, ఆమెను అడగ్గా ఆమె తన తప్పును ఒప్పుకుంది. "అమ్మాయీ! గోదా! ఎంతటి అపరాధం చేసేవమ్మా? స్వామికి సమర్పించే తులసిమాలను నీవు ముందుగా ధరించటం తప్పుకదా! అంటూ, ఎంతటి అపరాధం జరిగింది కదా అంటూ విష్ణుచిత్తులవారు ఆ మాలను స్వామికర్పించడానికి మనసురాక దిగులుపడుతూ నిద్రపోయారు. ఆ రాత్రి ఆయనకు కలలో రంగనాథుడు కనిపించి - "నీవు తెచ్చే మాలికలు, ప్రతిరోజు నీ కుమార్తె ధరించినవే! నేను అత్యంతప్రీతితోనే వాటిని స్వీకరిస్తున్నాను". ఆమె ధరించిన పుష్పమాలికలనే నీవు తీసుకురావాలంటూ స్వామి విష్ణుచిత్తుల వారిని ఆదేశించాడు. ఆనాటినుండి ఆండాళ్‌కు "శూడిక్కొడుత్తనాచ్చియారు" (ఆముక్తమాల్యద) అనే పేరు కలిగింది.

తమిళనామము "కోద్దై" అను పదానికి సంస్కృతమున 'గోద్దై' అని స్థిరపడింది. 'గో'- అనగా 'భూదేవి' అని అర్థం. ఆమె భూమియందు లభించింది కావున, 'గోదా' అనే పేరు సార్థకమైంది. గోదాదేవి, భూదేవి అంశ అని, తనకు భగవదనుగ్రహంతో

**భట్టనాథుల పెంపుడుకూతురు గోదాదేవికే 'శూడిక్కొడుత్త నాచ్చియార్' అని పేరు. ఈమెయే ఆముక్తమాల్యద. శ్రీకృష్ణుని కలయికకోరి, వ్రేపల్లెలో గోపికలు కాత్యాయనీవ్రతం చేసినట్లుగా ఈమె శ్రీరంగనాథుని పతిగా వరించి మార్గశీర్షమాసంలో నోమునోచింది. దినానికొక్క పాశురం వంతున ముప్పైదినాలు అనుసంధింపదగిన 30 పాశురాలరచనే తిరుప్పావు. ఆండాళ్ శ్రీరంగనాథునితో తనకు వివాహమైనట్లు కన్న కలయే వారణమాయిరమ్. ఈ రెండూ గోదాదేవి రచనలే. వీటికి భక్తలోకంలో ఎనలేని ప్రచారముంది. ప్రతి వైష్ణవాలయంలో ధనుర్మాససందర్భంగా తిరుప్పావై ప్రబంధపఠనం జరుగుతుంది.**

లభించింది అనుకుంటూ ఆయన ఆమెను మిక్కిలి వాత్స ల్యంతో చూసుకుంటూ ఆనందపడసాగాడు. శ్రీరంగనాథుని రూపురేఖావిలాసాలను ఆండాళ్ తన తండ్రిద్వారా వింటూ ఆ స్వామినే తన ప్రాణనాథునిగా పొందాలని మనస్సులో దృఢంగా నిర్ణయించుకుని **"యథావ్రజ గోపికానాం"** అన్నట్లుగా ద్వాపరయుగంలో గోపికాస్త్రీలందరూ శ్రీకృష్ణుని యందు అనన్యభక్తితో నిరంతర తన్మయులైయుండి, శ్రీకృష్ణునే తమ ప్రాణనాథునిగా నిర్ణయించుకొని ఏ "కాత్యాయనీ వ్రతం" చేసి తరించారో, అదే వ్రతాన్ని ఈ యుగంలో ఆండాళ్ శ్రీకృష్ణభగవానుని పతిగా పొందగోరి తను నివ సించే శ్రీవిల్లిపుత్తూరునే గోకులంగా, తన తోటి చెలికత్తెలను గోపికలుగా, తాముండే నివాసాన్నే నందగోపగృహంగా భావించుకుంది. మార్గశీర్షమాసం ముప్పదిదినాలు రోజుకు ఒక పాశురము (పాటను) చొప్పున స్వామికి నివేదించి, వ్రతసమాప్తి చేసి చివరిరోజున అనగా 'భోగి'నాడు ఆండాళ్ శ్రీరంగనాథుని పరిణయమాడింది.

**తిరుప్పావై 26వపాశురంలో.....**

ఆశ్రితవ్యామోహము కలవాడా! ఇంద్రనీలమణిని పోలిన కాంతియు, స్వభావము కలిగియున్న స్వామీ! శ్రీకృష్ణ పరమాత్మను ఆశ్రయించి వచ్చినవారి వ్యామోహముకంటే ఎన్నోరెట్లు ఆయనకు మనమీద ఉంటుందట. మార్గశీర్ష స్నానము చేయటానికి వచ్చామయ్యా. మేమంతా కలసి యమునానదీస్నానం చేయటానికి వెళ్తున్నాం కదా! అది అందరికీ తెలిసేట్లు మంగళార్థంగాను, మేము నీవద్దకు కైంకర్యమనే (పఱై) పురుషార్థంకొరకు ఈ నోము చేస్తున్నా మయ్యా శ్రీకృష్ణా!" అంటున్నారు గోపికలు. మేము బయలు దేరేముందు 'శంఖధ్వని' ఉండాలి. కాబట్టి ఈ భూమండలం వణికేట్లు శబ్దంచేసే, పాలవలె తెల్లనైన నీ పాంచజన్య శంఖాన్నిపోలిన శంఖాలు కావాలి. విశాలమైన చాలా పెద్ద 'పఱై'(మద్దెల) కావాలయ్యా. మా గోష్ఠికి మంగళాశాసనం



చేసేవారు కావాలి కాబట్టి, మంగళం పాడే వారిని ఇప్పించవయ్యా. చీకట్లో యమునానదికి వెళ్తాము కాబట్టి మంచిదీపం కావాలయ్యా. గోష్ఠికి వెళ్తున్నామని అందరికీ తెలియటానికి ధ్వజం కావాలి. మాపై మంచుపడ కుండా "వితానము" (చాందిని) కావాలి అంటూ గోపికలు శ్రీకృష్ణుని ప్రార్థించారు.

**శ్రీకృష్ణుడు వీరి కోరికలు విని "మీరు చాలా గొప్పవి అడుగుతున్నారే!" అనగా "చిన్నిబొజ్జలో పద్నాలుగు లోకాల్ని పెట్టుకొని మఱ్ఱిఆకుపై పవ్వళించిన నీవు అఘటిత ఘటనాసామర్థ్యము కలవాడవూ ఐన నీకు అసాధ్యమున్నదా స్వామీ! మాపై కృప చూపి ఈ వస్తువులన్నీ ప్రసాదించు" అని గోపికలు ప్రార్థించారు. ఇచట స్నానమనగా భగవదను భవంలో మునగటం. (మనలోని అహంకారమమ కారాలు తొలగించటం). శంఖమనగా 'ఓం' అనే ప్రణవం. "ఓం నమో నారాయణాయ" అనే అష్టాక్షరీమహామంత్రంలో చెప్ప బడిన అర్థజ్ఞానం. అనుష్ఠానం కలిగిన స్థితి.**

చాలపెద్ద 'పఱై' అనగా 'నమః' పదము. ఇక "పల్లాండు" మంగళము పాడేవారు అనగా పరమ భాగ వతోత్తముల సహవాసము. (సాత్త్విక సహవాసము) ఇదియే పురుషార్థమును చేర్చునట్లు చేయునది. అందమైన "మంగళ దీపము" అనగా జీవుని "భగవచ్ఛేషత్త్వము". (దీపమనగా మనకు స్వామితో కలుపవలసినటువంటి లక్ష్మీదేవి) ఈ లక్ష్మీదేవి మాతో ఉండాలి. ఆమె దయాస్వరూపిణి. ఆమె తోనే స్వామి మనకు లభిస్తాడు.

**"ధ్వజము" అనగా సూచకము. ఫలానావ్రతం చేసే వారు వస్తున్నారని అందరికీ ముందే తెలియాలి. గరుడుడు స్వామి ధ్వజము. అనగా వేదమే మాకు మార్గదర్శకమై ఉండాలి. దాన్నే ఇవ్వమని దేవుణ్ణి ప్రార్థించారు. 'వితానము' (చాందినీ) అనగా భోక్తృత్వబుద్ధి నివృత్తి కావాలి. ఇదియే వితానము. ఎన్ని ఉన్నా అహం ఉండకూడదు. అహంకార నివృత్తి కలుగజేయి కృష్ణా! అని గోపికలు ప్రార్థిస్తున్నారు.**

ఈ విధంగా తిరుప్పావై ప్రబంధంనిండా తన మధురభక్తిని ఆ రంగనాథునిపై కురిపించింది. శ్రీరంగ నాథుడే నా ప్రాణనాథుడంటూ కల్యాణవ్రతం గావించింది. రంగనాథున్నే వివాహమాడి ఆ స్వామిలోనే ఐక్యమైపోయిన ఆండాళ్ ఎంతో పరమపవిత్రమైన భాగ్యశాలిగా కీర్తింప బడ్డారు.

సౌభాగ్యం ధారావాహిక 4

# పుట్టగానే... పరిమళించిన భక్తికుసుమం

# శ్రీ జనాబాయి

-డా॥ పోరంకి దక్షిణామూర్తి

**నామదేవుడి ఇంటికి వచ్చిన పాండురంగడికి భక్తులు చేసే ఉపచారాలు ఈ సంచికలో చదువవచ్చు.**

జనాబాయికీ మెలకువ వచ్చి చటుక్కున లేచి శ్రీహరికి ఎదురు వెళ్ళి ఆయన పాదాలకు నమస్కరించింది. ఎత్తుకోళ్ళ పీట తెచ్చి దానిమీద ఆయన్ని కూర్చోపెట్టింది. సంబరంతో గుణాబాయిని లేపింది; రాధా బాయిని లేపింది. ఇద్దరూ వచ్చి పాండురంగడికి 56పాదనమస్కారాలు చేశారు.

అప్పుడే మెలకువరాగా, కళ్ళు నులుముకుంటూ చూస్తున్న నామ దేవుడి కొడుకులకు ఈ సందడి ఏమిటో అర్థం కాలేదు. ఎత్తుపీటమీద కూర్చున్నాయన ఎవరో తెలియడం లేదు. మామూలుగా అందరూ కట్టు కొనే పంచె, పైన ఉత్తరీయం మాత్రం ఉన్నాయి. కిరీటం, కవచకుండ లాలు, భుజకీర్తులు, పట్టుపీతాంబరం, కంకణాలు, కడియాలు లేనివాడు శ్రీహరి ఎలా అవుతాడన్న శంక ఆ పిల్లల మనస్సులో మెదిలింది. వాళ్ళ వైపు చూసి చిరునవ్వు నవ్వాడాయన. పీటమీదనుంచి లేచి గుమ్మంవైపు కదిలాడు. నామదేవుడివైపు చూసి, "నేనిక వెళ్ళాలి!" అన్నాడాయన.

"అయ్యో తండ్రీ! అప్పుడే వెళ్తున్నావా! రాక రాక వచ్చావు. నీ పాదపూజ చేసుకోలేదు. పళ్ళూ పాయసమయినా తినిపించలేదు. కొండంత దేవుడికి పిసరంత సేవ చేసుకొనే భాగ్యం కూడా లేదా తండ్రీ!" అంటూ వాపోయాడు నామదేవుడు. గుణాబాయి కూడా ఏదో చెప్ప బోతోంది. జనాబాయి కళ్ళు అప్పగించి చూస్తోంది. ఆమె కళ్ళముందు సర్వాలంకారభూషితుడయిన పీతాంబరధరుడే నిలిచినట్టు ఉంది.

"మళ్ళీ వస్తానమ్మా! రేపు రాత్రి వస్తాను!" అంటూ గుమ్మంలోకి వెళ్ళి అదృశ్యమయాడు.

తెల్లవారింది. ఇంటి పైకప్పు యథాస్థానంలోనే ఉంది. కూలి పోయిన గోడ పూర్తిగా లేచినట్టుగానే కనిపిస్తోంది.

ఆ రోజంతా ఇంట్లో అందరికీ సందడి. ఇల్లు అలికి ముగ్గులు పెట్టి వన్నెవన్నెల పూలమాలలతో అలంకరించి పండుగ కళతో కలకల్లాడేలా తీర్చిదిద్దారు.

పొద్దు వాలింది. దీపాల వేళ అయింది. 'ఎప్పుడెప్పుడు వస్తాడా, ఆ పండరినాథుడు' అన్న ఆత్రం ఎక్కువయింది అందరికీ. పిల్లలు వీథి వైపు ఎదురుతెన్నులు చూస్తున్నారు. నామదేవుడు నామజపం చేసుకుంటూ ముంగిట్లో పచార్లు చేస్తున్నారు. అత్తాకోడళ్ళిద్దరూ వంటపనిలో మునిగారు.

జనాబాయి ఒక్కతే గదిలో ఒక మూల కూర్చుంది. దీపం పెట్టింది. పాండురంగడి బొమ్మకు పూలదండ వేసి నామసంకీర్తనం మొదలు పెట్టింది. మంద్ర, మధ్యమ, తారస్థాయుల్లో - నోటికి వచ్చిన రకరకాల పాటలు పాడుతూ ఉంది. తీగలుసాగిన మాదిరిగా రాగాలు తీస్తూ ఉంది.

చీకట్లు ముసురుకున్నాయి ఎంతసేపటికీ శ్రీహరి రాలేదు! ఒక్క రొక్కరే మొహాలు వాల్చుకొని లోపలికి వచ్చారు. ఎదురుగా జనాబాయి చేస్తున్న సంకీర్తనం వాళ్ళను ఆకట్టుకొంది. ఆమె దగ్గరికి వచ్చి కూర్చు న్నారు. తామూ గొంతు కలిపి ఆమెతో పాటలు పాడసాగారు. వాళ్ళ హృదయాలన్నీ ఆనందడోలికల్లో తేలియాడుతున్న సమయంలో ఎదురుగా ఒక మెరుపు మెరిసినట్లయింది. అందరూ చకితులయి కళ్ళు విప్పార్చి చూశారు. చిరునవ్వు చిందించే పుండరీకవరదుడు నిలిచి ఉన్నాడు!

దేవదేవుడి అభ్యంగన స్నానానికి గుణాబాయి వేణ్ణీళ్ళు కాచి పెట్టింది. రాధాబాయి వాటిని సమపాళంగా తొరిపిపెట్టింది. నామదేవుడు శ్రీహరిని స్నానానికి తీసుకువెళ్ళి ఉత్తరీయంతో ఒళ్ళంతా తుడిచి జుట్టు ఆరడానికి ముంతపొగవేసి తెల్లని వస్త్రం ఆయనకు కట్టబెట్టి, పైన ఉత్తరీ యం కప్పి పీఠంమీద అధివసింపజేశాడు. సమస్తోపచారాలతో ఆయనకు అందరూ కలిసి పూజ చేశారు. ఆయన పాదాలకు మొక్కారు.

అటు తరవాత విందుభోజనాలకు ఏర్పాట్లు జరిగాయి. విస్తళ్ళు పరిచారు. నామదేవుడి కొడుకులు నలుగురూ కూర్చున్న పంక్తిలోనే కూర్చున్నాడు పండరినాథుడు. గుణాబాయి, నామదేవుడు ఒక వరసలో కూర్చున్నారు. రాధాబాయినికూడా భోజనానికి కూర్చోమన్నాడు పండరి నాథుడు. పెనిమిటి చూపులోని అనుమతి గ్రహించి రాధాబాయి కూడా ఒక పక్కన కూర్చుంది. భోజనానికి అందరూ సిద్ధమయేవారే! మరి వడ్డించేదెవరు?

జనాబాయి వడ్డన మొదలుపెట్టింది. వంటకాలు వడ్డిస్తున్న సమ యంలో ఆమె మనస్సులో, అనుకోని ఆలోచన ఒకటి సన్నగా మెదిలింది. 'తన నొక్కతెను విడిచి తక్కినవారందరూ శ్రీహరితో కలిసి భోజనం చేయడం రసభంగం!' అనిపించింది.

అభిఘారం, పరిషేచనం అయిన తరవాత భోజనాలకు ఉపక్రమిం చారు. శ్రీహరి కొద్దిగా తిన్నాడు. తరవాత ఊరకే కూర్చున్నాడు. నామ దేవుడు చూశాడు. "స్వామీ! జనాబాయి ఈ బంతిలో లేనందువల్ల అన్నం రుచించడం లేదు కదూ?" అన్నాడు. శ్రీహరి పలకలేదు. చిరునవ్వే సమాధానం.

అందరి భోజనాలూ అయాయి. నామదేవుడూ అతిథిదేవుడూ ఒక గదిలో పడుకున్నారు. జనాబాయి మరో గదిలో పడుకుంది. నామదేవుడికి నిద్రపట్టనిచ్చి శ్రీహరి మెల్లగా లేచి జనాబాయి గదిలోకి వెళ్ళాడు. "చిట్టితల్లీ! నాకు ఆకలిగా ఉంది. ఏమయినా పెట్టవూ?" అని అడిగాడు. "నీ దయకు తగిన పదార్థం నేను ఏం పెట్టగలను తండ్రీ? అందరి భోజనాలూ అయిపోయాయి కదా! నీ భుక్తశేషాన్ని గుణాబాయిగారు నాకిచ్చి దాచమన్నారు. అదొక్కటే ఉంది. అది పెట్టడానికి వెనకాడు తున్నాను.' అంది జనాబాయి.

*(ఇంకా ఉంది)*

# బ్రహ్మచారి ప్రతిజ్ఞ


– డా॥ కోటపాటి రాధారమణ, 88976 44036.

**శ్రీహరియొక్క వైజయంతియను వనమాల అంశలో జన్మించిన ఈ బాలునికి విప్రనారాయణుడు అని పేరు. తర్వాత వారికి 'భక్తాంఘ్రిరేణు' అనీ, ఆ పేరే తదనంతరకాలంలో 'తొండరడి ప్పొడిఆళ్వారు'గా ప్రసిద్ధ నామధేయమైంది.**

ఈ ఆళ్వారు బాల్యంనుండి యౌవన దశకు రాగానే స్వామికి గొప్పభక్తుడిగా ఉంటూ అత్యంత భక్తినిష్ఠలతో తోటపని చేసి, పుష్పాలతో మాలలుకట్టి శ్రీరంగ నాథునికి సమర్పిస్తూండేవాడు. ఇతడు అవివాహితుడు. స్త్రీ ముఖమే చూడనని ప్రతిజ్ఞ చేసినవాడు. విష్ణుమూర్తి ధరించే వాడిపోని సతతహరిత ప్రభవ తులసీ దళమాలయైన 'వైజయంతీ' అను వనమాల అంశలో జన్మించినవాడు. సర్వాంతర్యామియైన వైష్ణవశక్తికి మాలగా ఉండేది ప్రకృతిలోని సర్వవృక్ష సంపదయే. కాబట్టి ఈ వైజయంతి మాల అనేది ఎప్పటికీ వాడిపోనిదని అర్థం. అందువల్ల వీరు వైజయంతి మాల అంశలో జన్మించారని చెప్పబడింది. అందుకే స్వామి కైంకర్యంగా వీరు మాలాకారవృత్తి చేస్తున్నారని చెప్పుకోవచ్చు.

ఈ క్రమంలో వారి జీవితం సాఫీగా సాగుతూండగా, ఒక అనివార్యసంఘటన సంభవించటం జరిగింది. అందు దేవదేవి అనే అప్సరసయైన వేశ్యకన్య అతనిని మోహించడం, వారు కూడా అమెను వివాహం చేసుకోవాలని తన సమ్మతిని ఆమెకు తెలపడం జరిగాయి. అందులకుగాను ఆమె వారినుంచి ధనాన్ని ఆశించడం జరిగింది. ఆ కోవలో స్వామి తన మాయానాటకంలో విప్రనారాయణుని దోషిగా నిలబెట్టడం జరిగింది. ఆ సంఘటనకు దేవదేవి ఎంతో దుఃఖించి, అంతా తన తప్పేనంటూ, అతనిని క్షమాభిక్షను అర్థించగా, వారు ఆమెను తన శిష్యురాలిగా చేసుకోవడం జరిగింది. అలా ఇరువురూ నిరంతరమూ స్వామికైంకర్యంలోనే తమ జీవితాన్ని సార్థకం చేసుకోవటం జరిగింది.

ఈ క్రమంలోనే వక్రమార్గంనుండి తనను రక్షించింది పరశక్తేయని గ్రహించి, చివరికి తన ప్రతిజ్ఞను దైవమే నిలబెట్టిందని భావించి, అది మొదలు తొండరడిప్పొడి అను తిరునామమును స్వీకరించాడు. (తొండర్= భక్తునియొక్క, అడి=పాదముయొక్క, పొడి= రజము, దుమ్ము అని అర్థం.) ఇది తమిళసమాసము. దీనికి సమమైన సంస్కృతసమాసం 'భక్తాంఘ్రిరేణు' అని అర్థం. కాబట్టి విప్రనారాయణుడు తొండరడిప్పొడి ఆళ్వారనియు, భక్తాంఘ్రిరేణు ఆళ్వారనియు ప్రసిద్ధ నామములతో ప్రకాశించాడు.



తొండరడిప్పొడిఆళ్వారు

ఇతడు తమిళంలో 'తిరుమాలై', 'తిరుప్పళ్ళియెళుచ్చి' అనే భగవంతునికి పాడే సుప్రభాతశ్లోకాలు రచించాడు. 45 పాటలున్న తిరుమాలై ప్రబంధము భగవతస్తోత్రము. ఒక్కొక్కశ్లోకము ఒక్కొక్క మాలగా పరిగణింపబడింది. పదిపాశురాలతో తిరుప్పళ్ళియెళుచ్చి అనే గ్రంథం రచించాడు. ఈ గ్రంథాన్ని ఆధారం చేసుకొనే 'ప్రతివాది భయంకర అణ్ణన్' అనే ఆచార్యపురుషులు తిరుమల శ్రీవారి సుప్రభాతాన్ని రచించడం జరిగింది.

ఈ విధంగా తిరుమలస్వామికి నిత్యమూ గానం చేయబడే శ్రీవారి సుప్రభాతానికే మూలపురుషులుగా కీర్తింపబడ్డారు తొండరడిప్పొడిఆళ్వారు.

తమిళంలో ద్రావిడవేదముగా ప్రశస్తి పొందిన నాలాయిరదివ్యప్రబంధాన్ని సంతరించినవారు పండ్రెండుమంది ఆళ్వారులు. వీరిలో ప్రముఖస్థానాన్ని, ప్రాధాన్యాన్ని వహించిన మహానుభావులు శ్రీశఠకోపయతీంద్రులు నమ్మాళ్వారు. నాలాయిరదివ్య ప్రబంధంలో వీరి రచనలు నాలుగు.

మొదటిది తిరువిరుత్తం - 100 పాశురములు. రెండవది తిరువాశిరియం-7 పాశురములు. మూడవది పెరియతిరువందాది-87 పాశురములు. నాల్గవది తిరువాయ్‌మొళి-1102 పాశురములు. ఈ పాశురాలన్నీ కూడ భక్తిరసానికి నికేతనాలు; తత్త్వానికి సోపానాలు; వివేకచింతనకు మార్గదర్శకాలు; బుద్ధి గరిమకు పరమావధులు; పరమాత్మ సాక్షాత్కారానికి కాంతి రేఖలు. ఈ పాశురాలలో తిరువాయ్‌మొళి భక్తికి, తిరువిరుత్తం తత్త్వానికి, పెరియ తిరువందాది వివేకానికి, తిరువాశిరియం బుద్ధికి సమన్వయించినవని చెప్పుకోవచ్చు. ఈ నాల్గింటి సమాహార ఫలితమే పరబ్రహ్మం. తిరువాశిరియం యజుర్వేద తుల్యమని పండితాభిప్రాయం. తిరు+అశిరియం అని పదవిభాగం. తమిళ ఛందస్సు పేర్కొన్న నాలుగు వృత్తాలలో అశిరియం అనేది ఒకటి. ఈ విశేషవృత్తంలో వ్రాయబడింది కాబట్టి ఈ పాశురస్తుతి తిరువాశిరియం అని పేర్కొనబడింది. నమ్మాళ్వారు పరభక్తిస్థితిలో జ్ఞానచక్షువులకు గోచరించు పరమాత్మతో "నీ అనుభూతి దశను పొందడానికి ఆటంకంగ ఉండే దైహిక విషయాలను ఛేదించటానికి నీవనుగ్రహించాలి" అని ప్రార్థించగ భగవంతుడు గొప్ప యుక్తితో ఒక అనుగ్రహాన్ని ప్రసాదించాడు. ఆళ్వారు వలన లోక హితం కలగాలని ఆళ్వారును భూలోకంలో జనింప చేసి తన స్వరూపం, రూపం, గుణం, శేషిత్వం - వీటిని ఆళ్వారు దర్శించడానికి భగవంతుడు తానే భారం వహించాడట. (అంటే



# ఇతని ప్రసాదమే ఇన్నియును....

- శ్రీమతి ఎం.రాజ్యలక్ష్మి, *97034 70772*

స్వభావం, స్వరూపధారణ, సౌందర్యాపాదన. గుణం- సౌలభ్యం, వాత్సల్యం, పరతత్త్వం, విభవం, భూమిని కొలుచుట, ఉదరమున దాచుట, వెలికిద్రోయుట వంటివి.) నా రూపవిలాసలావణ్యముల ప్రదర్శింతును గాక. అళ్వారు నా లీలా విలాసముల దర్శించి తాదాత్మ్య స్థితిని పొంది భావావేశముతో నన్ను కీర్తించి పాడును గాక. లోకమునకు కావలసిన సద్విషయములు లభించునుగాక అని భగవంతుడు సంకల్పించుకొన్నాడట. తన్ను అన్ని దశావిశేషాలతో దర్శనీయుణ్ణి గావించుకొన్నాడు. ఆళ్వారునకు భగవత్సాక్షాత్కారము లభించినది. ఇది పర జ్ఞానమగును. దీని పరిణామ ఫలితమే తిరువాశిరియమైనది.

నమ్మాళ్వార్లతత్త్వాలలో రెండు ముఖ్యాంశాలు న్నాయి. ఒకటి ఆత్మజ్ఞానం; రెండోది భక్తిఅనుభవం. చింతనకు ఆహారం వేదాంతం; హృదయానికి ఆహారం భక్తి. మనలో ఒకరుగా ఉండి – మనకు వీటిల్ని ఉపదేశిస్తూ – నమ్మాళ్వార్లు ఉన్నట్లుండి మనల్ని వదలి– చాలా దూరం పోయి– ఎక్కడో ఒక మహోన్నతపర్వతాన్ని ఎక్కి, ఏదో ఉపదేశిస్తారు. "ఇదిగో చూడండి!" అని తాము ఎక్కిన ఆ పర్వతశిఖరాన్ని–ఈ కండ్లతోనైనా చూడలేకపోతున్నాం. చూస్తే కండ్లు తిరుగుతాయని భయపడుతున్నాం. అది గమ నించి, నమ్మాళ్వార్లే మన స్థాయికి దిగివచ్చి, పొరపొచ్చాలు లేకుండా మనహృదయాల్లో కలిసి తిరిగి ఉపదేశిస్తున్నారు– వినండి – "ఇదిగో నమ్మండి– భక్తివల్ల అందరికీ మోక్షం ఉంది" అని.

ఆ తత్త్వశిఖరంలో నుంచే – భగవద్విశ్వాసం, మతం అనేవి– పర్వతశిఖరంలో నుండి గంగానది పుట్టి నట్టు పుట్టుతున్నాయి. ఆ గంగానది ఈ భూమిపై ప్రవ హించి, తాను ప్రవహించినంతదూరం–కనుచూపుమేరకు అందినంత దూరం పండిస్తూంది. అదేవిధంగా ఈ తత్త్వ శిఖరంలో పుట్టిన భగవద్విశ్వాసం కోట్లకొద్దీజీవుల్ని పుణ్య వంతులుగా చేస్తోంది. గంగానది ఒక ఉత్తరభారతదేశానికే అయితే భగవద్విశ్వాసం ఈ ప్రపంచంలోని ప్రతిజీవాణువును కూడా పునీతం చేస్తూంది. ఈ ప్రాకృతప్రపంచంలో భక్తి – విశ్వాసం–మతం అనే మూడూ పురిగొని, ఏకమై ప్రపంచాని కంతటికీ జీవనదిగా ప్రవహిస్తూ ఉంది. ఈ విషయాలన్నీ అనుభవించి, పాశురాల ద్వారా తెలియజేసిన నమ్మాళ్వార్ల విశ్వాసాన్ని 'గొప్పవిశ్వాసం' అని చెప్పవచ్చు.

నమ్మాళ్వార్ల విశ్వాసానికి ఆధారమైన భగవదను భవాన్ని ఒక సముద్రమనే చెప్పాలి. ఈ భగవదనుభవాలనే ప్రబంధాలుగా వెలువరించి, దేశాన్ని తీర్చిదిద్దాలని ఆ భగ వంతుడు పూనుకొన్నాడనీ, ఈ ప్రబంధాలను తమిళ ప్రపంచంలో ఒకమహాసముద్రంగా భావించాలనీ శ్రీవైష్ణవుల అభిప్రాయం. నమ్మాళ్వార్లు శాస్త్రాలన్నీ తెలుసుకొన్నవారే– అయినా వీరిజ్ఞానం కేవలం శాస్త్రజ్ఞానం కాదు – నిజానికి వీరు చింతచెట్టు కింద యోగం చేసినవారే! అయితే వీరి ఈ సూక్ష్మాతిసూక్ష్మ జ్ఞానం యోగాభ్యాసంతో వచ్చింది కాదు – శాస్త్రజ్ఞానం కన్నా, యోగజ్ఞానం కన్నా ఈయన జ్ఞానం భగవంతుని ప్రసాదంగా దొరికిందని శ్రీవైష్ణవుల విశ్వాసం.

నమ్మాళ్వార్లకాలంలోనే వీరిపాశురాలు ద్రావిడదేశ మంతా వ్యాపించి, ప్రసిద్ధికెక్కాయని ఊహించవచ్చు. భక్తులు వీరినిగూర్చి పాడేతీరును నేడు గమనిస్తే మన ఊహ సరియైందే నని తెలుస్తుంది. భక్తులుమాత్రమే కాదు వీరిని పొగిడింది–వారు పొగడక పూర్వమే – నమ్మాళ్వార్లే –

**పాలేమ్ తమిళర్ యిశై కారర్ పత్తర్ సరవుమ్ ఆయిరత్తిన్**
**పాలే పట్టవివైపత్తుమ్ వల్లార్మ్హై పరివదే.**

"తమిళభాష తెలిసినవాళ్లచేత, భక్తులచేత కొని యాడబడుతూ పాలవలే ఆస్వాదింపదగిన వెయ్యిపాశురా లలో – ఈ పది పాశురాలను అభ్యసించినవాళ్లకు క్లేశం లేదు" అంటున్నారు.

నమ్మాళ్వార్లపాశురాలు మధురకవులు మొదలైన ఆ కాలంలోని భక్తులకు సంతోషాన్నినింపేవి. అంతేకాదు – ఆ తర్వాతిభక్తులైన నాథముని మొదలైన ఆచార్యాదులకు జ్ఞానప్రవాహంగా తయారయ్యాయి. అవును, నిజమే! వీరి

## వైకుంఠపాళి
## :: 10 – సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 1 తు | 2 రం | గ | 3 వ | ద | 4 ను | డు | |
| 5 పై | | గు | | డ | | డి | | 6 కీ |
| 7 లు | ప్తం | | 8 జా | మా | త | | 9 పా | లు |
| డు | | 10 కై | | ల | | 11 ప్ర | | డు |
| | 12 ధా | వ | ళ్యం | | 13 ప్ర | ణ | తి | |
| 14 సా | | ల్యం | | 15 ళ్లి | | వం | | 16 వి |
| 17 వి | ధ్య | | 18 కో | వె | ల | | 19 చా | న |
| త్రి | | 20 కృ | | ల | | 21 మే | | త |
| | 22 కృ | ష్ణ | ద్వై | పా | య | ను | డు | |

## గ్రంథసమీక్ష

నవవిధ భక్తిమార్గాల్లో కీర్తనం ఒకటి. భగవంతుని భక్తితో కీర్తించాలని భాగవతం తెలుపుతున్నది. అయితే భగవంతుని ఏ పేరుతో కీర్తించాలి? అన్న సందేహం ఆధ్యాత్మికవిదులకు కలుగుతుంది. అయితే భగవంతునికి చాలా పేర్లున్నాయని వాటిలో 'నారాయణ' శబ్దం విశిష్టమైనదని వైదికవాఙ్మయం తెలుపుతున్నది. శ్రీభగవద్రామానుజులు నారాయణశబ్దంతో కూడిన అష్టాక్షరీ మంత్రాన్ని భక్తులకు ఉపదేశించారు. ప్రపత్తిలో కూడా 'నారాయణ చరణౌ శరణం ప్రపద్యే' అని ప్రబోధించారు. అందువల్ల నారాయణనామము అత్యంత విశిష్టమైనదిగా చెప్పబడుతున్నది.

భాగవతాదిగ్రంథాల్లోని కథల్లో నారాయణనామ ప్రాశస్త్యం చక్కగా బోధించబడింది. నారాయణశతకం, నారాయణ స్తోత్రంవంటి గ్రంథాల్లో నారాయణ నామాన్ని గూర్చి విశేషంగా చెప్పబడింది. డా॥ పగడాల నారాయణ, నారాయణ మంత్ర వైశిష్ట్యాన్ని ఒకేచోటుకు చేర్చి అద్భుతంగా వివరించారు. వివిధగ్రంథాల్లోని నారాయణమంత్ర పూర్వాపరాలను సమీకరించి 'మోక్షదాయకం- నారాయణ మంత్రం' అన్న ఉత్తమగ్రంథాన్ని వెలువరించారు.

ఇందులో ధర్మం, భక్తి, ఓంకారం, అష్టాక్షరీమంత్రం, వైష్ణవసంప్రదాయం, నారాయణాష్టకం, నారాయణోపనిషత్తు, నారాయణసూక్తమ్, శ్రీకృష్ణశతకంలో నారాయణతత్త్వం, నారాయణశతకంలో నారాయణనామము, నారాయణహృదయము, అన్నమయ్య సంకీర్తనల్లో శ్రీనారాయణనామము, ముకుందమాలలో నారాయణతత్త్వము, శంకరాచార్య నారాయణ స్తోత్రము, నారాయణాస్త్రమంత్రమువంటి గ్రంథాల్లో నారాయణనామము ఎలా వర్ణించబడిందో డా॥ పగడాల నారాయణ సోదాహరణంగా వివరించారు.

ఈ గ్రంథాన్ని పరిస్తే నారాయణ మంత్రంతో బాటు వైదికవాఙ్మయాన్ని అధ్యయనం చేసినంత ఆత్మసంతృప్తి కలుగుతుంది. ఈ గ్రంథం విష్ణుభక్తులకు ఆధ్యాత్మిక కరదీపికగా దోహదపడుతుందనటంలో సందేహంలేదు. నారాయణ మంత్ర తత్త్వాన్ని సమగ్రంగా వివరించిన నారాయణకృషి ప్రశంసించదగ్గది. ఆధ్యాత్మిక విదులందరి ఇంటిలో ఉండదగిన ఒక మంచి గ్రంథం.

ఈ **'మోక్షదాయకం - నారాయణ మంత్రం'** గ్రంథం సరళశైలిలో సశ్లోకయుక్తంగా నారాయణనామ మహిమను వర్ణించిన గ్రంథాల్లో ఇది అద్వితీయమైనదని చెప్పవచ్చు. **- డా॥ పి.మాధవి.**

### మోక్షదాయకం- నారాయణమంత్రం

**రచయిత: డా॥ పగడాల నారాయణ**

**వెల:** రూ. 100/-

**ఆకృతి:** 1/8 డెమ్మి ఆకృతి

**ప్రతులకు:** పి.సంధ్య,
ఇ.నెం. 18-4-150,
రైల్వేకాలనీ ఎక్స్‌టెన్షన్,
5వ క్రాస్, తిరుపతి-517 501.
చరవాణి సంఖ్య: 91607 27374

పాశురాలు, అందులోని ఉపదేశాలు ఆ కాలంవారికే కాదు- ఈ కాలం వారికికూడా మతం, భగవంతుడు- వీటియందు ఆసక్తి కలవారికిమాత్రం జ్ఞానప్రవాహంగానే కన్పిస్తాయి. నమ్మాళ్వార్లు తమ ఇష్టదైవాన్ని "జ్ఞానప్రవాహకాంతిదీపం" అనే పొగుడుతున్నారు. ఈ కాంతిదీపంవల్ల ప్రకాశిస్తున్న జీవితంమాటలు-ఒకే జ్ఞానప్రవాహంగా తోచడంలో ఆశ్చర్యం లేదు.

భగవంతునిభక్తులు తమప్రేమతో వ్యాధి-ద్వేషం-ఆకలి-అనే దోషాలూ మొదలైన రాక్షస సంపదనంతా పోగొట్టి, సమరసాన్నీ, సన్మార్గాన్నీ చూపుతారనీ - అందరికీ సుఖాన్ని ఇచ్చే దైవసంపదను ఇస్తారనీ- ఇందుకుగాను ప్రజలంతా భక్తిమార్గంలో కలిసిమెలసి పనిచేయాలనే ప్రబోధాన్ని నమ్మాళ్వార్లు తమ పాశురాలలో నిగూఢంగా దాచి ఉన్నారు.

ప్రపంచంలోని భక్తిమార్గప్రవర్తకుల్లో నమ్మాళ్వార్లకు ఒక ప్రముఖస్థానం ఉంది. వీరి అవతారంవల్ల తమిళదేశం పునీతమైంది. వీరి ఉపదేశంవల్ల భారతదేశం జ్ఞానసంపదను పొందింది. వీరిని "తమిళ్‌మారన్" అనీ, "వేదం తమిళ్‌శైద మెయ్యన్" అనీ శ్రీవైష్ణవపరమాచార్యులు సెలవిస్తారు. అయితే వీరు ఒకదేశానికీ, ఒక మతానికీ చేరినవారు కారు. వీరు భక్తిమతం, యోగమతం, ప్రేమమతం - అనే త్రివేణీ సంగమానికి చేరినవారు.

# శఠకోపులే నా జ్ఞానదీప్తి

– శ్రీమతి బి.ఉమామహేశ్వరి

**నమ్మాళ్వార్ల శిష్యులలో అగ్రేసరుడు మధురకవిఆళ్వారు. ఇతడు మహాకవి అవటంవలన భట్టనాథుడనే బిరుదు వహించాడు. ఇతడు కవియేగాక గాయకుడు కూడా. ఇతడు మధురములైన కీర్తనలను వ్రాసి అతి మధురంగా గానం చేసేవాడు కాబట్టి మధురకవి అను పేరు పొందాడు.**

మధురకవి నమ్మాళ్వారుకంటె వయస్సున పెద్దవాడు. వీరికి నమ్మాళ్వారు గురించి ఏమీ తెలీదు. కొందరు భక్తులు, తత్త్వవేత్తలు మధురకవి భక్తి గానానికి పరవశించి, వారితో స్వామీ! తింత్రిణీవృక్షమూలంలో జన్మించింది మొదలు 16 సంవత్సరాలు తపస్సుచేస్తూ, భక్తులనుజ్జీవింపచేస్తోన్న నమ్మాళ్వారును మీరెరుగరా! అతన్ని దర్శించుటయే ధన్యత అన్నారు. ఆ మాటలకు ఎలాగైనా నమ్మాళ్వారును చూడాలనే బలమైన కాంక్షను మనసునిండా నింపుకొని దేశమంతా సంచరిస్తున్నాడు.

ఉత్తరదేశంలో సంచరిస్తోన్న మధురకవి నమ్మాళ్వారును కలవటం జరిగింది. భక్తిజ్ఞానాలతో దేదీప్యమానంగా వెలుగొందుతోన్న నమ్మాళ్వారును చూచినంతనే మధురకవి వారికి పాదనమస్కారంతో ఎంతో పరవశించి తాను నమ్మాళ్వారు మొదటి శిష్యుడనని ప్రకటించు కున్నాడు. అది ఒక అపూర్వ సన్నివేశం. తేజోమయమైన నమ్మాళ్వార్ల ముఖవర్చస్సు చూడగానే ఏదో ఒక దివ్యజ్యోతి ఆకాశం నుండి అతనిలో ప్రవేశించిందనే భ్రమ మధురకవికి కలిగింది. తన శేషజీవితాన్ని నమ్మాళ్వార్ల సమక్షంలోనే గడపాలని గట్టిగా నిర్ణయించుకొని ఆయనకెదురుగా భూమిపై ధ్యాననిష్ఠులుగా కూర్చున్నాడు. అలా నమ్మాళ్వార్ల కలయికతో మధురకవి కూడా ఆళ్వారయ్యాడు.


మధురకవిఆళ్వారు

శఠకోపులు పుట్టినది మొదలు 16 సంవత్సరాలు యోగస్థితిలోనే ఉన్నారని తెలుసుకొన్న మధురకవులు వేదాంతానికి సంబంధించిన కొన్ని ప్రశ్నలడిగారు.

**మధురకవి:** ఆత్మ అనేది శరీరమను భౌతికపదార్థం నుండే ఉత్పన్నమైందని చెప్పినపుడు ఆ ఆత్మ ఏమి తింటుంది? ఎందుంటుంది?

**నమ్మాళ్వారు:** ఆత్మ ఆత్మను భక్షిస్తుంది. ఆత్మ ఆత్మయందే ఉంటుంది.

**మధురకవి:** అచిత్తులో జీవాత్మ సంబంధం కల్గియున్నపుడు దానిని అనుభవించి ఎక్కడ పడియుంటుంది!

**నమ్మాళ్వారు:** ఆత్మ శరీరగతమైన సుఖదుఃఖాదులను అనుభవిస్తూ శరీరాన్నే ఆశ్రయించుకొని యుంటుంది.


**ఈ ఆళ్వారు అతిమధురంగా గానం చేయువాడు. వీరు గొప్ప వేదాంతి, తత్త్వవేత్త, తార్కికుడు, గాయకుడు, ప్రవక్త. నమ్మాళ్వార్ల ద్రావిడవేదాన్ని గానంచేస్తూ లోకాన్ని ఉద్ధరించినవాడు. వీరు నమ్మాళ్వారుల గురించి పాశురాలను రచించి గానంచేశారు.**

**ఆ విజ్ఞానాన్ని విన్న మధురకవి, నమ్మాళ్వారు సర్వజ్ఞులు అనే భక్తిభావనతో ఆ మహానుభావుని అనువర్తించి మనోవాక్కాయకర్మలందు నిరంతరమూ వారినే స్మరించుకుంటూ, వారికి ప్రథమశిష్యుడై వారి వైభవాన్ని పరమార్థమైన 12 పాశురాలుగా కీర్తించాడు.**

# కైంకర్యమే..
# తనువు దాల్చితే....

5

- డా॥ కంపల్లె రవిచంద్రన్, 98487 20478



**(జరిగిన కథ - రామానుజులవారిపై గురువు యాదవప్రకాశునికి ఈర్ష్య ఇసుమంత కూడా తగ్గలేదు సరికదా, శిష్యునిపై అకారణ ద్వేషం మరింత పెంచుకున్నాడు. దానితో రామానుజులు ఆలోచనలో పడ్డారు. ఆ తర్వాత.... )**

భాగవతులకు కొలమానం భగవద్భక్తే కానీ వంశం, కులం, వర్ణం, ఇవేమీ కావు. దోషరహితజీవనం, దైవధ్యానాసక్తి, తపస్సుకలవారు ఏకులజులైనా వారితో సాంగత్యం చేయవచ్చు.

రామానుజులు ఈతత్త్వం తెలిసినవారు. వర్ణవ్యవస్థను మించింది భాగవతవ్యవస్థ అని వారినమ్మకం. తిరుక్కచ్చి నంబితో రామానుజులవారిఅనుబంధం ఈ కోవలోనిదే. నంబి అబ్రాహ్మణుడే అయినా పరమప్రసన్నుడు, పవిత్రమూర్తి. ఒక ఆదర్శమయజీవనవిధానం కోసం-నీతి, న్యాయం, ధర్మం- వంటి మార్గదర్శకసూత్రాలను ఋషిప్రోక్తమైన మనవాఙ్మయం సూచిస్తోంది. ఈ ధర్మాలను మనం ఆత్మతో దర్శించి, మన దైనందినజీవితంలో ఆచరణాత్మకంగా అన్వయింపచేసుకోవాల్సి ఉంది. అప్పుడే ఆయా ధర్మాల తత్త్వాలు మనకు తెలిసివస్తాయి. 'పవిత్రత'- అనే శబ్దం, ఆ శబ్దం వెనుక ఉండే అంతర్లక్షణమూ- ఇలాంటి ధర్మానికి అనుబంధంగా ఉండే విషయమే!

పరిశుద్ధం -వ్రత శౌచాదుల వల్ల శుద్ధమైంది. పాపాల్ని పోగొట్టేది- అనేవి- ఈ 'పవిత్రత' అనే పదానికి నిఘంటువులు చెప్పే నిర్వచనం. ఇట్లా అన్నప్పుడు ఎవరికైనా ఒక అనుమానం కలుగవచ్చు. ఈ పవిత్రత-పరిశుద్ధత - అనేవి కేవలం పారమార్థిక సంబంధమైన అంశాలు మాత్రమేనా? కాక, ఒక ప్రవృత్తి పరమైన అంశంగా మారి, మనిషి జీవితంలో వెలుగును ప్రసరింపజేసి, ఒక సార్థకతను చేకూర్చే లక్షణం ఉండి ఉంటుందా?

ఆలోచిస్తే- ఈ రెండు లక్షణాలు కలిగి ఉండి, మన భౌతిక, ఆధ్యాత్మిక జగత్తులు రెండింటినీ ప్రభావితం చేసే ఒక సంస్కారరేఖ - ఈ 'పవిత్రత'- అన్నభావం మనసుకు తోస్తుంది. మనకు పంచభూతాలు పవిత్రమైనవి. మనల్ని కాపాడేదైవం అక్కడ కొలువుంటాడని విశ్వసిస్తాం కనుక. మనకు ఇతిహాసాలు పవిత్రమైనవి - మన ఐహికాముష్మిక జీవనపథాన్ని అవి తీర్చిదిద్దుతాయని నమ్ముతాం కనుక! అందుకే పవిత్రతకు సంబంధించిన ఈ నమ్మకాలన్నిటి వెనుక ఉన్న బలీయమైన అంశం - పారమార్థికమైనది అని చెప్పవచ్చు.

లౌకిక జీవనవ్యవహారంలోనూ- ఈ పవిత్రత- అన్న లక్షణం మీద మనం ఏర్పరచుకొన్న విలువలూ, విశ్వాసాలూ కొన్ని ఉన్నాయి. పవిత్రత-శరీరానికీ, మనస్సుకూ కూడా ఉండాలన్నది- మన భారతీయసంస్కృతిలోని ప్రధానాంశం! సీత-అగ్నిలో దూకాల్సివచ్చింది - తన పవిత్రతను నిరూపించు కోవటం కోసం! 'విశుద్ధభావాం నిష్పాపాం ప్రతి గృహ్ణీష్వ రాఘవ' అని సాక్షాత్తు అగ్నిదేవుడు సాక్ష్యం పలకవలసి వచ్చింది. అగ్ని వంటి ఆ పవిత్రతే- మన సంస్కృతీ వారసత్వానికి ఆయువు పట్టుగా నిలిచిన మాట నిజం. తీర్థయాత్రల వల్ల, కోనేటి స్నానాల వల్లా ఆత్మకు సంతృప్తి కలిగేమాట నిజమే. అంత మాత్రం చేత- మనశ్శరీరాలు పునీతమై పోయాయను కోవడం సరికాదు. కేవలం వ్రతాలూ, పూజలూ చేయడం వల్లనే పవిత్రత సాధ్యం అయ్యేది కాదు. ఆత్మశుద్ధికి ఎంతో సాధన కావాలి. ఒక విశుద్ధమైన జీవనసంస్కారం కావాలి. ముందు మనకు పవిత్రంగా జీవించడం ఎట్లానో తెలియాలి. మనోవాక్కాయకర్మలలో ఒక పరిశుభ్రతను నిలుపుకోవాలి. పరిశుద్ధమైన ఆలోచన, మృదువైన వాక్కు, శుభ్రమైన శరీరం, పరహితార్థమైన కర్మానుచరణం - ఇవన్నీ మనిషికి పవిత్రతను ఇస్తాయి. అప్పుడు ఆ పవిత్రత తాలూకు శుభ్రసౌందర్యతేజం - మనిషి వ్యక్తిత్వానికి గొప్ప వెలుగును ప్రసాదిస్తుంది. పరులకు సహాయపడడంలోనూ, పరుల ఆర్తినీ, దుఃఖాన్నీ ఉపశమింపజేయడానికి తోడుపడటం లోనూ ఉంది పవిత్రత. కరుణలోనూ, ప్రేమలోనూ నిండి తొణికి సలాడేది పవిత్రత. మనిషిని మనీషిని చేసేది ఈ పవిత్రతా లక్షణం.

తిరుక్కచ్చినంబి శ్రీయామునుల అంతరంగశిష్యులలో ఒకరు. వీరు చెన్నైలోని మయిలాపురికి పడమరగా,కంచికి తూర్పుగా ఉండే పూవిరున్దమల్లి అనే చోట వైశ్యకులంలో శ్రీవీర రాఘవులకు, కమలాంబకు నాల్గవ కుమారులుగా శబరిఅంశలో జన్మించినవారు. సౌమ్యనామ సంవత్సరం- మాశినెల (మాఘ మాసం) మృగశీర్షనక్షత్రంలో వీరు అవతరించారు. వీరిప్రసిద్ధ నామం గజేంద్రదాసులు. తాము కొలిచే భార్గవులైన తిరుమళి శైయాళ్వార్ల కృపతో జన్మించడం వల్ల తండ్రిగారు వీరికి భార్గవ ప్రియులనే పేరు పెట్టారట! తిరుక్కచ్చినంబి తాతగారు 'పచ్చై వారణదాసర్' (హరిత వారణభృత్యులు) గురించిన ఐతిహ్యాన్ని కూరత్తాళ్వాన్ సుందర బాహుస్తవం చివరలో ప్రస్తుతించారు.

**హరితవారణభృత్య సమాహ్వయం కరిగిరౌ వరద। త్వమ పూర్వికామ్,**
**దృశ మలంభయ ఏవహి సుందర। స్ఫుట మదా శ్చ పరశ్శత మీదృశమ్**

- అనే శ్లోకంలో ఈ ఐతిహ్యం కన్పిస్తుంది.

పూవిరున్దమల్లికి సమీపంలో గల దాశరథిపేట అనే చోట ఉన్న ముదలియాణ్డాన్ సన్నిధిలోని శ్రీఅర్చామూర్తికి హరిత వారణులని పేరు. ధర్మరాజు యాగం చేసినపుడు భగవానుడు పచ్చని వర్ణం కల గజరూపంలో సాక్షాత్కరించాడని అక్కడి స్థల పురాణం.

పూవిరున్దమల్లిలో జన్మించిన తిరుక్కచ్చినంబి పితామహుడు, అక్కడి అర్చామూర్తికి నిత్యం కైంకర్యాన్ని చేస్తూండడం వల్ల అతనికి హరితవారణభృత్యుడని ప్రసిద్ధి. పుట్టుగ్రుడ్డి అయిన అతడు ఒకసారి కంచి వరదరాజస్వామిని సేవించాలని ఆశ పడగా, స్వామి అతణ్ణి కంచికి పిలిపించి, నేత్రదృష్టిని అనుగ్రహించాడని జనశ్రుతి. ఈ సంఘటన శ్రీయామునులకాలంలో జరిగిందని, అందువల్లే వారు కంచి వరదరాజస్వామిని ప్రార్థించే శ్లోకంలో **"యస్య ప్రసాద కలయా బధిరః శ్రుణోతి పంగుః ప్రధావతి జవేన చ వక్తి మూకః, అంధః ప్రప శ్యతి"** అని అన్నారట.



తిరుక్కచ్చినంబి శ్రీయామునుల శిష్యులు. శ్రీయామునులు వీరికి వరదరాజస్వామి కైంకర్యంలోని, శ్రద్ధా భక్తులకు సూచకంగా, **"పేరరుళాలదాసర్"** అనే పేరును పెట్టారు. కంచిలో వీరు నివసించినందువల్ల తిరుక్కచ్చినంబి, కాంచీముని, కాంచీపూర్ణులు- ఇత్యాదిగా భక్తులు పిలిచేవారు. వీరు నిత్యం కంచి వరదరాజస్వామికోవెలలో ఆలవట్టాన్ని వీచే కైంకర్యాన్ని చేసేవారు. **"వాజిమేధే వపా హోమే ధాతు రుత్తర వేదితః, ఉదితాయ హుతా దగ్నేః"** అని కీర్తింపబడే వరదరాజస్వామి, బ్రహ్మ చేసిన యాగంలోని హోమవేదిక నుండి ఆవిర్భవించినందువల్ల, ఆ అగ్నితాపాన్ని ఉపశమింపజేసేటట్లుగా వరదరాజస్వామి తిరుమేనికి చల్లదనాన్ని చేకూర్చేవిధంగా ఆచార్యాజ్ఞ ప్రకారం తిరుక్కచ్చినంబి ఆలవట్ట కైంకర్యాన్ని చేసేవారు. వీరి పట్ల ఉండే వాత్సల్యాతిశయం చేత వరదరాజస్వామి ప్రతిదినం రాత్రి సమయంలో ఏకాంతసేవ వేళ వీరితో అర్చాసమాధి నియమాన్ని కూడా విడచి సంభాషించేవారు. సాక్షాత్తు భగవంతుడే తిరుక్కచ్చి నంబిని సఖుడిగా స్వీకరించి, స్నేహం చేశారంటే ఇంత కంటే భాగ్యమేమి కావాలి? సఖ్యం హృదయార్పణం.

**అత్యాగసహనో బంధుః సదైవానుమతం సుహృద్।**
**ఏకక్రియం భవేన్మిత్రం సమప్రాణ స్సఖా మతః॥**

ఏ మాత్రమూ దూరంకావడాన్ని సహించలేనంత బంధాన్ని మనతో ఎవరు పెంచుకుంటారో వాళ్లు బంధువులు. మన ఆలోచనను విని దానికి అనుగుణంగా ప్రతిస్పందిస్తూ ఏదైనా తేడా ఉంటే సమన్వయదృష్టితో సరిచేస్తూ - బాగానే ఉంది అమలు చేయవలసిందని చెప్పేవాడు సుహృత్తు. ఒకే బండిని లాగే రెండు వృషభాల్లాగా ఒకే దిక్కుని నడుస్తూ ఒకరినొకరు కలుపుకునిపోతూ కార్యసాధనని చేసుకునే వాళ్లు మిత్రులు. ఇక తన ప్రాణంతో సమంగా- మరో ప్రాణం బయట తిరుగుతోందా? అన్నట్లుగా ఎవరు సంచరిస్తారో వాళ్లు ఈ వ్యక్తికి సఖులు అంటోంది పై శ్లోకం.

సంస్కృతంలో ఒకే బాంధ్యవ్యాన్ని తెలిపే పదాలు ఎన్నెన్నో ఉండడానిక్కారణం వాళ్లంతా ఐకమత్యంతో ఉన్న వాళ్లూ, అలా అంటూ సత్సంబంధాలని కలిగినవాళ్లూ కావడమే. అందుకే వివాహిత స్త్రీని పత్నీ, దారాః, భార్యా, సుమంగళీ, గృహిణీ.... ఇలా అనేక పేర్లతో వ్యవహరించారు. మనకు భార్యాత్వ ధర్మం ఎన్ని విధాలుగా ఉంటుందో, ఉండాలో తెలియజేసేందుకు అన్ని పదాలను ఏర్పాటు చేశారు ఋషులు. చిత్రమేమంటే పై పదాలన్నింటికీ 'భార్య' అనేది అర్థం. అలా ఉచ్చరింపబడిన పదంలో ఆ స్త్రీ లక్షణం దాగుండడం విశేషం.

*(ఇంకా ఉంది)*

భగవంతుడు భాద్రపదశుద్ధద్వాదశీరోజు మధ్యాహ్నసమయమందు లోకరక్షణార్థమై దశావతారాల్లో ఐదవదైన వామనావతారాన్ని స్వీకరించాడు. కావున, తదుపాసకులు ఈ అవతారదినమందు స్వామివారిని విశేషంగా పూజిస్తారు.

# మనస్సుపై విజయం - వామనావతారరహస్యం

- బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్




జ్ఞానేంద్రియాలకూ, కర్మేంద్రియాలకూ నాయకుడు మనస్సు. ఈ మనస్సు మహాబలమైనది. అందుకే మనోబలమనే పేరొచ్చింది. అటువంటి బలం కలవాడు బలి. ధర్మ బలం, సత్యబలం, దానబలం, ఇంద్రియబలం, మనోబలం- ఇవన్నీ ఉన్నవాడే ఇంద్రసేనుడనీ, బలి అనబడతాడనీ వ్రజ భాషాభాగవతవాక్కు. వీటికితోడు గురుకటాక్షముంది కనుక గురుబలి అనీ పేరు.

బలి పురందరుడనే ఇంద్రుని పదవిని లాక్కొన్నాడు. దేవతల యజ్ఞభాగాలన్నీ తానే స్వీకరించాడు. అందువల్లనే అతనిలో ధర్మమున్నా తప్పనిసరియై హరి అతడిని పదభ్రష్టుడిని చేశాడు.

కశ్యపప్రజాపతి భార్యల్లో పెద్దామె అదితి. ఆవిడ కొడుకులే దేవతలు. ఆమె తన భర్తను, ఇంద్రాదులకు తిరిగి వైభవం లభించే మార్గం సూచించుమని కోరింది. కశ్యపుడు ఆమెను ఫాల్గుణశుక్లపక్షప్రతిపత్తిథి(పాడ్యమి) మొదలుకొని ద్వాదశివరకూ హరిని ఆరాధించుమన్నాడు. పాలుమాత్రమే త్రాగాలన్నాడు. దీనికి 'పయోభక్షణవ్రతం" అని పేరు. అనేక నియమాలు కూడా చెప్పాడు. అదితి కఠోరనియమాలు పాటిస్తూ పయోభక్షణవ్రతం చేసింది. శ్రీహరి ఆమెకు ఆమె గర్భాన జన్మించి, ఇంద్రుడిని అనుగ్రహిస్తానని మాటిచ్చాడు. ఆమె గర్భంలో ప్రవేశించాడు. ద్వాదశీతిథి, శ్రవణ నక్షత్రం, అభిజిన్ముహూర్తం, నక్షత్రాలు, గ్రహాలు శుభస్థితిలో ఉన్నపుడు భాద్రపదమాసంలో శ్రీహరి అదితికి జన్మించాడు. ఆయన ముందుగా చతుర్భుజాలతో అదితి పుత్రుడుగా అవతరించి కశ్యపుడు చూస్తూండగా వామనుడిగా మారిపోయాడు. ఉపనయనం చేయించుకొన్నాడు. సాక్షాత్తు శివపత్ని భవాని పూర్ణభిక్ష ఆయన భిక్షాపాత్రలో వేసింది.

అనంతరం వామనమూర్తి బలియజ్ఞవాటికకు వెళ్లాడు. ఆయనను మూడడుగులు దానంగా కోరాడు. బలి ఇవ్వబూనాడు. గురువు శుక్రాచార్యుడు వచ్చినవాడు హరి అని అనుమానించి వద్దని వారించినా వినలేదు. శ్రీహరి దానధారస్వీకరించాడు. రెండేరెండడుగులతో లోకాలన్నీ ఆక్రమించాడు. మూడవపాదం బలిశిరస్సున ఉంచాడు. బలిని రసాతలానికి పంపాడు. సత్యం తప్పని బలిని మెచ్చి అతడి ద్వారం దగ్గర కాపలావాడయ్యాడు. రాబోయే సావర్ణిమనువు కాలంలో అతడిని దేవేంద్రుడిని చేస్తానన్నాడు. ఇంద్రపదవిచ్చినా పుణ్యం తరగదనీ, అతడిని సర్వకాలాల్లో తన సుదర్శనచక్రం రక్షిస్తుందనీ, అతనిలో ఉన్న కించిత్తు అసుర ప్రవృత్తి తన దర్శనంవల్ల నశిస్తుందన్నాడు. ఇంద్రపదవిని అనుభవించాక పరమసిద్ధిని కూడా బలి పొందగలడని శ్రీహరి వరమిచ్చాడు.

ఈ ఘట్టమంతా ద్వాదశినాడే గడిచింది. అసుర ప్రవృత్తిపై విజయం, భగవంతుని విజయం, దానవిజయం, ధర్మవిజయం అన్నీ కలసి ఈ భాద్రపదశుద్ధ ద్వాదశి, వామనావతార పవిత్రదివసం, విజయద్వాదశిగా ప్రసిద్ధికెక్కింది. వామనుడు అనే శబ్దానికి ఒక నిగూఢార్థం ఉంది. మనస్సు లేనివాడు. అనగా మనస్సును అదుపులో ఉంచిన వాడు. ఇంద్రియ నిగ్రహం కలవాడు. అందువల్ల వామనావతారం అనగా మనస్సుపై విజయం. మనస్సును జయించిన వాడు సాక్షాత్తు పరమాత్మయే.

శ్రీ వేంకటేశ్వరస్వామివారికి మాననీయుడగు శ్రీ వరాహస్వామివారి జయంతి ఉత్సవదినమున శ్రీ స్వామివారికి రాత్రి కైంకర్యాల తర్వాత తీర్మానానికి ముందుగా అర్చకస్వాములు, పాచకులు, పరిచారకులు కైంకర్యపరులు వరాహస్వామి సన్నిధానానికొచ్చి ఆరాధనము, ప్రసాదతళియలు నివేదనము జరిపి హారతులివ్వడం జరుగుతుంది.

# వరాహావిర్భావం - ఆధ్యాత్మికభావన

- డా॥ రేవూరు అనంతపద్మనాభరావు,
98665 86805.




దితి కశ్యపులకు, అన్నదమ్ములుగా హిరణ్యాక్ష, హిరణ్యకశిపులనే అన్నదమ్ములు జన్మించారు. రసాతలంలోనున్న భూమి శాశ్వతంగా హిరణ్యాక్షునికి పరమయ్యేట్లు బ్రహ్మ (హిరణ్యాక్షునికి) వరమిచ్చాడు. గర్భం ధరించిన దితి ఇద్దరుపుత్రులను ప్రసవించింది. వారిని చూడటానికి వచ్చిన తండ్రి దితి రవితేజంతో వెలుగొందే పెద్దవానికి కాంచన లోచనుడని-పేరు పెట్టాడు. బంగారుకనులు గలవాడు- హిరణ్యాక్షుడయ్యాడు.

## ఆధ్యాత్మికభావన

'హిరణ్యమివ అక్షిణీ ఇతి హిరణ్యాక్షః" - బంగారంవంటి కనులు కలవాడు. 'సర్వేంద్రియాణాం నయనం ప్రధానం'. అలాంటి నయనేంద్రియాలకు వశుడు హిరణ్యాక్షుడు. భూమి సమస్తం (ప్రకృతి) తనదేననే గర్వాతిశయం. తాను చూచిన సమస్తం తన వశం కావాలనే దురాశ. సంపదను మూటగట్టినట్లు భూమినంతా చాపచుట్టగాచుట్టి నీటిలో దాచాడు. సంపదలను దాచుకొనే దుస్స్వభావం గలవారికి ప్రతినిధి అతడు. భౌతికవస్తువులను సమీకరించాలనే భావనయే అజ్ఞానానికి సంకేతం. 'యద్భావం తద్భవతి' వాని మనసులో భావన చుట్టగట్టే పనికి పురికొల్పింది.

**మరి సృష్టికర్తయైనబ్రహ్మ గత్యంతరంలేక 'రక్షించు' మని శ్రీమన్మహావిష్ణువును ప్రార్థించాడు. వరదుడైన విష్ణువు అకస్మాత్తుగా అంగుష్ఠమాత్రప్రమాణంలో వరాహ శిశువు రూపంలో బ్రహ్మముక్కులోనుండి ఊడిపడ్డాడు. ఇక్కడ బుద్ధి చైతన్యరూపమైన పరమాత్మను అడిగింది. బ్రహ్మ విష్ణుని ఆశ్రయించడం వెనుక రహస్యమిదే!**

అజ్ఞానమంటే మరేదో కాదు - ఐహిక భావ లంపటం. చైతన్యాన్ని వదలిపెట్టి జడంలోకి వెళ్లడమే జలగ్రస్త తత్త్వం. శ్రేష్ఠమైన అహంభావమే వరాహం. సాధకునిలో శ్రేష్ఠమైన అహంభావన కలిగినపుడు లౌకికవాంఛలు నశిస్తాయి. అవి నశ్వరాలు. అదే హిరణ్యాక్షసంహారం వెనుక దాగియున్న అంతరార్థం. సాధకునిలో 'అహం'భావన కల్గితే వెంటనే అసత్యమైన హిరణ్యాక్ష భావన దూరమౌతుంది. ఐతే చాలామంది సాధకులలో ఈ హిరణ్యాక్షుడు శాశ్వతంగా తిష్ఠవేసుకొని కూచొంటాడు. జన్మజన్మల పాప ఫలాన్ని వారను భవిస్తారు. పరమాత్మను ఆరాధించి వస్తు వ్యామోహాలను వదలి సత్యాన్ని తెలుసుకొని ముక్తిమార్గాన్ని అనుసరించాలని ఈ భాగవతగాథ మనకు తెలియజేస్తోంది.

సెప్టెంబరు 5 వినాయకచవితి పండగ...




# ఓ బొజ్జగణపయ్య!

- శ్రీ కృష్ణచైతన్య

**ఓ బొజ్జ గణపయ్య,**
**నీ బంటు నేనయ్యా!**
**ఉండ్రాళ్లమీదికి దండు పంపు!**

ఆర్తుడూ, అర్థార్థీ, జ్ఞానీ.... ఇలా భక్తుల్లో రకరకాలున్నట్లే ప్రార్థనల్లోకూడా పలురకాలు! పైన పేర్కొన్న పాటకూడ ఒక ప్రార్థనే!

మన దేవుళ్లవన్నీ దివ్యమంగళరూపాలే! మరి ఇందుకపవాదంగా బానకడుపుతో, చీమంతకళ్లతో, చేటల్లాంటి చెవులతో, తొండంలాంటి ముక్కుతో సదా భుక్తాయాసంతో ప్రత్యక్షమయ్యే 'గణపతి' హాస్య రసాధిదేవతగా మన కవులకు కనిపించడం వింతకాదు.

ఐతే మెరిసేదంతా బంగారం కానట్లే, కంటికి కనబడేదంతా సత్యం కానక్కరలేదు! మనిషిరూపం వేరు; అతని మేధాశక్తి వేరు– ఈ రెంటికీ మధ్య ఎంతెంతో దూరం! ఇందుకు గణపతితత్త్వం ప్రథమోదాహరణం! ఆయన శరీరం ఎంత స్థూలమో బుద్ధి అంత సూక్ష్మం. మాతాపితరులకు ముమ్మారు ప్రదక్షిణం చేసి ముల్లోక సంచారఫలం సాధించే 'ధర్మసూక్ష్మం' బాల్యంలోనే కనిపెట్టినందు వల్లనే ఆయన గణాధిపతీ, వినాయకుడూ కాగలిగాడు. వినాయకుడే మనకు ఆదర్శం! వినాయకుడు బ్రహ్మచారి! ఐనప్పటికీ సిద్ధి, బుద్ధి అనే దేవేరులు ఆయనకు ఉన్నారనటం కార్యసిద్ధి, సూక్ష్మబుద్ధి నాయకత్వ లక్షణాలని చెప్పడానికే కావచ్చు.

గణపతి వైరూప్యం వెనకున్న మరోసందేశం కూడా గమనార్హమైందే! శారీరకసౌందర్యం క్షణికమైంది. ఇందుకు భిన్నమైంది ఆత్మసౌందర్యం. దానికి వృద్ధేగాని క్షయం లేదు. రూప, యౌవన, కుల బలగర్వాలు మనిషిలో అహంకారాన్ని అంకురింపజేస్తే ఆత్మ సౌందర్యం అతణ్ణి వినయశీలిని చేస్తుంది. అందం లేనివారిపట్ల సౌందర్యవంతుల మిడిసిపాటు చివరికి వారికి భంగపాటుగా పరిణమిస్తుంది. పాపం! అందాల చందమామ అహంకారంతో బొజ్జగణపతిని అపహాస్యం చేసిన నేరానికేగదా వినాయకచవితినాడు నెలవంకను చూడకుండా మనం తల త్రిప్పుకొంటున్నది.

మూలాధారచక్రానికి అధిష్ఠాతయైన వినాయకుడు జ్ఞాని మాత్రమేగాక బ్రహ్మజ్ఞానికూడా! గణపతి ఉపాసన వేదాంతపరంగా ఎంతో గాంభీర్యాన్ని సంతరించుకుంది. మట్టితో చేసిన గణపతి బొమ్మను పూజానంతరం సాలంకారంగా నీటిలో కలిపేయటంలో పాంచభౌతికమైన మనశరీరం నీటి బుడగ లాంటిది. దీనిపై మమత, భ్రమ తగదు అనే హెచ్చరికున్నది.

ఎందుకూ కొరగానివిగా లోకులు తలచే జిల్లేడు పూలూ, ఉమ్మెత్తలూ గణపతిపూజలో పీట ఎక్కికూచోటంలో 'హీనంగా చూడకు దేన్నీ!' అనే కవి అనుశాసన ముంది. ఆ స్వామి ముందు మొట్టికాయలు వేసుకోటం, గుంజిళ్ళు తీయటం మానసికంగా శారీరకంగా మన నమ్రత కోసమే.

తానొకటి తలిస్తే దైవమొకటన్నట్లు కాకుండా తలచినపని తలచిన రీతిలో జరగాలంటే దైవానుగ్రహ ముండి తీరాలి. ఏ పనైనా అవిఘ్నమస్తు అని ఆశీర్వదించగలిగిన దైవం విఘ్నేశ్వరుడే! ఆయన విఘ్నకారకుడూ వినాశకుడూ కూడా! అందుకే ఆయన పూజతోనే మనం ఏపనైనా ప్రారంభిస్తాం! చివరికి దైవకార్యం కూడా!

ఒక మంచిపనికి ఎదురయ్యే ఆటంకాలు ఎన్నెన్నో! పదిమందీ కలిసొస్తేనే ఒక పుణ్యకార్యం! విఘ్నేశ్వరుడి సంగతి అటుంచితే పనిగట్టుకొని ఒక మంచిపనిని చెడగొట్టేవారు మనలోనే ఎంతో మందున్నారు. స్వార్థంతో ప్రతిదానికీ అడ్డం పడటమే వారు చేసే ఘనకార్యం! ఇలాంటివారివల్లే మన ప్రగతి కుంటుపడుతోంది. పుణ్యకార్యాలకు 'విఘ్నం' కల్గించకపోవడమే మనం చేసే నిజమైన 'విఘ్నేశపూజ' అనే తలంపు అందరిలో కలగాలి.




# అనంతపద్మనాభస్వామివ్రతవైశిష్ట్యం

- శ్రీమతి మల్లాది రామలక్ష్మి, 92478 90490

ఈవ్రతంనాడు తిరుమలలో శ్రీచక్రత్తాళ్వారు తిరుచ్చిలో ఆసీనులై తిరువీథుల మహాప్రదక్షిణంగా వరాహ స్వామివారి ఆలయానికి ముందున్న మండపంలోకి వేంచేపు చేయబడి అచట అభిషేకం జరుపబడి పుష్కరిణిలో స్నానం గావింపబడి పిమ్మట పుష్పాద్యలంకారము, ఆరాధనము, దోశెపడి నివేదనము జరిగి హారతి ఇవ్వబడి శ్రీవారి సన్నిధానానికి వేంచేసిన తర్వాత ఈ వ్రతానికి సంబంధించి పట్టుతోరాలు స్వామివారికి సమర్పణ చేయబడుతాయి.

అనంతుడు అనగా ఆదిశేషుడు, విష్ణువు, రుద్రుడు అని అర్థం. కానీ, విష్ణువుకు పాన్పుగా భూమిని మోసే ఆదిశేషునికే పూజ చేస్తారు. భగవానుడు నేనే అనంతుడను. సూర్యగమనంచేత పగలురాత్రియనీ, యుగసంవత్సర ఋతు మాసకల్పాల్ని సంజ్ఞలచే ఒప్పుతూన్న కాలం నాయొక్క స్వరూపమే. నా స్వరూపుడైన కాలపురుషుడే అనంతపద్మనాభుడు అని చెప్పాడు.

భాద్రపదశుక్లచతుర్దశినాడు ఈ పూజకు ప్రాముఖ్యముంది. అందువల్ల దీనికి అనంతపద్మనాభచతుర్దశి అనే పేరు ఏర్పడింది. ముఖ్యంగా పద్మాలపిండితో ఏడుపడగలతో పామును చిత్రించి, దర్భలతో పాముబొమ్మను తయారుచేసి దానికి పూజచేయడం ఈ వ్రతవిశిష్టత.


## వ్రతవిధానం

ఇందు యమునాజలపూజనం, అనంతునిపూజ, ప్రతిసరపూజ ముఖ్యమైనవి. కుంకుమతో తడిపిన పద్నాలుగు ముడులుకల్గిన కొత్తతోరాన్ని స్వామిముందుంచాలి. ఆ తర్వాత షోడశోపచారపూజచేసి, ప్రదక్షిణనమస్కారం చేయాలి. పూజాద్రవ్యాలన్నీ 14 అంకెలోనే ఉండాలి. ప్రతి సంవత్సరం కొత్తతోరం కట్టుకుని పద్నాలుగోసంవత్సరం ఉద్యాపనం చేసి మరల వ్రతం ఆచరిస్తూండాలి. ఇదీ అనంత పద్మనాభవ్రత విధానం.

## వ్రతకథ

సుమంతుడు తన కుమార్తె సుశీలను కౌండిన్యుడనే బ్రాహ్మణునికిచ్చి పెళ్లిచేశాడు. ఆమె అత్తవారింటికెళ్తోన్న సమయంలో కొద్దిగా గోధుమపిండిని మూటగట్టిచ్చాడు. ఆ మార్గంలో ఒక ఆశ్రమంలో సుశీల కొందరు ముత్తైదువలు చేస్తూన్న అనంతపద్మనాభస్వామివ్రతాచరణంలో తానూ పాల్గొనింది. వ్రతతోరాన్ని కట్టుకుని తనచేతిలో ఉన్న గోధుమపిండినే బ్రాహ్మణులకు దానమిచ్చింది. ఆ వ్రతం ఆచరించిన మాహాత్మ్యంవల్లనే ఆ ఆశ్రమం అష్టైశ్వర్యసంపన్నమైంది.

సుశీలచేతికున్న అనంతవ్రతతోరాన్ని చూసి అదేదో వశీకరణయంత్రమేమోయని భావించాడు కౌండిన్యుడు. ఆ తోరాన్ని తెంపి అగ్నిలో పడేశాడు. అపచారానికి ఫలితంగా దారిద్ర్యబాధతో అతడు పశ్చాత్తాపచిత్తంతో అనంతునికోసం పరితపించాడు. అనంతుడు కనిపించేవరకు అన్నపానాలు ముట్టనని దీక్షపట్టాడు. అలా అనంతుడు ప్రత్యక్షంకాగా తన ఆశ్రమానికి తీసుకెళ్ళి దివ్యసింహాసనంపై ఆసీనుని గావించాడు. అనంతపద్మ నాభునిగా దర్శనమిచ్చాడు. అలా స్వామిని చూచిన కౌండిన్యుడు ఎంతో పరమానందభరితుడయ్యాడు. అనంతసంపదలు, ముక్తిని ప్రసాదించే ఈ అనంతపద్మనాభస్వామివ్రతాన్ని అందరూ ఆచరించి తరిస్తూన్నారు.




# పరమయోగివిలాసం

– ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

కాంచీపురపట్టణానికి రాజు పల్లవరాయడు. ఆ రాయనికి వేటాడ్డం ఒక తీరని వ్యసనం. ఒకరోజు తనతోడిరాజులతో గుఱ్ఱమెక్కి అడవికి వెళ్ళాడు. ఆ మార్గంలో ఒక యువతిని చూచాడు. పల్లవరాయని మనసు చెదిరింది. ఆమె ఆకారాన్ని చూచి భూమిమీది మెఱపో అనుకొన్నాడు. అంతేకాదు మాణిక్యాలగని యేమో అని భ్రాంతిపడ్డాడు.

“బంగారుప్రతిమా? పూచిన కల్పలతనా? మదనుని రాచిలుకా? అని రకరకాలుగా ఊహిస్తూ గుఱ్ఱందిగి తరుణికేసి నడిచాడు. గారవంతో పలికి ఆమెను పల్లకీ ఎక్కించాడు. తాను గుఱ్ఱమెక్కి నగరంకేసి నడిపాడు. ఆమెను చూచినప్పటినుంచి పల్లవరాయడు తనవశంలో లేడు. మదనావేశపరుడయ్యాడు.

తనకు కనబడిన తరుణి ‘కులగోత్రశీలనామములు’ కూడా అడగాలని అతని కనిపించలేదు. సరాసరి అంతఃపురంలోనే బస చేయించాడు. శుభముహూర్తంలో ఆమెను పెళ్ళాడినాడు. ఆమెతో చిరకాలం సుఖించాడు. కాలం పరుగిడుతున్నది.

చెఱకు నమిలాక పిప్పి ఎలా ఉందో అలాగ రాజు వెంట్రుకలు నెరసినాయి. వార్ధక్య లక్షణాలన్నీ ఆ పల్లవరాయని దేహంలో స్పష్టంగా కనిపించసాగాయి. అపుడు పల్లవరాయడు తాను ‘యయాతి’లాగ అయ్యానే అని బాధపడ్డాడు. అయినా అతనికొక తీరని సందేహం. తాను పెళ్ళాడిన యువతితో– ‘ఏమిటీ? ఈ భూలోకంలో ఎక్కడా కనిపించని, వినిపించని వింతగా ఉందే! లోకంలో సాధారణంగా ఆడవాళ్ళు తమ భర్తలకంటె ముందుగా ముసలివారైపోతారు కదా! కాని మనపట్ల ఇదేమి విపరీతన్యాయం? స్నానపానభోజనాదులలో నీకూనాకూ ఏ తేడాలు లేవు. అంతా సమానమే. అయినా నాకెందుకో ముందే వార్ధక్యం వచ్చింది. నీలో ఆ మార్పులేదు. జవజవలాడుతున్నావు. ఆ రహస్యమేమిటో దాచకుండా చెప్పు’మన్నాడు.

ఆ యువతి పయ్యెద జారుతుంటే, పాలిండ్లమీద హారాలు ఊగుతుంటే సిగ్గు కళ్ళతో, కొనగోళ్ళతో వెంట్రుకలు సవరించుకొంటూ ‘స్వామీ! భక్తిసారులనే మునివరులు ఈ నగరసీమలోనే ఉన్నారు. అతనికి కణికృష్ణుడనే శిష్యుడున్నాడు. అతడు భక్తిసారులతో సమానుడే. ఆ ఇద్దరు వాసంచేసే గుహలముందు తగినవిధంగా సేవలు చేశాను. అపుడు భక్తిసారులవారు దయతో నాకు తరగని యౌవనవరం ప్రసాదించారు. అదే పరమరహస్యం. అంతేకాదు. మీకూ ఆ కోరిక ఉంటే ఆ యోగిపదపద్మాలు పూజించి ముసలితనంలేని యౌవనం తెచ్చుకోండి’ అంది. పల్లవరాయడు ప్రాణేశ్వరి మాట విన్నాడు. వెంటనే సభకు వచ్చాడు. సింహాసనంమీద కూర్చొని పరిచారకులను దగ్గరికి రమ్మన్నాడు.

‘పరిచారకులారా! ఈ నగరం వెలుపల ఫణిశాయిమందిరప్రాంతంలో కణికృష్ణుడనే వాడున్నాడు. మీరే మాత్రం అనుమానించకండి. దగ్గరికి వెళ్ళి నేను పిలుస్తున్నానని నా ఆదేశంగా చెప్పండి. వెంటనే వెళ్లి పిలుచుకొని రండి అంటూ పురమాయించాడు.

పరిచారకులు నగరసీమ దాటారు. ఫణిశాయిమందిరందగ్గర ఆగారు. అక్కడే కణికృష్ణ నామధేయుణ్ణి చూచారు. సేవకులు నమస్కరించి, “అయ్యా! మా రాజుగారు శ్రీశ్రీ పల్లవరాయలుగారు కవివర్యులయిన మిమ్ముల్ని తక్షణం వెంటబెట్టుకుని రమ్మన్నారు. ఇది మా రాజు ఆన’ అన్నారు. కణికృష్ణుడు గురువు అనుమతి తీసుకొని పల్లవరాయని కొలువుకూటానికి వెళ్ళాడు. పల్లవరాయడు ఊహించని సంఘటన ఇది.

ఆదేశించగానే వచ్చిన కణికృష్ణులవారికి ఉచితాసనగౌరవమిచ్చాడు. “కణికృష్ణ! మాకొక కోరిక. మీ గురువర్యుల్ని సేవించాలని ఉంది. మీరు వెన్వెంటనే వెళ్ళండి. వారిని మీ వెంబడి పిలుచుకురండి. మీలాగ కవితలు చెప్పేవారు లేరని విని మీ కవితలు వినడానికోసం మిమ్మల్ని రప్పించాను. మీకు సొమ్ములు, చీనాంబరాలు, ఏనుగుదంతాలు కావలసినన్ని ఇస్తాను. రసాత్మకంగా, భావపుష్టితో, వ్యంగ్యచమత్కారంతో నా మీద ఒక పద్యం చెప్పండి’ అన్నాడు.

ఈ మాటలు వినగానే తాపసుడు చిర్రున లేచాడు. 'దుర్మదాంధ! నీ మీద నా కవిత్వమా? నీవిచ్చే వస్తువులపై ఆరాటమా! ఒకవేళ ఇచ్చినా అవన్నీ అనిత్యాలు. సుఖాన్నివ్వని శిలలు. లోహాలు. ఉభయవిభూతులు ఇవ్వగలవా?

మా గురువు సామాన్యుడనుకొన్నావా? శ్రీ మనోహరవదాశ్రిత చక్రవర్తి మా గురువు. సముద్రాలు ఆపోశనం పట్టినవాడు. అరికాల కనులు చూపినవాడు. కడగంట చంద్రకిరణాల ప్రసారించేవాడు. బడబాగ్నిని తాగి కక్కినవాడు. బ్రహ్మదేవుణ్ణి, శివుని లెక్కపెట్టనివాడు. పుట్టి మరణించినవారు, పుట్టినవారు, పుట్టబోయేవారు, భూలోకంవారు, పైలోకం, కిందిలోకం వారు, అక్షపాదుల వారికి ఏ మాత్రం సరికారు.

శౌరిని స్మరించే నేనూ, నా నాలుకా మానవుల్ని పొగడదమా? అయినా నన్నడగడానికి నీవు ఎలా సాహసిస్తావు" అని తన ఆగ్రహాన్ని ప్రకటించాడు. ఈ మాట వినగానే విభీషణుడంటే కోపించిన దశకంఠునిలాగా పల్లవరాయడు ఆగ్రహోదగ్రుడయ్యాడు. కణికృష్ణుని చూచి– "నిన్ను అవమానించలేదే? ఆదరంతో పిలిచాను. మర్యాదలు చేశాను. అయినా నేనిచ్చిన పెద్దరికాన్ని స్మరించకుండా నోటికి వచ్చినట్లు వాగుతున్నావు. నా కవీశ్వరులు తక్కువనుకొంటున్నావా? నీవూ, నీ గురువూ వారికి సరిపోరు పో! ఈ ఆస్థానం వదలి. అంతేకాదు నీవూ, నీ గురువూ నా రాజ్య భూభాగంలో ఉండడానికి వీల్లేదు. వెళ్లిపొండి. ఒకవేళ నా ఆజ్ఞ తిరస్కరిస్తే కఠినంగా శిక్షిస్తాను" అని రుసరుసలాడాడు. కణికృష్ణుడు బెదరలేదు. చెదరలేదు. ఒక మానవమాత్రుని శపించి తన తపస్సు నాశనం చేసుకోవడమా! అనుకోకుంటే ఈ రాజును భస్మం చేయగలవాణ్ణే. నీవు పాలించే ఈ భూభాగంపై నడయాడితే మాకు పాపం చుట్టుకొంటుంది' అంటూ రాజుకేసి చూడకుండా సూర్య బింబాన్ని చూస్తూ కొలువుకూటం దాటాడు. సరాసరి భక్తిసారుని దగ్గరికి వెళ్ళి సర్వస్వం పూసగ్రుచ్చినట్లు విశదం చేశాడు.

స్వామీ! ఆ రాజు పాపి. పాపి పాలించే రాజ్యంలో వాసం చేస్తే మనకూ పాపమే. అంచేత మీ పాదయుగళాన్ని ధ్యానిస్తూ ఎక్కడికయినా వెళ్ళిపోతాను. అనుజ్ఞ ఇవ్వండి' అన్నాడు.

అపుడు భక్తిసారులవారు – 'కణిక్కణ్ణా! నీ కిష్టం లేనిచోట నేను మాత్రం ఎందుకుండాలి? నిన్ను వదలి ఉండగలనా? నేనూ నీ వెంటవస్తాను. నా వెంట నాగేంద్రశాయి కూడా వస్తాడు. అతని వెంట దేవతలందరు బారులు తీరి వస్తారు. ఇది నిజమంటూ' శేషశాయి సన్నిధికి వెళ్ళి ప్రార్థించారు.

"నా తండ్రీ! జగదేకనాథా! గోవిందా! భక్తవత్సలా! ఫణిశాయీ! నీ భక్తభక్తుడయిన కణికృష్ణుడు ఈ భూభాగం పాలించే రాజుతో గొడవపడ్డాడు. ఈ సీమ వదలి వెళ్ళనున్నాడు. అతనితో నేనూ వెళతాను. ఇంక స్వామీ! పాపపడకను చుట్టి చంకలపెట్టుకొని ఎలనాగతో నా వెంట రా. నన్ను మన్నించు' అని ఒక పాట పాడారు. స్వామి భక్తిసారుడు ఆదేశించినట్లే కదిలారు.

యోగి వెంట స్వామి కదలడం త్రేతాయుగంలో విశ్వామిత్రుని వెంట శ్రీరామచంద్రుడు అనుసరించినట్టుగా ఉంది. అంతే కాదు అయోధ్యాపురవాసులంతా అనుసరించినట్లు నిఖిల దేవతలూ కదిలారు. కులగిరులు కుంగాయి. దిక్కులు వక్కలయ్యాయి. సముద్రజలం సలసలకాగింది. నక్షత్రగమనం మారింది. సూర్య రథాశ్వల వేగం తగ్గింది.

ఆదిశేషుడు వణికాడు. సర్వం గతి తప్పింది.

హరిభక్తులలిగితే హరిహరబ్రహ్మాదులయినా ఊరుకొంటారా? దేవేంద్రుని శపించిన దుర్వాసునిలాగ రాజ్యమంతా కావిరి కమ్మింది. చీకట్లు దట్టంగా అలముకొన్నాయి. ఆ మహారాజు పట్టణం, రాజ్యసీమలంతా పాడుకావడం చూచి మంత్రులు రాజుతో చెప్పారు.

